Rni Title Code No. TELTEL02115

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 1 సంచిక : 328 మేడ్చల్ మల్కాజ్‌గిరి 17 డిసెంబర్ 2023 ఆదివారం పేజీలు : 4

## అనర్హతపై జనవరి 10లోగా తేల్చేయండి

### ఫిరాయింపు ఎమ్మెల్యేలపై 'మహా' స్పీకర్‌కు సుప్రీం ఆదేశం

న్యూఢిల్లీ : శివసేన ఎమ్మెల్యేల అనర్హతపై జనవరి 10లోగా నిర్ణ యం తీసుకోవాలని మహారాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ రాహుల్ నర్వేకర్‌ను సుప్రీంకోర్టు ఆదేశించింది. చీలిక నేపథ్యంలో శివసేనలోని ఉద్ధవ్ ఠాక్రే వర్గం, ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే వర్గం ఒకదానిపై మరొకటి ఫిర్యాదులు చేసుకున్నాయి. పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం ప్రకారం అనర్హత వేటు వేయాలంటూ స్పీకరుకు దరఖాస్తు సమర్పించాయి. నిర్ణయాలు తీసుకోవడంలో జాప్యం జరగడంతో సుప్రీంకోర్టులో వ్యాజ్యాలు దాఖల య్యాయి. వీటిపై స్పీకర్ ఆదేశాలు ఇచ్చేందుకు తొలుత డిసెంబరు 31వ తేదీని సుప్రీంకోర్టు గడువుగా నిర్ణయించింది. అయితే స్పీకర్ చేసిన విజ్ఞప్తి మేరకు తాజాగా దాన్ని జనవరి 10 వరకు పొడిగించింది. కాగా, ఎన్సీపీ ఎమ్మెల్యేల అనర్హతపై జనవరి 31లోగా నిర్ణయం తీసుకోవాలంది.

## బీఆర్ఎస్ హయాంలో ప్రజాస్వామ్యం ఖూనీ




హైదరాబాద్ – తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు హాట్ హాట్‌గా సాగుతున్నాయి. గవర్నర్ ప్రసంగానికి ధన్యవాద తీర్మానం సందర్భంగా అధికార పార్టీ కాంగ్రెస్, ప్రతిపక్ష పార్టీ బీఆర్ఎస్ సభ్యుల మధ్య మాటల యుద్ధం జరిగింది. అనంతరం గత పదేళ్ల పాలనపై సీఎం రేవంత్ రెడ్డి తీవ్ర విమర్శలు చేశారు. ఏమిరా.. ఏమిరా తెలంగాణ అంటూ కేసీఆర్ పోకడలను ఉద్దేశించి అందెశ్రీ రాసిన కవితతో సీఎం రేవంత్ రెడ్డి తన ప్రసంగాన్ని ప్రారంభించారు. కుటుంబ పాలనకు వ్యతిరేకంగా తెలంగాణ ప్రజలు తీర్పు ఇచ్చారని.. మేం అనే అహాన్ని తెలంగాణ ప్రజలు తిప్పి కొట్టారని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. తెలంగాణ ప్రజలు విలక్షణ తీర్పు ఇచ్చారన్నారు. తెలంగాణ ప్రజలను BRS సభ్యులు నిరాశపరిచారని.. BRS పాలన కుటుంబపాలనకే పరిమితమవుతుందని నిరూపించారని ఎద్దేవా చేశారు. కాగా గవర్నర్ ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై చర్చలో సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొనగా.. సీఎం ప్రసంగానికి BRS ఎమ్మెల్యేలు అడ్డు తగిలారు. దీంతో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను శాసనసభా వ్యవహారాల మంత్రి శ్రీధర్‌బాబు సముదాయించారు. ప్రగతి భవన్ ప్రజల కోసమే నిర్మించారని.. అది ఇప్పుడు జరుగుతుందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ప్రగతిభవన్ గడీని తెలంగాణ ప్రజలు కోసం బద్దలుకొట్టామన్నారు. ఈటల, గద్దర్‌ను ప్రగతిభవన్‌లోకి రానివ్వకుండా అడ్డుకున్నారని ఆరోపించారు. సభలో BRS సభ్యుల తీరు సరిగా లేదని.. కాంగ్రెస్‌కు ఇంత పెద్ద అవకాశం ప్రజలు కల్పించారని రేవంత్ తెలిపారు. ఎంతో మంది సీనియర్లు ఉన్నా వాళ్లకు బీఆర్ఎస్ పార్టీ అవకాశం ఇవ్వలేదని రేవంత్ ఆరోపించారు. బీఆర్ఎస్ హయాంలో ప్రజాస్వామ్యం ఖూనీ అయ్యిందని విమర్శలు చేశారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీలను తప్పకుండా అమలు చేస్తామన్నారు. ప్రజల సమస్యలు వినడానికి ప్రజా ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. మేనేజ్‌మెంట్ కోటా అంటూ కేటీఆర్‌పై రేవంత్ విమర్శలు చేశారు. అమరుల కుటుంబాలకు BRS కనీస గౌరవం ఇచ్చిందా అని.. ఉద్యమాల పార్టీ.. ధర్నా చౌక్‌ను ఎందుకు తొలగించిందని ప్రశ్నించారు. తొలి కేబినెట్‌లోనే గ్యారెంటీలకు చట్టబద్ధత కల్పించామని స్పష్టం చేశారు. కేబినెట్ నిర్ణయాలకు శాసనసభలో చట్టబద్ధత కల్పిస్తామన్నారు. అమరుల కుటుంబాలను BRS అవమానించిందని.. పార్టీ ఫిరాయించవారికి ఇచ్చిన మర్యాద అమరుల కుటుంబాలకు ఇవ్వలేదన్నారు.

## పదవుల కోసం పెదవులు మూసుకున్నది కాంగ్రెస్ నాయకులే.. మండిపడ్డ కేటీఆర్



హైదరాబాద్ : ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తెలంగాణ ప్రాంతానికి నీళ్లు, నిధుల విషయంలో అన్యాయం జరుగుతున్నప్పటికీ, పదవుల కోసం పెదవులు మూసుకున్నది కాంగ్రెస్ నాయకులే అని బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేటీఆర్ మండిపడ్డారు. శాసనసభలో గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ సందర్భంగా కేటీఆర్ మాట్లాడారు. కాంగ్రెస్ హయాంలో సాగు, తాగునీటికి దిక్కు లేదు. కరెంట్ అనేది అడ్రస్సే లేదు. నల్లగొండలో ఫ్లోరోసిస్‌తో లక్షన్నర మంది నడుములు వంగిపోతుంటే ఒక్క కాంగ్రెస్ ఎమ్మెల్యే కూడా మాట్లాడలేదు. దేవరకొండలో పసిపిల్లల అమ్మకాలు, పాతబస్తీలో మైనార్టీ తీరని బాలికల వివాహాలు, మహబూబ్‌నగర్‌లో గంజి కేంద్రాలు, పాలమూరు నుంచే ప్రతి సంవత్సరం 14 లక్షల మంది వలసలు పోయే వారని కేటీఆర్ గుర్తు చేశారు. సీఎం రేవంత్ రెడ్డి కొడంగల్ నియోజకవర్గంలో ప్రతి రోజు రెండు బస్సులు ముంబైకి పోయేవి. నారాయణపేట, మక్తల్‌లో కూడా ఇదే పరిస్థితి. వలసలు చూసి కన్నీళ్లు కార్చేవారు. మహబూబ్‌నగర్‌లో 50 ఎకరాలు ఉన్న రైతు గుంపు మేస్త్రీగా పని చేసుకునే దుస్థితి. కూలీ చేసుకునే దుస్థితి అని కేటీఆర్ గుర్తు చేశారు. పదేండ్లు విధ్వంసం జరిగిందన్నారు. మరి 50 ఏండ్ల విధ్వంసం గురించి కూడా మాట్లాడాల్సిన అవసరం ఉంది. జీవన విధ్వంసం చెప్పాలి. పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి మాట్లాడుతూ మాజీ సీఎం రాజశేఖర్ రెడ్డి పేరు ప్రస్తావించారు. గత ముఖ్యమంత్రుల పేర్లు తీసుకున్నారు. పొన్నం ప్రభాకర్ ఏపీ చరిత్ర మాట్లాడొద్దు అంటారు. వాస్తవాలు చెప్పాలి కదా..? సాగునీరు, తాగునీరు, కరెంట్ ఇవ్వలేని అసమర్థత గురించి చెప్తే ఉలికిపాటు ఎందుకు..? అని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

## 9వేల 800 పోస్టులతో త్వరలోనే...




## మెగా డీఎస్సీ

హైదరాబాద్ : ఉపాధ్యాయ పోస్టుల భర్తీ కోసం ఎదురుచూస్తున్న అభ్యర్థులకు తెలంగాణ ప్రభుత్వం శుభవార్త అందించబోతోంది. తెలంగాణ రాష్ట్రంలో కొత్తగా కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్ని అంశాలపై సమీక్షా సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగానే మెగా డీఎస్సీపై కూడా ఆయన చర్చిస్తోన్నట్లు తెలుస్తోంది. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు, త్వరలోనే మెగా డీఎస్సీని నిర్వహిస్తారని సమాచారం. ఇందులో భాగంగానే దాదాపు 9వేల 800 ఉపాధ్యాయ పోస్టులతో మెగా డిఎస్సీని నిర్వహించే ఆలోచన చేస్తోన్నట్లు తెలుస్తోంది. నిన్న అసెంబ్లీలో గవర్నర్ తమిళిసై ప్రసంగంలోనూ మెగా డీఎస్సీ ప్రస్తావన వచ్చింది. వచ్చే ఆరు నెలల్లో మెగా డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేస్తారని ఆమె స్పష్టం చేసిన సంగతి తెలిసిందే. గత ప్రభుత్వం మూడున్నర నెలల క్రితం 5,089 పోస్టులు భర్తీ చేసేందుకు నోటిఫికేషన్ కూడా జారీ చేసింది. ఈ నోటిఫికేషన్‌లో స్కూల్ అసిస్టెంట్, సెకండరీ గ్రేడ్ టీచర్, భాషా పండితులు, పీఈటీ పోస్టులు ఉన్నాయి. ఈ పోస్టులకు మొత్తం లక్షా 76వేల 530 అభ్యర్థులు దరఖాస్తులు చేసుకున్నారు. బాలయ్య లైనప్ లో 4 స్టార్ డైరెక్టర్లు ఇందులో సెకండరీ గ్రేడ్ టీచర్ పోస్టులకు అత్యధికంగా 60 వేల 190 దరఖాస్తులు వచ్చాయి. ఈ పోస్టులకు నవంబరు 20 నుంచి 30 వరకు పరీక్షలను నిర్వహించాల్సి ఉండగా, అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఆ పరీక్షలు వాయిదా పడ్డాయి. ఈ క్రమంలోనే తాము అధికారంలోకి వస్తే మెగా డీఎస్సీ నిర్వహిస్తామని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రణాళికలో హామీ ఇచ్చింది. ఇచ్చిన హామీలో భాగంగా ఆ దిశగా అడుగులు వేస్తోంది తెలంగాణ ప్రభుత్వం. అదనంగా 450 ఖాళీలు ఏర్పడ్డాయి... తెలంగాణలోని ప్రభుత్వ పాఠశాలల్లో మొత్తం 9,370 ఉపాధ్యాయ ఖాళీలను డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ద్వారా భర్తీ చేయాల్సి ఉందని, గత జులైలో మంత్రివర్గ ఉపసంఘానికి విద్యాశాఖ స్పష్టతనిచ్చింది. దానికి సంబంధించి గణాంకాలను కూడా సమర్పించింది. విద్యాశాఖ ప్రతిపాదించిన 9,370 ఖాళీలతో పాటు గత అక్టోబరులో స్కూల్ అసిస్టెంట్లకు హెచ్‌ఎంలుగా పదోన్నతులు ఇవ్వడం వల్ల మరో 450 ఖాళీలు అదనంగా వస్తాయని విద్యాశాఖ అంచనా వేసింది. అప్పులకు స్వస్తిబీ అష్టైశ్వర్యాలకు ఐశ్వర్య దీపం.. ఎలా వెలిగించాలి? ఈ లెక్కన మొత్తం 9,820 ఉపాధ్యాయ ఖాళీలు ఉన్నాయి. ఖాళీగా ఉన్న మొత్తం పోస్టులను భర్తీ చేసేందుకు సిద్ధమవుతోంది తెలంగాణ ప్రభుత్వం. గత ప్రభుత్వం ఇచ్చిన డీఎస్సీ నోటీఫికేషన్ రద్దు చేస్తే పలు సమస్యలు వచ్చే అవకాశం ఉందని విద్యాశాఖ భావిస్తోంది. దీంతో ఇప్పటికే భర్తీ చేయాలని నిర్ణయించిన 5,089 పోస్టులతో కలిపి అనుబంధ నోటిఫికేషన్‌ను జారీ చేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.




తెలంగాణ అసెంబ్లీ వేదికగా మాజీ సీఎం కేసీఆర్‌పై సీఎం రేవంత్‌రెడ్డి తీవ్ర విమర్శలు చేశారు. గత ప్రభుత్వ హయాంలో రైతులకు వరి వేయవద్దని చెప్పి కేసీఆర్ మాత్రం తన ఫాంహౌస్‌లో 150 ఎకరాల్లో వరి పండించారని సీఎం రేవంత్ రెడ్డి ఆరోపించారు. కేసీఆర్‌కు ఓ న్యాయం.. రైతులకు ఓ న్యాయం ఉంటుందా అని నిలదీశారు .కమీషన్ల పేరుతో రైతులను దోచుకుంటుంటే %దీ=వా% ప్రభుత్వం ఏం చేసిందని ఆయన ప్రశ్నించారు. ఫాంహౌస్‌లో పండిన ధాన్యాన్ని మద్దతు ధర ఇచ్చి కొన్నారని.. ప్రైవేట్ కంపెనీల మెడపై కత్తిపెట్టి కేసీఆర్ వడ్లు కొనిపించారని ఆరోపించారు. పాలమూరు ప్రజలు ఓట్లేసి ఎంపీగా గెలిపిస్తే.. కేసీఆర్ చేసిందేమిటని సూటి ప్రశ్న వేశారు. పాలమూరు ప్రజలంటే కేసీఆర్‌కు ఎందుకంత వివక్ష అని అడిగారు. పెండింగ్ ప్రాజెక్టులు ఎందుకు పూర్తికాలేదన్నారు. గత ప్రభుత్వం రైతు పంట బీమా అమలు చేసి ఉంటే. రైతు ఆత్మహత్యలు ఉండేవి కాదని సీఎం రేవంత్ అభిప్రాయపడ్డారు. రైతు చావుకు రూ.5 లక్షల వెల కట్టారని.. రైతు బతకడానికి ప్రభుత్వం నుంచి హామీ ఇవ్వాలన్నారు. రైతు బతకడానికి ప్రభుత్వం సాయం చేయాలని.. చనిపోయాక కాదని స్పష్టం చేశారు. రాష్ట్రంలో రైతుల ఆత్మహత్యలు.. %దీ=వా% ప్రభుత్వ హత్యలు కాదా అని అడిగారు. గత పాలకులు రైతును రాజుగా చేస్తే పరిస్థితి ఇలా ఎందుకుంటుందని రేవంత్ అన్నారు. రైతులు చనిపోతుంటే.. రైతు ప్రభుత్వం ఎలా అవుతుందన్నారు. గత ప్రభుత్వంలో ఫోన్‌లో కూడా మాట్లాడే స్వేచ్ఛ ఎమ్మెల్యేలకు ఉండేది కాదన్నారు. తెలంగాణ మాజీ సీఎంపై ఉన్న కేసులు ఎన్ని అని సీఎం రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. కుటుంబ పాలనకు వ్యతిరేకంగా తెలంగాణ ప్రజలు తీర్పు ఇచ్చారని.. తెలంగాణ ఉద్యమకారులపైనా కేసులను తొలగించలేదని ఆరోపించారు. 4 కోట్ల తెలంగాణ ప్రజలను ప్రజాభవన్‌లోకి అనుమతించామని గుర్తుచేశారు. రైతు ఆదాయంలో తెలంగాణ 25వ స్థానంలో ఉందన్నారు. విద్యుత్ తలసరి వినియోగంలో తెలంగాణ అగ్రస్థానంలో లేదని.. ప్రతిపక్షంలో ఉండి కూడా %దీ=వా% ప్రజలను మభ్యపెడుతోందని రేవంత్ మండిపడ్డారు.

## రేవంత్ వర్సెస్ కేటీఆర్

## దూషణల పర్వం

### అసెంబ్లీ వేదికగా పేలిన మాటల తూటాలు



హైదరాబాద్ : తెలంగాణ అసెంబ్లీలో మాటల తూటాలు పేలాయి. బీఆర్ఎస్ నేతలు కేటీఆర్, హరీష్ వర్సస్ సీఎం రేవంత్, మంత్రుల మధ్య డైలాగ్ వార్ సాగింది. గవర్నర్ ప్రసంగం అంతా తప్పుల తడకగా ఉందని బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేసారు. రేవంత్ నామినేటెడ్ సీఎం అని వ్యాఖ్యానించారు. ఎన్నారైలకు ఏమీ తెలియదంటూ రేవంత్ కౌంటర్ ఇచ్చారు. ఎన్నారైలంటే కాంగ్రెస్ సీఎంకు ఎలాంటి అభిప్రాయం ఉందో స్పష్టం అవుతుందని కేటీఆర్ కౌంటర్ చేసారు.

**అసెంబ్లీలో డైలాగ్ వార్ :** శాసనసభలో గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ లో డైలాగ్ వార్ కొనసాగింది. ఇంత దారుణమైన ప్రసంగం రాష్ట్ర శాసనసభ చరిత్రలో వినలేదన్నారు. నాడు సోనియా గురించి రేవంత్ చేసిన వ్యాఖ్యలను సభలో కేటీఆర్ ప్రస్తావించారు. కాంగ్రెస్ హాయం గురించి వివరించారు. ఇందిరమ్మ పాలన అంటే ఏంటో వివరిస్తూ విమర్శలు చేసారు. కాంగ్రెస్ ఎన్నో హామీలు ఇచ్చిందని..వాటికి మార్చి 17 నుంచి అమల్లోకి తేవాల్సి ఉంటుందని గుర్తు చేసారు. హామీలు అమలు చేస్తే పూర్తిగా సహకరిస్తామని..లేకుంటే నిలదీస్తామని చెప్పుకొచ్చారు. ఈ సమయంలోనే సీఎం రేవంత్ జోక్యం చేసుకున్నారు. కొంతమంది ఎన్ఆర్ఐలకు ప్రజాస్వామ్యం గురించి చెప్పినా అర్థం కాదన్నారు. అచ్చోసిన ఆంబోతులా పోడియంకు వస్తాం అంటే సరికాదన్నారు. చీమలు పెట్టిన పుట్టలో జొర్రినట్టు కేటీఆర్ మేనేజ్‌మెంట్ కోటాలో వచ్చారని వ్యాఖ్యలు చేశారు. కేకే మహేందర్ రెడ్డికి అన్యాయం చేశారన్నారు. రేవంత్ వర్సస్ కేటీఆర్ : కేసీఆర్ కు కాంగ్రెస్ ఇచ్చిన అవకాశాల గురించి రేవంత్ వివరించారు. దీనికి హరీష్ స్పందించారు. నాడు తమ కారణంగానే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని చెప్పారు. తెలంగాణ కామన్ మినిమం అజెండాలో చేర్చిన తరువాతనే కేసీఆర్ కేంద్ర మంత్రి పదవి తీసుకున్నారని గుర్తు చేసారు. తాము నాడు కాంగ్రెస్ నుంచి బయటకు వచ్చే సమయంలో చెప్పిన ఆరు కారణాలను హరీష్ వివరించారు. ఇదే సమయంలో మంత్రులు జోక్యం చేసుకొని గత పదేళ్ల కాలంలో జరిగినవి మాట్లాడాలని సూచించారు.

తిరిగి మాట్లాడిన కేటీఆర్ తెలంగాణను తెచ్చిన వ్యక్తిని ఏకవచనంతో సీఎం మాట్లాడారని.. ఈ పదేళ్లలో మా ప్రాణం పణంగా పెట్టి పని చేశామన్నారు కేటీఆర్. మా పదేళ్ల పాలనలో పాలమూరులో వలసలు బంద్ అయ్యాయని గుర్తు చేశారాయన. అనేక రంగాల్లో తెలంగాణ అగ్రగామిగా ఉందన్నారు.

**నామినేటెడ్ సీఎం :** ఎన్నారైలకు టిక్కెట్ అమ్ముకున్నది ఎవరో చెప్పాలని ప్రశ్నించారాయన. తెలంగాణ ప్రజలు ఎన్నుకున్న సీఎం కాదని.. ఢిల్లీ నామినేట్ చేసిన సీఎం అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై కేటీఆర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. తనను ఎన్నారై అని సీఎం రేవంత్ కామెంట్ చేశారని.. పార్టీ అధ్యక్షురాలిని విదేశాల నుంచి తెచ్చుకున్నది ఏ పార్టీయే చెప్పాలని నిలదీశారు.

మొదటి క్యాబినెట్‌లోనే 6 గ్యారంటీలు అమలు చేస్తామన్నారు..ఇప్పటివరకూ ఆ దిశగా ప్రయత్నాలు జరగలేదని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శించారు. బీఆర్ఎస్ పాలనలో తీసుకొచ్చిన సంస్కరణలు..ఫలితాల గురించి కేటీఆర్ వివరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం మేనిఫెస్టోలోని ప్రతి హామిని నిలబెట్టుకోవాలని.. కచ్చితంగా ఆరు గ్యారంటీలను అమలు చేసి తీరాలని చెప్పారు.

## సంపాదకీయం

# మాటల మోడీ.. ఇలాంటి వేళలో కదా మాట్లాడాలి?

మాటలు చెప్పే ప్రధానమంత్రి నరేంద్ర మోడీ హటాత్తుగా తన సహజలక్షణానికి భిన్నంగా మౌనంగా ఉండటం ప్రతి ఒక్కరిని విస్మయానికి గురి చేసేదే. తన గురించి.. తన పాలన గురించి గొప్పలు చెప్పుకునేందుకు విపరీతమైన ఆసక్తిని ప్రదర్శించే ప్రదానమంత్రి.. ఏదైనా కష్టం వచ్చినా.. సమస్య ఎదురైనా.. సవాలు విసిరినా.. సంక్షోభ సమయాల్లో మాట్లాడకుండా మౌనంగా ఉండటంలో అర్థం లేదని చెప్పాలి. గడిచిన తొమ్మిదిన్నరేళ్ల కాలంలో ఏ రోజు కూడా తమకు ప్రతికూల వాతావరణం ఉందని భావించినా.. ప్రతికూల పరిస్థితులు ఎదురైనా మోడీ మౌనమునిగా మారిపోతారు. ఎలాంటి స్పందన లేకుండా ఉండిపోయే మోడీషాలు.. కనీసం పార్లమెంటు కు కూడా హాజరు కాకపోవటాన్ని తీవ్రంగా తప్పు పడుతున్నారు. అనూహ్య పరిణామం ఏర్పడినప్పుడు ప్రభుత్వం సమాధానం చెప్పాల్సిన అవసరం ఉంది. పార్లమెంటులోకి చొరబడిన సామాన్యులు.. పొగ వస్తువుల్ని సభలో వదిలేలా చేసే పరిస్థితి వచ్చిందంటేనే భద్రతా సిబ్బంది నిర్లక్ష్యం.. నిఘా విభాగం లోపమే కారణమని చెప్పాలి. మరి.. ఇలాంటి వేళ.. జరిగిన తప్పుల్ని.. గుర్తించిన లోపాల్ని బాధ్యతగా సభకు వివరించాల్సిన అవసరం మోడీ ప్రభుత్వానికి లేదా? అన్నది పెద్ద ప్రశ్న. అన్నింటికి మించి బాధ్యత వహించాల్సి ఉందని గుర్తించకపోవటం దేనికి నిదర్శనం? గొప్పలు చెప్పుకోవటానికి సభను వాడేసే మోడీషాలు.. సంక్లిష్ట పరిస్థితుల్లో ముఖం చాటేయటం మంచి సంప్రదాయం అవుతుందా? విలువలు.. నీతులు బోధిస్తూ ప్రసంగాలు చేసే ప్రధానమంత్రి.. పార్లమెంటులో తాజాగా చోటు చేసుకున్న పరిణామాల మీద మాట్లాడాల్సిన అవసరం ఉంది కదా? ప్రతిపక్షాల ప్రశ్నలన్నింటికి సమాధానం ఇవ్వటం సాధ్యం కాకపోవచ్చు. కానీ.. చట్టసభలోకే ఆందోళనకారులు వచ్చేంత దైన్యం దేనికి నిదర్శనం? ఆందోళన పేరుతో ఆగంతకుల ఆరాచకానికి బాధ్యులుగా పేర్కొంటూ ఏడుగురు అధికారుల్ని సస్పెండ్ చేయటంతో సమాధానం ఇచ్చేసినట్లు కాదు కదా? ఆ మాటకు వస్తే.. ఆగంతకులకు పార్లమెంటులో అడుగు పెట్టేందుకు వీలుగా పాసులు జారీ చేసిన బీజేపీ ఎంపీ మీద ఎలాంటి చర్యలు తీసుకున్నారు? అన్నది కూడా ముఖ్యమే కదా? కనీసం.. ఆ విషయం మీద అయినా మాట్లాడాలి కదా? ఆయన మీద కేసులు పెట్టాలి కదా? ఇవేమీ లేకుండా సభకు రాకుండా.. ముఖం చాటేయటం సమాధానం అయితే కాదు కదా? మాట్లాడే ప్రధాని మోడీ.. సంక్లిష్ట పరిస్థితుల్లో మౌనంగా ఉండటం సమస్యలకు సమాధానం కాదు.

# కేంద్ర ప్రభుత్వ పథకాలు ప్రజలకు చేర్చడమే వికసిత్ భారత్ సంకల్పయాత్ర లక్ష్యం

## రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందరరాజన్

### కేంద్ర ప్రభుత్వ పథకాలు లబ్ధిదారులకు అందేలా సంబంధిత శాఖలు కృషి చేయాలి : మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్







జిల్లా బ్యూరో మేడ్చల్ – మల్కాజిగిరి జిల్లా : కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల వద్దకు చేర్చేడమే వికసిత్ భారత సంకల్పయాత్ర ముఖ్య లక్ష్యమని రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ అన్నారు. శనివారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా శామీర్పేట మండలం పరిధిలోని బొమ్మరాస పేట గ్రామంలో ఏర్పాటు చేసిన వికసిత్ భారత సంకల్పయాత్ర కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ హాజరయ్యార. ముందుగా ప్రధానమంత్రి వివిధ రాష్ట్రాలకు చెందినా లబ్దిదారులతో సంబంధిత పథకాలపై వారి అభిప్రయాలను తెలుసుకునే కార్యక్రమాన్ని ఆన్లైన్ మాద్యమం ద్వార గవర్నర్, అడిషనల్ సెక్రటరీ అండ్ ఫైనాన్షియల్ అడ్వైజర్ గవర్నమెంట్ ఆఫ్ ఇండియా శాంత్ మను, జిల్లా కలెక్టర్ గౌతమ్ అందరు కలసి వేదికపై నుండి వీక్షించారు. అనంతరం జిల్లాలో ఈనెల 16 నుండి జనవరి 26వ తేదీ వరకు నిర్వహించనున్న భారత్ వికసిత్ సంకల్ప్ యాత్రకు సంబంధించి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన సంకల్ప యాత్ర రథాన్ని తెలంగాణ రాష్ట్ర గవర్నర్ డాక్టర్ తమిళిసై సౌందర రాజన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల వద్దకు చేర్చుడంలో సంకల్ప యాత్ర రథాల పాత్ర కీలకమని ఆమె అన్నారు. దేశవ్యాప్తంగా 3 వేలకు పైగా సంకల్పయాత్ర రథాల ద్వారా ప్రజలకు కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించడం జరుగుతుందని తెలిపారు. అంతేకాకుండా సంకల్పరథం గ్రామానికి వచ్చిన సమయంలోనే లబ్ధిదారులకు అక్కడే లబ్ధి అందే విధంగా సంబంధిత శాఖల స్టాళ్ళ ఏర్పాటు చేయడం ద్వారా అక్కడే వారికి పథకానికి సంబంధించిన లబ్ధి చేకూరేలా కృషి చేయడం జరుగుతుందని గవర్నర్ తెలిపారు.

ఇక కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఆయుష్మాన్ భారత్, గరీబ్ కళ్యాణ్, అన్న యోజన, దీన్ దయాల్ అంత్యోదయ యోజన, ఆవాస్ యోజన, ఉజ్వల యోజన, కిసాన్ సమ్మాన్ నిధి, జీవనజ్యోతి భీమా యోజన వంటి పథకాలపై గ్రామాలలో ప్రజలకు అర్థమయ్యే విధంగా వికసిత్ భారత్ సంకల్ప యాత్ర ద్వారా అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతు ందని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ తెలిపారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను అర్హులైన లబ్ధిదారుల చెంతకు తీసుకువెళ్ళి వారికి పూర్తి స్థాయిలో తెలియజేయడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ వాహనాలలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సందేశం, ఆడియో వీడియోతో పాటుగా ఎల్ఈడీ స్క్రీన్స్ ద్వారా గ్రామంలో కేంద్ర ప్రభుత్వ పథకాలను వివరించి ప్రజలకు తెలియజేయడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ గౌతమ్ తెలిపారు. కార్యక్రమ చివరిలో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలకు సంబంధించి ఏర్పాటు చేసిన స్టాల్ల్ ను గవర్నర్ తమిళిసై సౌందరరాజన్, జిల్లా కలెక్టర్ గౌతమ్ తదితరులు సందర్శిం చారు. కార్యక్రమంలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా లోకల్ హెడ్ ఆఫీస్, హైదరాబాద్ జనరల్ మేనేజర్ మంజుల శర్మ, కెనరా బ్యాంక్ సర్కిల్ ఆఫీస్ హైదరాబాద్ జనరల్ మేనేజర్ చంద్రశేఖర్, మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ ఐ శ్రీనివాసులుతో పాటుగా జిల్లా అధికారులు, మండల ఎంపీపీ ఏళ్ళుబాయ్, జడ్పిటిసి అనిత లాలి, బొమ్మరాసిపేట గ్రామ సర్పంచ్ గీతా మహేందర్, ఎంపీటీసీ ఇందిరా నరసింహారెడ్డి, అధిక సంఖ్యలో ప్రజలు, పాల్గొన్నారు.

# డ్రోన్ వాడకంతో రైతుకు దన్ను





జిల్లా బ్యూరో మేడ్చల్ – మల్కాజిగిరి జిల్లా : సామాన్య యూరి యా కన్నా నానో యూరియా వాడటం వల్ల పంటకు రెట్టింపు లాభం వస్తుందని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతం అభిప్రాయపడ్డారు. కేంద్ర ప్రభుత్వం రైతుకు సాంకేతికంగా దన్నుగా నిలిచేందుకుగాను పురుగుల మందు లేదా నానో యూరియా పిచికారి చేసేందుకు గాను డ్రోన్ల వాడకానికి చేయూతనిస్తుంది. ఇక ఈ డ్రోన్ల పనితీరు పరిశీలించేందుకు వికసిత్ భారత్ సంకల్పయాత్ర కార్యక్రమం వేదిక అయింది. కార్యక్రమం అనంతరం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ సమక్షంలో డ్రోన్లతో పంటపై పిచికారి చేసి డ్రోన్ల పనితీరుని చూపించారు. ఇక ఈ డ్రోన్లు కొనుక్కునేందుకు రైతులకు ప్రత్యేకంగా కేంద్ర ప్రభుత్వం వడ్డీలేని రుణాలను అందిస్తుంది.

# క్రీడా ప్రాంగణ ఏర్పాటులో నిర్లక్ష్యం

జగిత్యాల : ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన క్రీడా ప్రాంగణాల ఏర్పాటులో అధికారుల నిర్లక్ష్యంతో లక్ష్యం చేరడం లేదు. పురపాలికల్లోని చిన్నారులు ఆటలు ఆడుకునేందుకు వీటిని ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. మెట్‌పల్లి బల్దియా పరిధిలోని 26 వార్డుల్లో క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేయాలని పట్టణ ప్రగతి నిధులు రూ.30 లక్షలు కేటాయించారు. పట్టణంలో ప్రభుత్వ స్థలాల కొరతతో ప్రభుత్వ లక్ష్యం నెరవేరడం లేదు. ఇప్పటివరకు 13 మాత్రమే ఏర్పాటు చేశారు.

**అవగాహన కరవు**

ప్రజలు సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలనే ఆలోచనతో ఏర్పాటు చేసిన క్రీడాప్రాంగణంలో వాలీబాల్ కోర్ట్, ఖోఖో, కబడ్డీ కోర్ట్‌లతో పాటు పలు రకాల వ్యాయామ పరికరాలు, లాంగ్‌జంప్, తదితర వాటిని




ఏర్పాటు చేసి ప్రజలకు అందుబాటులో ఉంచాలి. స్థలాల కొరతతో పరికరాలు బిగించి వదిలేస్తున్నారు. ఆయా వార్డులలో ఏర్పాటు చేసిన ప్రాంగణాలపై అవగాహన కల్పించక పోవడంతో నిరుపయోగంగా మారుతున్నాయి.

**గేట్‌వాల్వ్ గుంత**

పట్టణంలో ఫిల్టర్‌బెడ్ వద్ద ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణంలో సగం వరకు ఫిల్టర్‌హౌజ్‌లు, గేట్‌వాల్స్, పెద్ద సంపు, ఉద్యోగులు ఉండే మూడు గదులు ఉంటాయి. ఇవన్నీ ఉండగా ఇక్కడే క్రీడాప్రాంగణం ఏర్పాటు చేశారు. ఇందులో వాలీబాల్ కోర్ట్ ఏర్పాటు చేశారు. దీనిని ఆనుకునే మిషన్ భగీరథ గేట్‌వాల్వ్ గుంత ఉండడంతో ఎలా ఆడాలని క్రీడాకారులు వాపోతున్నారు. కళానగర్‌లోని సరస్వతి శిశుమందిరం ప్రైవేటు పాఠశాలలో క్రీడాప్రాంగణాన్ని ఏర్పాటు చేశారు. పాఠశాల ముగిసిన తర్వాత యాజమాన్యం గేట్‌కు తాళం వేసి వెళ్తారు. ఈ విషయంపై బల్దియా ఏఈ అరుణ్‌కుమార్‌ను వివరణ కోరగా క్రీడాప్రాంగణాలను వార్డుకు ఒకటి చొప్పున ఏర్పాటు చేయాల్సి ఉందన్నారు. స్థలాల కొరతతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని, స్థలాలు ఉన్నచోట్ల ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.

# తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి



హైదరాబాద్ :తెలంగాణ ఉద్యమకారుల మద్దతుతో కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో అఖండ విజయం సాధించిందని తెలంగాణ ప్రజా సమితి అధ్యక్షురాలు నీరా కిషోర్ అన్నారు. శనివారం సాయంత్రం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలోతెలంగాణ ప్రజా సమితి ఆధ్వర్యంలో తెలంగాణ ఉద్యమకారుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో గత తొమ్మిది సంవత్సరాల నియంత పాలన ఈ ఎన్నికల్లో తొలగిపోవడం సంతోషకరమైన విషయమన్నారు.గత నెల రోజుల క్రితం ప్రజా సమితి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ నాయకులతో మాట్లాడడం జరిగిందని తెలిపారు. ప్రజా సమితి తో పాటు తెలంగాణ ఉద్యమకారులు సంపూర్ణ మద్దతు ఇవ్వడంతో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి పూర్తి మద్దతు ఇస్తామని వారికి విశ్వాసం కలిగించమని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే30 రోజుల్లో ఉద్యమకారుల సంక్షేమం, గుర్తింపు కోసం ఒక ప్రత్యేక కమిటీ వేస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. తెలంగాణ ఉద్యమకారుల డిమాండ్ల పరిష్కారం కోసం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని కోరారు.

# పరికరాల కొరత.. వసతుల లేమి

గోదావరిఖని: వందేళ్లకు పైగా చరిత్ర ఉన్న సింగరేణిలో కార్మికులకు సౌకర్యాలు నేటికీ మెరుగుపడటం లేదు. కనీసం వారికి సరఫరా చేసే పనిముట్ల విషయంలో నిర్లక్ష్యం కనిపిస్తోందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. రక్షణ పరికరాల్లో నాణ్యత లోపిస్తోంది. బొగ్గు ఉత్పత్తిలో రికార్డు సాధిస్తున్న సింగరేణి గనుల్లో పనిచేసే కార్మికులకు సౌకర్యాలు అంతంత మాత్రంగానే ఉన్నాయి. బొగ్గు ఉత్పత్తిలో శ్రమించే కార్మికులకు వారుచేసే పనికి సంబంధించిన పనిముట్లు సైతం అందుబాటులో ఉండటం లేదు. అవసరం మేరకు పనిముట్లు లేకపోవడంతో ఉన్న వాటితోనే సర్దుకుని పనిచేయాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. కార్మిక సంఘాలు ప్రతి ఎన్నికల్లో సంక్షేమాన్ని ప్రస్తావిస్తున్నా వాటిని అమలు చేయించడంలో విఫలమవుతున్నాయి. ఇప్పటి వరకు ఆరుసార్లు ఎన్నికలు జరిగినా కార్మికుల సౌకర్యాలు మాత్రం మెరుగుపడటం లేదు. కనీసం పని స్థలాల్లో మౌలిక వసతులు లేవని కార్మికులు వాపోతున్నారు. గుర్తింపు ఎన్నికల్లో అనేక వాగ్దానాలు చేస్తున్న కార్మిక సంఘాలు ఈసారైనా కార్మికుల సంక్షేమం.. సౌకర్యాలపై దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

సంక్షేమం ఉత్త మాటే

గనులపై కార్మికుల సంక్షేమం కానరావడం లేదు. కనీసం దుస్తులు భద్రపరుచుకునేందుకు ర్యాక్‌లు ఏర్పాటు చేస్తామన్న హామీ అమలుకు నోచుకోలేదు. డ్యూటీ దుస్తులతో పాటు బూట్లు, ఇతర సామగ్రిని భద్రపరచుకునేందుకు ప్రతి గనిపై లాకర్లు ఏర్పాటు చేస్తామన్న విషయాన్ని ఎవరు పట్టించుకోలేదు. గత ఎన్నికల సమయంలో ఈ విషయాన్ని ప్రస్తావించినా ఇప్పటి వరకు ఏ ఒక్క గనిలో వాటిని ఏర్పాటు చేయలేదు. ఒకటి రెండు గనుల్లో ప్రయోగాత్మకంగా లాకర్ల కోసం పనులు మొదలు పెట్టినా వాటిని మధ్యలోనే నిలిపివేశారు. కార్మికులు



తమ దుస్తులు భద్రపరచుకోవడానికి గనులవద్ద చెక్కపెట్టెలు తయారు చేసుకుని వాటిలో దాచుకుంటున్నారు. బూట్లకు తాళాలు వేసుకుని కాపాడుకుంటున్నారు. గనుల్లో పనులు ముగించుకుని బయటకు వచ్చే కార్మికులు స్నానాలు చేసేందుకు గనులపై గదులు ఏర్పాటు చేయాలన్న విషయాన్ని అధికారులు విస్మరించారనే ఆరోపణలున్నాయి. స్నానానికి అవసరమైన వేడి నీళ్ల కోసం బాత్‌రూంలలో గీజర్లు ఏర్పాటు చేయిస్తామన్న హామీలు ఇప్పటికీ నెరవేరలేదు. గనులపై అల్పాహారం కోసం ఏర్పాటు చేసిన క్యాంటీన్‌లలో శుభ్రత పాటించడం లేదని పలువురు అంటున్నారు. వీటిపై సంఘాలు దృష్టి సారించాలని కార్మికులు కోరుతున్నారు.

అరకొర సామగ్రితోనే గనుల్లోకి..

బొగ్గుగనుల్లో పనిచేసే కార్మికులకు అవసరమైన పనిముట్లు అందుబాటులో లేకపోవడంతో అరకొర సామగ్రితోనే గనుల్లోకి వెళుతున్నారు. కోల్‌కట్టర్‌లు వినియోగించే డ్రిల్‌రాడ్‌లు, డ్రిల్‌బిట్‌లు సక్రమంగా సరఫరా చేయకపోవడంతో ప్రతీరోజు ఉన్న వాటితోనే పనులు చేయాల్సి వస్తుంది. అరిగిపోయిన డ్రిల్‌రాడ్‌లను రెండు అతికించుకుని పనిచేస్తున్న సందర్భాలున్నాయి. నాణ్యత లేని డ్రిల్‌బిట్‌లు సరఫరా చేయడంతో కొద్ది కాలానికే అవి పనిచేయకుండా పోతున్నాయి. వాటిని తిరిగి పదును చేయించుకుని పనులు చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. వీటితో పాటు బొగ్గు, మెటీరియల్ రవాణాతో పాటు కార్మికులను గనుల్లోకి తీసుకెళ్లేందుకు వినియోగించే మ్యాన్‌రైడింగ్‌ల కోసం ఏర్పాటు చేసే ట్రాక్‌లైన్‌లు సైతం సక్రమంగా లేవని పలువురు కార్మికులు ఆరోపిస్తున్నారు. సాంకేతిక సిబ్బంది వినియోగించే పరికరాలు, పంపు మోటార్లకు సంబంధించిన మెటీరియల్ అందుబాటులో ఉండటం లేదు. కన్వేయర్ బెల్టు నడిచేందుకు అవసరమైన బేరింగ్‌లు కూడా సకాలంలో అందుబాటులో ఉండటం లేదు.

# 17 రోజులే గడువు

హుజూరాబాద్: ఉమ్మడి జిల్లాలో 2022-23 వానాకాలం, యాసంగి సీజన్‌లకు సంబంధించి మిల్లులకు కేటాయించిన కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) ఈ నెల 31వ తేదీ లోపు పూర్తిస్థాయిలో తిరిగి అప్పగించాల్సి ఉంది. కానీ రెండు సీజన్ల బియ్యం సేకరణ లక్ష్యాలే ఇంకా పూర్తి కాలేదు. ఇంకా కేవలం 17 రోజుల గడువు మాత్రమే మిగిలి ఉంది. ఈలోగా బియ్యం అప్పగించడం అసాధ్యమని మిల్లర్లే చెబుతున్నారు. కేటాయించిన ధాన్యం మిల్లర్ల వద్ద ఉంటే ఇప్పటికే మరాడించిన బియ్యాన్ని తిరిగి ఇచ్చేవారు. కానీ కొందరు మిల్లర్లు ధాన్యాన్ని పక్కదారి పట్టించడం వల్లే సకాలంలో సీఎంఆర్ లక్ష్యాలు పూర్తవడం లేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఉమ్మడి జిల్లాలో గతేడాది వానాకాలంలో 11.53 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని 350 మిల్లులకు సీఎంఆర్ కింద కేటాయించారు. ఈ ధాన్యాన్ని మరాడించి 7.73 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని మిల్లర్లు అప్పగించాల్సి ఉంది. కానీ ఇప్పటి వరకు 4.56 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని మాత్రమే అప్పగించారు. ఇంకా 3.17 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం తిరిగివ్వాల్సి ఉంది. అంటే వానాకాలంలో 58 శాతమే సేకరణ జరిగింది. ఇక యాసంగిలో 13.36 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మిల్లులకు కేటాయించగా 9.20 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం అప్పగించాల్సి ఉంది. ఇప్పటి వరకు కేవలం 1.72 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని మాత్రమే అప్పగించారు. ఇంకా 7.48 లక్షల మెట్రిక్ టన్నులు ఇవ్వాల్సి ఉంది. కేవలం 18 శాతమే బియ్యం సేకరణ పూర్తయింది. రెండు సీజన్‌లకు సంబంధించి 16.93 మెట్రిక్ టన్నుల బియ్యానికి గానూ 6.29 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే తిరిగి ఇచ్చారు. 10.64 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం మిల్లర్లు అప్పగించాల్సి ఉండగా ఈ నెల 31లోగా ఎలా లక్ష్యాన్ని పూర్తి చేస్తారనేది ప్రశ్నార్థకంగా మారింది. పలుమార్లు గడువు పొడిగించినా సీఎంఆర్ తిరిగివ్వని మిల్లర్ల నుంచి గడువులోగా సేకరించడం సంబంధిత అధికారులకు సవాలుగా మారిందనే చెప్పవచ్చు. కాగా గడువులోగా బియ్యం అప్పగించాలని మిల్లర్లను ఆదేశించామని పౌరసరఫరాల సంస్థ కరీంనగర్ డీఎం రజనీకాంత్ స్పష్టం చేశారు.

ధాన్యం నిల్వలపై అనుమానాలు? ఒక సీజన్‌లో సీఎంఆర్ కింద తీసుకున్న ధాన్యాన్ని మరాడించి మరో సీజన్ ధాన్యం వచ్చే సమయం కంటే ముందే బియ్యం తిరిగి అప్పగించాలి. 2022-23 వానాకాలం, యాసంగి సీజన్‌లు ముగిసినా వేలాది మెట్రిక్ టన్నుల బియ్యం పౌరసరఫరాలశాఖ, ఎఫ్‌సీఐకు ఇవ్వాల్సి ఉంది. వాస్తవానికి గత సెప్టెంబరు 30న సేకరణ గడువు ముగిసినా బియ్యం మాత్రం తిరిగివ్వలేదు. మిల్లుల్లో ధాన్యం లేకపోవడం వల్లే మరాడించిన బియ్యం తిరిగి ఇవ్వడం లేదనే ఆరోపణలున్నాయి. నాలుగైదు నెలల క్రితం టాస్క్‌ఫోర్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంటు అధికారులు ఉమ్మడి జిల్లాలోని 11 మిల్లులను తనిఖీ చేశారు. వీటన్నింటిలో సీఎంఆర్ కింద కేటాయించిన వేలాది క్వింటాళ్ల ధాన్యం నిల్వలు మాయమైనట్లు గుర్తించారు. వారం రోజులపాటు తనిఖీల పేరిట హడావుడి చేసిన అధికారులు ఆ తరవాత వదిలేశారు. మిగతా మిల్లుల్లో ఎలాంటి తనిఖీలు నిర్వహించలేదు. సీఎంఆర్ ధాన్యం నిల్వలు లేవని తెలిసినా రాజకీయ పలుకుబడి కలిగిన మిల్లర్ల జోలికి అసలే వెళ్లలేదనే ఆరోపణలు ఉన్నాయి.

# అధికారుల్లో బదిలీల గుబులు!



కరీంనగర్: కొత్త సర్కారు కొలువుదీరడంతో కీలకమైన పోలీసు, రెవెన్యూ శాఖల్లో బదిలీల చర్చ జరుగుతోంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఈ రెండు శాఖల్లో మార్పులు చేర్పులకు ఎక్కువగా అవకాశం ఉండనుందన్న ప్రచారం ఉంది. శాసనసభ ఎన్నికల ఫలితాల తరువాత ఇన్నాళ్లు గత ప్రభుత్వానికి అనుకూలంగా పనిచేశారనే ఆరోపణలున్న అధికారుల్లో ఒకింత గుబులు పెరుగుతోంది. తమపై వేటు పడుతుందని ఊహించిన వారంతా స్థానచలనాల దిశగా సంసిద్ధమవుతున్నారు. ఎందుకైనా మంచిదని ముందు జాగ్రత్తగా తమకు తోచిన తరహాలో ఇప్పటి నుంచే పైరవీల బాట పడుతున్నారు. ముఖ్యంగా పోలీసు, రెవెన్యూ శాఖలో నాలుగు జిల్లాల పరిధిలో త్వరలోనే పెద్ద మొత్తంలో బదిలీలు ఉండే అవకాశముంది. ప్రస్తుతం రాష్ట్రస్థాయిలో ఐఏఎస్, ఐపీఎస్‌ల స్థానచలనాలు ఎక్కువగానే జరుగనున్నాయనే చర్చ జరుగుతోంది. ఇదే సమయంలో జిల్లాల్లోనూ ఏసీపీ, సీఐ, ఎస్సై స్థానాలతో పాటు కొన్నిచోట్ల ఆర్డీవో, తహసీల్దార్‌ల విషయంలో మార్పులు చేర్పులు ఉండే అవకాశం లేకపోలేదు.

ఏళ్ల తరబడి ఇక్కడే..? ఎస్సై మొదలుకొని ఏసీపీ స్థాయి వరకు కొంతమంది పోలీసులు ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోనే ఏళ్ల తరబడి పనిచేస్తున్నారు. గత నెలలో జరిగిన శాసనసభ ఎన్నికల సందర్భంగా పోలీసు, రెవెన్యూ శాఖల్లో బదిలీలు జరిగినా పక్క పక్క జిల్లాల్లోనే పోస్టింగ్‌లుండేలా కొందరు ప్రయత్నాలు చేసి సఫలీకృతమయ్యారు. ఎన్నికల తరువాత మళ్లీ పాత పోస్టింగ్‌లకు రావాలని పలువురు భావించారు. సర్కారు మారడంతో ఇప్పుడు తమ పరిస్థితి ఏంటని వారు ఆందోళన చెందుతున్నారు. తెలిసిన నేతల ద్వారా నచ్చిన చోటుకు వెళ్లేందుకు జోరుగా ప్రయత్నాల్ని చేస్తున్నారు. ఇటీవల కొత్తగా గెలిచిన ఎమ్మెల్యేలను మర్యాద పూర్వకంగా కలవడం పేరుతో వెళ్లి తమ మనసులో మాటను వారి చెవిన వేస్తున్నారు. గతం ఎలా ఉన్నా.. ప్రస్తుతం మాత్రం వారెలా చెబితే అలా అనే సంకేతాలిస్తున్నారనే చర్చ జరుగుతోంది.

ఉన్నతాధికారుల పరిస్థితి? ఇటీవల శాసనసభ ఎన్నికల్ని నాలుగు జిల్లాల కలెక్టర్లు, ఎస్పీ, సీపీలు సక్రమంగా నిర్వహించారనే గుర్తింపు వచ్చింది. ముఖ్యంగా పోలింగ్ శాతం పెరుగుదల సహా ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు ముగిసే విషయంలో జిల్లాల ఉన్నతాధికారులు చొరవ చూపించారు. ఎన్నికల ముందరే కొందరు అధికారులను కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాలతో అత్యవసరంగా బదిలీ చేశారు. వారి స్థానంలో వచ్చిన వారంతా తమ పనితీరుతో ప్రత్యేక ముద్ర వేసుకున్నారు. త్వరలోనే గ్రామ పంచాయతీ, పార్లమెంటు, స్థానిక సంస్థల ఎన్నికలు వరుసగా ఉండనుండటంతో వీరిని యథావిధిగా కొనసాగిస్తారనే మాటలు వినిపిస్తున్నాయి. ఇక ఆయా శాఖల జిల్లా అధికారుల విషయంలో కొన్నిచోట్ల మార్పులకు అవకాశముందనే ప్రచారం జరుగుతోంది. కీలకమైన వ్యవసాయ, పౌర సరఫరాలు, పరిశ్రమలు, విద్య, వైద్యం సహా ఇతర విభాగాల జిల్లా బాధ్యులు ఏళ్ల తరబడి ఒకే దగ్గర పని చేస్తున్నవారున్నారు. వారి విషయంలో కొత్త సర్కారు తగిన దృష్టి పెడితే బదిలీలు అనివార్యమవనున్నాయన్న చర్చ జరుగుతోంది. అలా అయితే నాలుగు పరిధిలో ముున్ముందు భారీ బదిలీల జాతరనే ఉండనుంది.

# వివరాల నమోదుపై మహాలక్ష్మి ప్రభావం




పెద్దపల్లి: గ్యాస్ వినియోగదారులు ఏజెన్సీల వద్ద వ్యక్తిగత వివరాలు(ఈ-కేవైసీ) నమోదు చేసుకోవాలని కేంద్ర ప్రభుత్వం సూచించింది. మరోవైపు తాము అధికారంలోకి వస్తే 'మహాలక్ష్మి' పథకం కింద రూ.500కే గ్యాస్ సిలిండరును అందిస్తామని కాంగ్రెస్ ఎన్నికల సమయంలో హామీ ఇచ్చింది. దీంతో కొద్ది రోజులుగా ఏజెన్సీ కార్యాలయాలకు వినియోగదారుల తాకిడి పెరిగింది. ఈ-కేవైసీ నమోదుకు గడువు ఏమీ లేదని అధికారులు చెబుతుండగా, ఆలస్యమైతే పథకానికి తాము దూరమైతామేమోనని లబ్ధిదారులు ఆతృత పడుతున్నారు.

కేంద్ర ప్రభుత్వం 'ప్రధానమంత్రి ఉజ్వల యోజన'(పీఎంయూవై) కింద గతంలో పేద మహిళలకు ఉచిత గ్యాస్ కనెక్షన్లు అందజేసింది. ఉమ్మడి కరీంనగర్ జిల్లావ్యాప్తంగా ఈ పథకం కింద దాదాపు 1,56,000 మంది మహిళలు లబ్ధి పొందారు. వీరందరూ సమీపంలోని గ్యాస్ ఏజెన్సీలకు వెళ్లి తమ వేలిముద్రలను, అప్‌డేట్ చేసిన ఆధార్, గ్యాస్ పాస్‌పుస్తకాల వివరాలను నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు చమురు సంస్థలు కేవలం ఉజ్వల పథకం లబ్ధిదారులు మాత్రమే ఈ కేవైసీ వివరాలు ఇవ్వాలని కోరాయి. అయితే రాష్ట్ర ప్రభుత్వం రూ.500కే గ్యాస్ సిలిండరు అందజేసేందుకే ఈ వివరాలు ఇవ్వమంటున్నారని భావించి వినియోగదారులందరూ ఏజెన్సీల బాట పడుతున్నారు. హెచ్‌పీ, ఇండియన్, భారత్ తదితర చమురు సంస్థల డీలర్లు కూడా ఈ విషయంలో అవగాహన కల్పించకపోవడం గమనార్హం.

13.38 లక్షల కనెక్షన్లు

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా మొత్తం 13.38 లక్షల గ్యాస్ కనెక్షన్లున్నాయి. అందులో 10.77 లక్షలు గృహావసర, 2.61 లక్షలు వాణిజ్య అవసరాలవి. పెరిగిన ధరలతో ఇప్పటికే గృహావసర వినియోగదారులపై రూ.5.40 కోట్లు, వాణిజ్య వినియోగదారులపై రూ.9.14 కోట్ల భారం అదనంగా పడుతోంది. 14.2 కిలోల గృహావసరాల సిలిండరు ధర ప్రస్తుతం రూ.975 ఉండగా, రాయితీ కింద ప్రభుత్వం వినియోగదారుల బ్యాంకు ఖాతాల్లో రూ.47 చొప్పున జమ చేస్తోంది. ఇక ఉజ్వల వినియోగదారులు కూడా రూ.975 చెల్లిస్తుండగా వారికి రూ.200 చొప్పున రాయితీ ఖాతాల్లో జమవుతోంది. ప్రస్తుతం వాణిజ్య సిలిండరు ధర రూ.2,058గా ఉంది.

ఉజ్వల లబ్ధిదారుల వివరాలు మాత్రమే..


కేంద్ర ప్రభుత్వం, చమురు సంస్థల ఆదేశాల మేరకు ప్రస్తుతానికి మేం ఉజ్వల పథకం లబ్ధిదారుల నుంచి మాత్రమే ఈకేవైసీ వివరాలు సేకరిస్తున్నాం. కొన్ని కంపెనీల ఏజెన్సీలు మాత్రం ఉజ్వలతో పాటు ఇతర వినియోగదారుల నుంచి వివరాలు సేకరిస్తున్నారు.
టి.ప్రవీణ్‌కుమార్, జిల్లా ఎల్‌పీజీ ఏజెన్సీల సంఘం అధ్యక్షుడు, పెద్దపల్లి

ఆందోళన వద్దు.. గడువేమీ లేదు

భగత్‌నగర్: గ్యాస్ వినియోగదారులు ఆందోళన పడొద్దు. ఈకేవైసీ నమోదుకు చివరి తేదీ అంటూ ఏదీ లేదు. ఏజెన్సీల వద్దకు నిత్యం వందల మంది వినియోగదారులు వస్తుండటంతో సర్వర్ మొరాయిస్తోంది. గడువు ఏమీ లేదని గమనించాలి. సురేశ్‌రెడ్డి, జిల్లా పౌరసరఫరాల శాఖాధికారి, కరీంనగర్

# రైతులు 1,34,725 .. రూ.132.5 కోట్లు విడుదల

సిరిసిల్ల : యాసంగి సాగుకు అందించనున్న పెట్టుబడి సాయానికి నూతనంగా కొలువుదీరిన కాంగ్రెస్ ప్రభుత్వం నిధులు కేటాయించింది. ఈ నెల 12 నుంచి రైతుల ఖాతాల్లో నేరుగా జమ చేయాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో మాదిరిగానే ఎకరానికి రూ.5 వేల చొప్పున జిల్లాలో మొత్తం 1,34,725 మంది రైతులకు రూ. 132.5 కోట్లను పెట్టుబడి సాయంగా అందించనున్నారు. రైతులు పోస్టాఫీసు, మైక్రో ఏటీఎంల ద్వారా రైతు బంధు సొమ్మును తీసుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. మొదటి రోజు ఎకరాలోపు భూమి ఉన్న అన్నదాతల ఖాతాల్లో జమ చేయగా, రెండో రోజు రెండు నుంచి నాలుగు ఎకరాల్లోపు భూమి ఉన్న వారికి జమ చేశారు. ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని ప్రస్తుత యాసంగి పంటకు గత ప్రభుత్వం అందించిన విధంగానే పెట్టుబడి సాయాన్ని అందించాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా ఈ సీజన్‌లో ఎకరాలతో సంబంధం లేకుండా ప్రతీ రైతుకు ఇవ్వాలని నిర్ణయం



తీసుకుంది. తక్కువ విస్తీర్ణం నుంచి ఖాతాల్లో జమ చేయడం ప్రారంభించి ఎక్కువ విస్తీర్ణం ఉన్న కర్షకులకు జమ చేస్తున్నారు. దీంతో జిల్లాలోని 13 మండలాల్లో 1,34,725 మంది రైతులకు పెట్టుబడి సాయం అందనుందని జిల్లా వ్యవసాయశాఖ అధికారి భాస్కర్ తెలిపారు. ఇప్పటికే జిల్లాలో 9,285 మంది రైతులకు రూ. 2.34 కోట్లు వారి ఖాతాల్లో జమైనట్లు ఆయన పేర్కొన్నారు.

# బకాయిల భారం.. నిర్వహణ కష్టం

సిరిసిల్ల: జిల్లా కేంద్రమైన సిరిసిల్ల పురపాలక సంఘంలో నిధుల లేమితో ప్రధాన పనులేవీ ముందుకు సాగడం లేదు. వీటికితోడు రెండు నెలలుగా కమిషనరు సెలవుపై వెళ్లడంతో కార్యాలయ పాలన గాడి తప్పింది. పట్టణ ప్రజలకు ఆహ్లాదాన్ని అందించేందుకు తొమ్మిది ప్రాంతాల్లో పార్కులను అభివృద్ధి చేశారు. వీటితోపాటు పట్టణ సుందరీకరణలో భాగంగా ప్రధాన రహదారుల మధ్యలో చెట్లు, కూడళ్లలో పూల మొక్కలు పెంచుతున్నారు. ఇంత వరకు బాగానే ఉన్నా వీటి నిర్వహణ గాడి తప్పుతోంది. పార్కులు, ప్రధాన రహదారులపై ఉన్న కూడళ్ల సుందరీకరణకు ఏటా పురపాలకశాఖ రూ.66 లక్షలు కేటాయిస్తోంది. వీటి నిర్వహణను రెండు గుత్తేదారు సంస్థలకు అప్పగించారు. వీరు పట్టణ వ్యాప్తంగా 45 మంది కూలీలు, పది మంది సూపర్‌వైజర్లను ఏర్పాటు చేశారు. దాదాపు పది నెలలుగా పురపాలిక నుంచి గుత్తేదారులకు బిల్లుల చెల్లింపులు నిలిచిపోయాయి. దీంతో వీరి పరిధిలో పని చేసే కూలీలు, సూపర్‌వైజర్లకు వేతనాలు అందడం లేదు. ఈ విషయంపై ఇటీవల పార్కుల్లో పని చేసే కూలీలంతా పురపాలిక ఎదుట ఆందోళనకు దిగారు. అధికారులు, కౌన్సిలర్లు నచ్చచెప్పడంతో ఆందోళన విరమించారు. గుత్తేదారులకు చెల్లించాల్సిన బిల్లులన్నీ సాధారణ నిధుల నుంచి కేటాయిస్తారు. ఏడాదిగా పురపాలికలో సాధారణ లేకపోవడంతో ఏ పనులూ ముందుకు సాగడం లేదు.

అభివృద్ధికి నోచుకోని విలీన గ్రామాలు

పురపాలిక ఎన్నికలకు ముందు సిరిసిల్ల పట్టణంలో ఏడు గ్రామాలు విలీనమయ్యాయి. వీటిలో అభివృద్ధి పనులకు పలు విడతల్లో రూ.40 లక్షలు కేటాయించారు. కానీ ఖజానాలో నిధులు లేక ఈ పనులేవీ ముందుకు సాగడం లేదు. దీంతో ఆయా గ్రామాల్లో స్థానికులకు ఇక్కట్లు తప్పడం లేదు. పంచాయతీలుగా ఉన్నప్పుడు నిర్మించిన మురుగు కాల్వలు శిథిలావస్థకు చేరుకున్నాయి. చాలా చోట్ల మురుగు సాఫీగా వెళ్లని పరిస్థితి ఏర్పడింది. వాతావరణ పరిస్థితులు మారడంతో దోమలు వ్యాప్తి చెంది ప్రజలు వ్యాధుల బారినపడుతున్నారు.

అధ్వానంగా కాలి బాటలు

సిరిసిల్ల పురపాలక సంఘం అధికారులు రగుడు నుంచి కార్గిల్‌లేక్ వరకు, ఇటు మానేరు వంతెన వరకు ప్రధాన రహదారులకు ఇరువైపులా మురుగు కాల్వలు, వాటిపై కాలి బాటలు నిర్మించారు. ఇవి చాలా వరకు ఆక్రమణలకు గురయ్యాయి. వర్షాలకు కరీంనగర్-సిరిసిల్ల ప్రధాన రహదారిలో చాలా చోట్ల టైల్స్ కుంగిపోయాయి. వీటి మరమ్మతులకు ఇంజినీరింగ్ విభాగం ఇప్పటికే నాలుగు సార్లు టెండర్లు పిలిచింది. సాధారణ నిధులని చెప్పడంతో గుత్తేదారులు ఎవరూ ముందుకు రావడం లేదు.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం

పురపాలికలోని పార్కులు, కూడళ్ల నిర్వహణకు సాధారణ నిధుల నుంచి చెల్లింపులు జరపాలి. సెప్టెంబరుతో గడువు పూర్తయినా ఈ ఏడాది చివరి వరకు పొడిగించాం. గుత్తేదారులకు చెల్లించాల్సిన బిల్లులపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. నిధులు జమ కాగానే బిల్లులు చెల్లిస్తాం. వెంకటేశ్, ఏఈ

# ఆకర్షణీయ పనులపై విజిలెన్స్ ఆరా

కరీంనగర్ : కరీంనగర్ నగర పాలక సంస్థ పరిధిలో స్మార్ట్‌సిటీ పనులు ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్నారు. అయిదు సంవత్సరాలుగా ఈ ప్రాజెక్టు కింద ప్రారంభించిన పనులు తుది దశకు చేరాయి. మిగతావి పూర్తి చేసేలా కార్యాచరణ తీసుకోవాల్సిన సమయంలో రూ.కోట్లలో బిల్లులు పెండింగ్‌లో ఉండటంతో అభివృద్ధి పనులు నత్తనడకన సాగుతున్నాయి.

గందరగోళం..ఏడాది కిందట రహదారికి ఇరువైపులా స్మార్ట్ స్తంభాలు వేసి లైట్లు బిగించారు. ఇప్పటివరకు అవి వెలగడం లేదు. ఈ లైట్లు వెలగాలంటే విద్యుత్తు సామర్థ్యం పెంచాలని ఆ శాఖ సూచించింది. మూడు నియంత్రికలు అదనంగా బిగించాల్సి ఉండగా దీనికి డిపాజిట్ చెల్లించాల్సి రావడంతో ఈ మొత్తాన్ని ఎవరు చెల్లించాలో తెలియని గందరగోళం నెలకొంది. కాలనీలో అభివృద్ధి పనుల పేరుతో చెట్లు తొలగించారు. పనులు పూర్తయిన తర్వాత పచ్చదనం పెంపునకు మొక్కలు నాటి సంరక్షించాల్సి ఉండగా అదేదీ కనిపించడం లేదు.

మూడు ప్యాకేజీలలో..నగర వ్యాప్తంగా మూడు ప్యాకేజీలలో 52 ప్రాజెక్టులను తీసుకొని రూ.936.94 కోట్లతో పనులు ప్రారంభించారు. ప్రధానంగా రహదారులు, మురుగు, వరదనీటి కాల్వలు, పార్కులు, తాగునీటి సరఫరా, కమాండ్ కంట్రోల్, ఫుట్‌పాత్, పచ్చదనం, లైటింగ్స్, పారిశుద్ధ్య పనుల నిర్వహణ, సిగ్నలింగ్ వంటివి ఉన్నాయి. ప్యాకేజీ-



3లో రూ.64.84 కోట్ల నిధులు హౌసింగ్‌బోర్డు కాలనీకి కేటాయించారు. ఆ నిధులతో రోడ్లు, మురుగునీటి కాల్వల పనులు పూర్తి చేశారు. మరోవైపు ఇక్కడ జరుగుతున్న పనులపై విజిలెన్స్ అధికారులు దృష్టి సారించారు.

రోడ్లు తప్ప మిగతావి అధ్వానం

హౌసింగ్‌బోర్డు కాలనీలో రహదారులు, మురుగు కాలువలు తప్ప మిగతా పనులు ఆకర్షించడం లేదు. కాలనీని అందంగా తీర్చిదిద్దాల్సి ఉండగా మొక్కుబడి పనులు చేశారని ఆ ప్రాంత ప్రజలు అంటున్నారు. ఫుట్‌పాత్ టైల్స్ వేయడంలో నిర్లక్ష్యం ప్రదర్శించారు. ఇళ్ల నుంచి వచ్చే మురుగు కాల్వల పైపుల అనుసంధానం కూడా సక్రమంగా చేయకుండా వదిలేశారు. రెయిలింగ్ ఊగుతుండగా, టైల్స్ ఊడిపోవడం, కుంగిపోవడం వంటివి కనిపిస్తున్నాయి. అవసరం లేని చోట కూడా పార్కింగ్ టైల్స్ విశాలంగా వేయడంతో రహదారి ఇరుకుగా మారింది. దీనిని తొలగించాలని ఆదేశించినా గుత్తేదారు మాత్రం పట్టనట్లుగా ఉన్నారు. ఇంజినీర్లతో పరిశీలన..ప్యాకేజీ-3 కింద చేపట్టిన ఆకర్షణీయ పనులపై పలువురి నుంచి ఫిర్యాదులు అందడంతో విజిలెన్స్ అధికారులు ఆరా తీస్తున్నారు. రెండు నెలల కిందట నగర పాలక సంస్థ అధికారులకు లేఖ అందడంతో ఆ వివరాలు అందించారు. హౌసింగ్‌బోర్డు కాలనీలో చేపట్టిన పనుల దస్త్రాలను కూడా తీసుకెళ్లినట్లు తెలుస్తోంది. విజిలెన్స్ విభాగంలోని ఇంజినీర్లతో లోతుగా పరిశీలించనున్నారు. ఆ తర్వాత క్షేత్రస్థాయిలో తనిఖీ చేసే అవకాశముంది. నగరంలో స్మార్ట్ పనులపై విజిలెన్స్‌తో పాటు ఇతర శాఖలకు వేర్వేరుగా ఫిర్యాదు చేసినట్లు సమాచారం.

# నెమ్మదించిన రిజిస్ట్రేషన్లు మందకొడిగా కొనుగోళ్లు

హైదరాబాద్: కొత్త ఇల్లు, స్థలం, ఫ్లాట్ కొనడానికి ఉత్సాహం చూపే నగరవాసులు ఏడాదిగా వెనకడుగు వేస్తున్నారు. ఈ ఒరవడి ఎన్నికల ముందు నుంచి మరింత నెమ్మదించింది. గత 4 నెలల నుంచి రిజిస్ట్రేషన్లలో వ్యత్యాసం ఉందని స్టాంపులు, రిజిస్ట్రేషన్లశాఖ అధికారులు చెబుతున్నారు. ఒక్కో సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో రోజుకు 100–150 వరకూ రిజిస్ట్రేషన్లు అయిన చోట.. నేడు కేవలం 30 - 40 వరకే పరిమితమయ్యాయని సబ్‌రిజిస్ట్రార్లు చెబుతున్నారు. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో రోజుకు 1600 నుంచి 2000 వరకూ రిజిస్ట్రేషన్లు జరుగుతుండేవి. గత నాలుగు నెలలుగా ఏ రోజూ 2000 మార్కుకు రిజిస్ట్రేషన్లు చేరలేదు. కేవలం 800-1000 వరకూ జరుగుతున్నాయని లెక్కలు చెబుతున్నాయి.

గ్రేటర్ పరిధిలో ..:నగరంలో ఉన్న వారు కొనడం.. కొన్నేళ్లు ఆగి అమ్మడం చేస్తుంటారు. అలా వచ్చిన డబ్బుతో మరోచోట పెట్టుబడులు పెడుతుంటారు. కానీ ఇటీవల ఇంటి స్థలాల అమ్మకాలు కూడా జరగడంలేదని స్టాంపులు, రిజిస్ట్రేషన్ల అధికారులు చెబుతున్నారు. గతేడాది అక్టోబరు, నవంబరులతో పోల్చితే.. 60 శాతానికి పైగా



కొనుగోళ్లు లేవంటున్నారు. అపార్టుమెంట్లలో పేరెన్నికగల కొన్ని సంస్థల అమ్మకాలు మినహా.. కొత్తగా స్థిరాస్తి వ్యాపారం చేస్తున్నవారు ఆఫర్లుపెట్టినా కొనుగోలుదారులు ఆసక్తి చూపించడంలేదని పలువురు చెబుతున్నారు. ఈనెలాఖరు వరకే ఈ ధర. తర్వాత పెరుగుతుందని హెచ్చరిస్తున్నా స్పందన రావడంలేదంటున్నారు. మరో 4 నెలల వరకూ ఇదే పరిస్థితి కొనసాగవచ్చునని అంచనా వేస్తున్నారు.

తగ్గిన 'రియల్' వ్యాపారం

111జీవో ఎత్తివేతతో ఆదిలో అక్కడ భూములు కొనడానికి ఆసక్తి చూపించినా..నాలుగు నెలలుగా అక్కడ కూడా స్థిరాస్తి వ్యాపారం నెమ్మదించిందని రిజిస్ట్రేషన్ల శాఖ అధికారులు చెబుతున్నారు. గతంతో పోల్చితే 60శాతం వ్యాపారం తగ్గిందని పలువురు వ్యాపారులు అంటున్నారు. ప్రస్తుతం 200 గజాల స్థలాల ప్లాట్లు కొనడం తగ్గింది. కొనేవారు కూడా ఫార్మ్ ప్లాట్ల దృష్టి పెడుతున్నారు. ఐటీ రంగంలో ఉద్యోగాలు నిలకడగా లేకపోవడం.. అమెరికాలో ఐటీ రంగంలో అవకాశాలు తగ్గడం కూడా నగరంలోని స్థిరాస్తి వ్యాపారంపై ప్రభావం చూపుతోందని ఓ నిర్మాణ సంస్థ యజమాని తెలిపారు.

# నిధులు లేక.. పనులు సాగక

హైదరాబాద్: నగరంలో పురోగతిలో ఉన్న అభివృద్ధి పనుల పై నీలినీడలు కమ్ముకున్నాయి. ఎన్నికలకు నాలుగు నెలల ముందు నుంచే నిధుల్లేక పైవంతెనల నిర్మాణం నత్తనడకను తలపిస్తోం ది. అసంపూర్తి పనులతో ఆయా మార్గాల్లో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా మారుతోంది. కొత్త సర్కారు తక్షణం ఆయా ప్రాజెక్టులపై సమీక్ష జరపాలని కోరుతున్నారు.

సమస్యలు ఇక్కడే...బైరామల్‌గూడ కూడలిలో పైవంతెనలు, లూప్‌ల నిర్మాణం తుది దశలో ఉండగా, ఆరాంఘర్ చౌరస్తా–జూపార్కు భారీ పైవంతెన అసంపూర్తిగా ఉంది. గచ్చిబౌలి కూడలి–బొటానికల్ గార్డెన్ మధ్య పైవంతెన, ఉప్పల్ కూడలి చుట్టూ పైవంతెనలు, ర్యాంపులు పురోగతిలో ఉన్నాయి. వాటిని వేగంగా పూర్తిచేయాలని, లేదంటే రోజూ నరకం చూడాల్సి వస్తోందని ప్రజలు కొత్త ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

వాటిని పూర్తి చేయాల్సిందే..

"నగరంలో పురోగతిలో ఉన్న పైవంతెనలు, అండర్‌పాస్‌లు ఎలా పూర్తి చేయాలన్నది జీహెచ్ఎంసీ ముందున్న అతి పెద్ద సమస్య. ఆర్థిక సమస్యలపై సర్కారుతో చర్చిస్తామని"అని జీహెచ్ఎంసీ ఉన్నతాధికారి ఒకరుతో తెలిపారు.



ఎస్ఆర్డీపీ మొదటిది..

గత సర్కారు ఆదేశాలతో.. నగరంలో ట్రాఫిక్ సమస్యను పరిష్కరించేందుకు జీహెచ్ఎంసీ ఎస్ఆర్డీపీ (వ్యూహాత్మక రహదారుల అభివృద్ధి కార్యక్రమం) పేరుతో పైవంతెనలు, అండర్‌పాస్‌లు, రోడ్ల అభివృద్ధి పనులు ప్రారంభించింది. బ్యాంకు రుణాల ద్వారా సుమారు రూ.5,500 కోట్ల నిధులు సమీకరించింది. మరో రూ.500 కోట్ల సొంత నిధులనూ ఖర్చుచేసింది. మొత్తంగా రూ.6వేల కోట్లతో 35 ప్రాజెక్టులు రూపకల్పన జరిగింది. వాటిలో కొన్ని పురోగతిలో ఉన్నాయి. వాటిని పూర్తి చేసేందుకు మరో రూ.1,600కోట్లు అవసరం. ఇప్పటివరకు అప్పుల ద్వారా సమీకరించిన నిధులతోనే పనులు జరిగాయి. కొత్త అప్పులకు బల్దియా సిద్ధంగా లేదు. దాంతో.. ఎలా పూర్తవుతాయనే ప్రశ్న తలెత్తుతోంది. ఉద్యోగులకు జీతాలు చెల్లించలేక జీహెచ్ఎంసీ అవస్థ పడుతోంది. ఆస్తిపన్ను ద్వారా వచ్చే రూ.1800 కోట్లలో.. రూ.1,400 కోట్లు జీతాలు, పింఛన్లు, కార్యాలయాల నిర్వహణకే సరిపోతుంది. నిర్మాణ అనుమతుల రుసుం రూపంలో వచ్చే రూ.1000 కోట్లు.. అప్పులపై వడ్డీ చెల్లింపులకు కేటాయించాల్సి వస్తోంది. "కొన్నేళ్లుగా జీహెచ్ఎంసీ స్థాయికి మించిన ప్రాజెక్టులు భుజానికెత్తుకుంది. ఇప్పుడు అదే భారంగా మారింది. నాలుగు నెలలుగా బిల్లులు చెల్లించలేదు. రూ. 1000కోట్ల మేర గుత్తేదారుల బకాయి లున్నాయి"అని అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# కూలీలకు 'ఉపాధి'.. గ్రామాల పురోగతి



హైదరాబాద్: : గ్రామీణ ప్రాంతాల్లో వలసలు నివారిస్తూ కూలీలకు సొంతూరులోనే పని కల్పించే ఉద్దేశంతో ఉపాధి పథకాన్ని అమలు చేస్తున్నారు. 2024–25 ఆర్థిక సంవత్సరంలో చేపట్టే పనులకు సంబంధించిన గ్రామసభల నిర్వహణకు మార్గదర్శకాలను విడుదల చేశారు. ప్రస్తుతం పంచాయతీకి 20 పనులను ఎంపిక చేశారు. బడ్జెట్ తయారీకి ఈ నెల 20వ తేదీ నాటికి గ్రామసభల్లో ఆమోదిస్తూ తీర్మానాలు చేయాలంటూ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు.

2005లో శ్రీకారం: జీవనోపాధి లక్ష్యంగా 2005 నుంచి 'మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం' కొనసాగుతోంది. మొదట్లో రైతుల పొలాల్లో అభివృద్ధితో పాటుగా కూలీలకు ఉపాధి చూపించే పనులు చేపట్టారు. తర్వాత శాశ్వత ఆస్తుల రూపకల్పనకు ప్రాధాన్యం ఇచ్చారు.

దీర్ఘకాలిక ప్రయోజనాలకే ప్రాముఖ్యం: వచ్చే ఏడాది చేపట్టే పనుల్లో కూలీలకు ఉపాధితో పాటుగా దీర్ఘకాలిక పనులకు ప్రాముఖ్యం ఇవ్వాలంటూ అధికారులు సూచించారు. ఉపాధిహామీ చట్టం ప్రకారం వచ్చే ఆర్థిక సంవత్సరానికి గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు ప్రతి ఏడాది ఆర్థిక బడ్జెట్‌ను తయారు చేస్తుంటారు.

2024–25లో చేపట్టే పనులను గుర్తిస్తూ అందుకు అవసరమయ్యే వార్షిక ప్రణాళికతో కూలీల బడ్జెట్ రూపొందించాలని అధికారులు ఆదేశించారు. వచ్చే ఏడాదికి ఒక్కో ప్రాంతానికి అనుకూలతను బట్టి ఉపాధిలో కేటగిరీలుగా 266 రకాల పనులు చేసుకునే అవకాశాలున్నాయి. కూలీలు, ప్రజాప్రతినిధులతో గ్రామ పంచాయతీలో సమావేశం నిర్వహిస్తారు. గ్రామాల్లో పచ్చదనం, పూడికతీత, రైతుల పొలాల్లో పనులు, అనువైన ప్రాంతాలు, భూగర్భ జలాల పెంపు, ఇంకుడు గుంతలు చేపట్టాలి.

ప్రస్తుత 2023–24లో అమలు ఇలా..

జాబ్‌కార్డులు: 1.83 లక్షలు

పేర్లు నమోదు చేసుకున్న కూలీలు: 3.76 లక్షలు

పనులు చేస్తున్న జాబ్‌కార్డుల సంఖ్య: 1.33 లక్షలు

వందరోజుల పని దినాలు పూర్తి చేసుకున్న కుటుంబాలు: 96 వేలు

ఉపాధి పనులకు వెళ్లిన దివ్యాంగులు: 1,804

రైతులకు లబ్ధి చేకూరాలిస్టీవెన్‌నిల్, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అదనపు అధికారిఉపాధిహామీ పనుల గుర్తింపు సమావేశాల్లో ప్రయోజనం కలిగించే పనులను ఎంపిక చేసుకోవాలి. గ్రామానికి, కూలీలకు ఉపయోగపడే పనులను గుర్తిస్తేనే మేలు కలుగుతుంది. గ్రామాల్లో భూగర్భ జలాలు పెంచుతూ రైతులకు లబ్ధికలిగే విధంగా చూసుకోవాలి.

# నిర్వహణ నిబంధనలు గాలికి



హైదరాబాద్ : నిర్వహణ నిబంధనలు(సీఎఫ్‌వో) పాటించని పరిశ్రమల మూసివేతకు కాలుష్య నియంత్రణ మండలి (పీసీబీ) తాజాగా ఆదేశాలిచ్చింది. బహిరంగ ప్రదేశాల్లో రసాయన వ్యర్థాలు పారబోస్తున్న చర్లపల్లిలోని రెండు పరిశ్రమలను మూసివేయాలంటూ ఉత్తర్వులు జారీచేసింది. వ్యర్థాలను తరలించకుండా నిల్వ ఉంచుతున్న పరిశ్రమలు తీరు మార్చుకోవాలంటూ హెచ్చరించింది. జీడిమెట్ల, మల్లాపూర్‌లోని మూడు పరిశ్రమల నిర్వాహకులకు ఈ మేరకు మార్గదర్శకాలు జారీ చేసింది. ఫిర్యాదుల ఆధారంగా ఆయా పరిశ్రమల్లో తనిఖీల అనంతరం నివారణ చర్యలు తీసుకోవాలంటూ గడువు విధించింది.కాలుష్య ఉద్గారాలకు కారణమైన చర్లపల్లిలోని సర్వోదయ సాల్వెంట్స్, శేషసాయి కెమికల్స్ పరిశ్రమల మూసివేతకు పీసీబీ తాజాగా ఆదేశాలిచ్చింది. పారిశ్రామిక వ్యర్థజలాలను శుద్ధికేంద్రాలకు పంపకుండా నేరుగా భూమిలోకి వదులుతున్నారంటూ ఫిర్యాదులు రావడంతో నవంబరు 7న తనిఖీలుచేపట్టింది. అక్కడి నమూనాలను ల్యాబ్‌కు పంపింది. పరిమితికి మించి కాలుష్యం విడుదలవుతున్నట్లు తేలడంతో పరిశ్రమల మూసివేతకు ఆదేశాలిచ్చింది. ఈ రెండు పరిశ్రమలూ పీసీబీ మార్గదర్శకాల మేరకే సీఎఫ్‌వో అనుమతులు పొందాయి. శేషసాయి కెమికల్స్ సహాయంతో సర్వోదయ సాల్వెంట్స్ సంస్థ వ్యర్థజలాలను భూమిలోకి వదులుతోందని స్థానిక హరిత ఇండస్ట్రీస్ పీసీబీకి ఫిర్యాదుచేసింది. దీంతో నవంబరు 15న టాస్క్‌ఫోర్స్ బృందం పరిశ్రమతో పాటు ఆయా ప్రదేశాలను తనిఖీ చేసింది. వీవోసీ అబ్సార్‌ప్షన్ మీడియా, ఉద్గారాల నియంత్రణకు వాడే స్క్రబ్బర్‌ను ఏర్పాటు చేయలేదని గుర్తించింది. ఏ మేర ఉద్గారాలున్నాయో తెలిసేలా మీటర్లు ఏర్పాటుచేయలేదు. సీఎఫ్‌వో అనుమతుల ప్రకారం.. ఇక్కడి వ్యర్థాలను శుద్ధికోసం నాచారంలోని సీఈటీపీకి తరలించాల్సిఉన్నా పరిశ్రమ నిర్వాహకులు పట్టించుకోలేదు. కోల్ ఫైర్ బాయిలర్‌కు బదులుగా వుడ్ బాయిలర్ వినియోగించడంపై పీసీబీ ఆగ్రహం వ్యక్తంచేస్తూ నవంబరులో నోటీసులు జారీ చేసింది. అదేనెల 29న పరిశ్రమ నిర్వాహకులతో టాస్క్‌ఫోర్స్ కమిటీ సమావేశమై చర్చించి మూసివేత ఆదేశాలిచ్చింది. బ్యాంకు గ్యారంటీలనూ జప్తుచేస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొంది.

బల్క్‌డ్రగ్ పరిశ్రమకు సూచనలు

నిబంధనలు పాటించని జీడిమెట్లలోని బల్క్‌డ్రగ్ పరిశ్రమ లక్సాయ్ లైఫ్‌సైన్సెస్‌కు పీసీబీ మొట్టికాయలు వేసింది. బహిరంగ ప్రదేశాల్లో ఉద్గారాలు వదులుతున్నట్లు ఫిర్యాదులు రావడంతో అధికారుల బృందం సెప్టెంబరు 12న తనిఖీలు నిర్వహించింది. అనంతరం పరిశ్రమ నిర్వాహకులు సదుపాయాల కల్పనకు గడువు కోరడంతో..అంగీకరించి పలు సూచనలు చేసింది. వ్యర్థజలాలను జీడిమెట్లలోని ఎఫ్లూయెంట్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌కు తరలించాలని ఆదేశించింది. వాయునాణ్యతను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ కాలుష్య ఉద్గారాలను తగ్గించాలని సూచించింది. కాలుష్య ఉద్గారాలను తగ్గించేలా స్క్రబ్బర్‌కి హెచ్‌టీడీఎస్ ఎఫ్లూయెంట్ స్టోరేజ్ ట్యాంకులకు అనుసంధానించాలని పీసీబీ సూచించింది. వీవోసీ మానిటరింగ్ వ్యవస్థ ఏర్పాటు, వెంట్ కండెన్సర్‌ల వినియోగంతో ఉద్గారాలను నియంత్రించాలని తెలిపింది. లీక్ డిటెక్షన్ అండ్ రిపేర్ స్టడీ(ఎల్‌డీఏఆర్) వ్యవస్థను ఏర్పాటు చేయాలని సూచించింది.కాలుష్య నియంత్రణ చర్యలు చేపట్టాలని మల్లాపూర్‌కి చెందిన మురళి కెమికల్స్, శోధన ల్యాబరేటరీస్ లిమిటెడ్ వారిని పీసీబీ ఆదేశించింది.

# పక్కా ప్రణాళికతోనే ధరణిలో మార్పులు, చేర్పులు

హైదరాబాద్: రంగారెడ్డి జిల్లా ధరణి పోర్టల్ సమన్వయ కర్త నరేష్, కంప్యూటర్ అపరేటర్ మహేశ్‌లు పక్కా ప్రణాళికతోనే భూముల వివరాల్లో మార్పులు, చేర్పులు చేశారని ప్రాథమిక ఆధారాలు లభించాయి. వీరిద్దరూ కొందరు అక్రమార్కులతో ఒప్పందాలు కుదుర్చుకున్నారని, భారీగా లబ్ధిపొందేందుకు ప్రయత్నాలు చేశారని గుర్తించారు. గత నెల 8, 9 తేదీల్లో వీరు భూముల మార్పునకు ప్రయత్నించి కుదరకపోవడంతో సమయం కోసం ఎదురు చూశారని తెలుసుకున్నారు. కలెక్టర్ కార్యాలయంలో ఉన్నతాధికారులంతా ఎన్నికల విధుల్లో ఉండటంతో అక్రమార్కులు కోరిన విధంగా భూములు బదిలీ చేశారని, సాంకేతిక పరిజ్ఞానం సాయంతో వాటిని నేరుగా సీసీఎల్‌ఏ కార్యాలయానికి పంపించారని, అక్కడి నుంచి ఉత్తర్వులు వచ్చేలా చేసినట్లు సమాచారం సేకరించారు. మహేష్, నరేష్‌లు అక్రమంగా బదిలీ చేసిన భూ యాజమాన్య హక్కుల విలువ రూ.కోట్లలోనే ఉంటుదని అధికారులు అంచనా వేశారు.దరఖాస్తుదారుల్లా వచ్చి...ధరణి సమన్వయ కర్త నరేష్, మహేశ్‌ల సహకారంతో భూముల హక్కులు బదిలీ చేసుకున్న అక్రమార్కుల్లో కొందరు రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయానికి ఈ నెల 5న వచ్చారు. సీసీఎల్‌ఏ నుంచి తమకు ఉత్తర్వులు వచ్చాయని, వాటి నకలును అధికారులకు చూపించారు. ఒక అధికారి వాటిని జిల్లా కలెక్టర్ భారతి హొలికేరి దృష్టికి తీసుకెళ్ల గా... ఆమె వాటిని పరిశీలించారు. ఈ దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని, ఎవరు పరిష్కరించారని అధికారులను ప్రశ్నించారు. ఉ



త్తర్వుల ప్రతులను తీసుకున్న కలెక్టర్ మోసం గ్రహించి నరేష్, మహేశ్‌లను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అదేరోజు ఆదిభట్ల పోలీసులకు ఫిర్యాదు చేశారు.మహేశ్, నరేష్‌లు ఎక్కడ? ఈ వ్యవహారంలో కీలకమైన మహేశ్, నరేష్‌లు అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. వీరిద్దరినీ పట్టుకునేందుకు పోలీసులు వారి సన్నిహితులను ఇప్పటికే ప్రశ్నించారు. మరోవైపు నరేష్, మహేశ్‌లు పరిష్కరించిన ఫైళ్ల వివరాలన్నింటినీ తమకు ఇవ్వాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ అధికారులు రాష్ట్ర ప్రధాన భూపరిపాలన అధికారి కార్యాలయానికి విజ్ఞప్తి చేశారు. అక్కడి నుంచి వివరాలు వస్తే మరిన్ని అక్రమాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని భావిస్తున్నారు.

# ఇల్లు ఇచ్చారు.. తాళం వేశారు

హైదరాబాద్ : ఇల్లొచ్చిందని సంబరపడాలా, పట్టాలిచ్చి రెండు నెలలవుతున్నా ఇంకా అనుమతించట్లేదని బాధపడాలో తెలియక నగరంలోని రెండు పడక గదుల ఇళ్ల లబ్ధిదారులు ఆందోళన చెందుతు న్నారు. అక్టోబరులో లాటరీ ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేసి, వారికి ప్రభుత్వం పట్టాలిచ్చింది. ఇళ్ల సముదాయాల వద్దకు తీసుకెళ్లి కేటాయిం చిన వాటిని చూపించింది. గృహ ప్రవేశానికి మాత్రం అధికారులు అనుమతించట్లేదు. ఇదేంటని అడిగితే.. పంపిణీ అయిన గృహ సముదా యాల్లో తాగునీరు, విద్యుత్తు ఇతర సౌకర్యాల కల్పన అసంపూర్తిగా ఉందనే విషయం వెలుగులోకి వచ్చింది. చక్కదిద్ది ఇళ్లను అప్పగిస్తా మంటూ.. అధికారులు ఇచ్చిన హామీ ఇప్పటికీ అమలు కాకపోవడం విమర్శలకు తావిస్తోంది.

ఒక్కరూ ఇంట్లో చేరలేదు..గత ప్రభుత్వం గ్రేటర్ పరిధిలో మొత్తం లక్ష ఇళ్ల నిర్మాణం చేపట్టింది. ఇందులో 70 వేల ఇళ్లు పూర్తవడంతో మూడు దశల్లో 61,784 ఇళ్లు లబ్ధిదారులకు అందాయి. మిగిలిన 35వేల ఇళ్లు నిర్మాణ దశలో ఉన్న విషయం తెలిసిందే.ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలోని తిమ్మాయిగూడ రెండు పడక గదుల ఇళ్ల సముదాయాన్ని లబ్ధిదారులకు అప్పగించినప్పటికీ.. ఒక్కరు కూడా ఇంట్లో చేరలేదు. వేసిన తాళాలు వేసినట్టే ఉన్నాయి. ఇదేంటని



అక్కడున్న భద్రత సిబ్బందిని అడిగితే.. ఇళ్ల లోపల మీటర్లు, విద్యుత్తు సరఫరా తీగలను అమర్చలేదని, గుత్తేదారు పనులు చేస్తున్నారని చెప్పారు. అధికారులూ అదే సమాధానమిస్తున్నారు.

చర్లపల్లి, అహ్మద్‌గూడ, రాంపల్లి ప్రాంతాంల్లో నిర్మించిన 10వేలకుపైగా ఇళ్ల పరిస్థితి కూడా అంతే. సౌకర్యాల కల్పన పూర్తవకపోవడంతో గృహ ప్రవేశాలు చేసేందుకు లబ్ధిదారులు సాహసించట్లేదు.

పటాన్‌చెరు నియోజకవర్గంలోని అతిపెద్ద గృహసముదాయంలో 15వేలకుపైగా ఇళ్లు ఉండగా, గృహ ప్రవేశాలు మొదలు కాలేదు.

అన్నింటిని పరీక్షించాకే..చాలా రోజుల క్రితం ఇళ్ల నిర్మాణం పూర్తయి ందని, అప్పుడే లిఫ్టులు, జనరేటర్లు, విద్యుత్తు మీటర్లు, పైపులైన్లు, సంపులు, ట్యాంకులను నిర్మించామని అధికారులు చెబుతున్నారు. మూడేళ్లపాటు వాటిని ఉపయోగించకపోవడంతో కొన్ని మరమ్మతులకు గురయ్యాయని అంటున్నారు. పని చేస్తోన్న లిఫ్టులపైనా అధికారుల్లో ఆందోళన ఉంది. ఎప్పుడు ఆగిపోతాయోనని సందేహిస్తున్నారు. అందువల్ల. ప్రయోగాత్మకంగా పరీక్షించాకే.. గృహ ప్రవేశాలకు అనుమతివ్వాలని నిర్ణయించినట్లు అధికారవర్గాలు చెబుతున్నాయి.

ఎవరినీ అడగలేక..

గత సర్కారు కేటాయించిన ఇళ్లకు కొత్త ప్రభుత్వం సౌకర్యాలు కల్పించి అందిస్తుందా? లేదా అని లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. ఇళ్లు లేక.. ఏళ్ల తరబడి అద్దెలు చెల్లించామని, తమకు కేటాయించిన ఇళ్లను అందజేస్తే.. సొంతింట్లో ప్రశాంతంగా బతుకుతామని లబ్ధిదారులు సర్కారును కోరుతున్నారు.

# ఆచార్య ఇదేం ఆచారం

హైదరాబాద్: ఉస్మానియా విశ్వవిద్యాలయంలో సీనియర్ ఆచార్యుల పదోన్నతుల్లో అక్రమాలు జరిగాయంటూ ఔటా(ఉస్మానియా యూనివర్సిటీ టీచర్స్ అసోసియేషన్) ప్రతినిధులు ప్రభుత్వానికి చేసిన ఫిర్యాదులు తీవ్ర సంచలనం సృష్టిస్తున్నాయి. ఫిర్యాదులపై స్పందించిన ప్రభుత్వం విచారణ కమిటీ ఏర్పాటు చేసింది. అది విచారణ ప్రారంభిస్తే ఉద్యోగం పోతుందని సీనియర్ ప్రొఫెసర్ హొదా పొందిన ఓ ఆచార్యుడు తాను తప్పుచేశానంటూ రిజిస్ట్రార్‌కు లేఖ రాయడం, ఆయన పదోన్నతిని రద్దు చేయడం వంటివి ఆరోపణలకు బలం చేకూరుస్తున్నా యి. అర్హతలు లేకుండానే యాభైమందికి పైగా ప్రొఫెసర్లకు ఓయూ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్, ఉన్నతాధికారులు పదోన్నతులు కట్టబెట్టారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

యూజీసీ కేర్ గుర్తింపు లేకున్నా..

సీనియర్ ప్రొఫెసర్లుగా పదోన్నతులు పొందినవారిలో చాలామంది ప్రొఫెసర్ల పరిశోధన పత్రాలకు యూజీసీ కేర్ గుర్తింపు లేదు. కొందరు ప్రొఫెసర్లు.. జూనియర్లు సమర్పించిన పరిశోధన పత్రాల్లో పదాలు, పేరాలను మార్చి



తమ పరిశోధన పత్రం అని రాసుకున్నారు.

ఒక విభాగానికి డీన్‌గా వ్యవహరిస్తున్న ప్రొఫెసర్.. తాను పది పరిశోధన పత్రాలు సమర్పించానని నివేదికలో రాసుకున్నారు. ఇందులో తొమ్మిది పత్రాలు యూజీసీ కేర్ జర్నళ్లలో లేవు. తనది కాని ఒక పరిశోధన పత్రాన్ని తనపేరిట రాసుకున్నారు.మరో విభాగంలో డీన్‌గా ఉన్న ప్రొఫెసర్ 2010లో గైడ్‌షిప్ తీసుకున్నారు. పరిశోధన విద్యార్థులకు గైడ్‌గా వ్యవహరిస్తున్నారు. సీనియర్ ప్రొఫెసర్‌గా పదోన్నతి రావాలంటే పరిశోధన విద్యార్థులు పీహెచ్‌డీలు సమర్పించాలి. తన వద్ద లేకపోవడ ంతో ఇతర ప్రొఫెసర్ల నుంచి ఆరుగురు విద్యార్థులను బదిలీ చేయించు కుని నెలలో వారికి పీహెచ్‌డీలు వచ్చేలా చేసి పదోన్నతి పొందారు.

లోతుగా విచారణ నిర్వహించాలి

ప్రొఫెసర్ మనోహర్, ఔటా అధ్యక్షుడు

కమిటీ లోతుగా విచారణ నిర్వహించాలి. మా వద్ద అన్ని రికార్డులు ఉన్నాయి. విశ్వవిద్యాలయంలో కొందరు అధికారులు నచ్చినవారికే పదోన్నతులు ఇచ్చేందుకు అర్హులకు అన్యాయం చేశారు. కమిటీ ఛైర్మన్ దృష్టికి అన్ని అంశాలు తీసుకెళ్లనున్నాం.

# స్టేడియంలో ఆడేదెప్పుడో?

వేములవాడ : ఆధ్యాత్మిక పట్టణమైన వేములవాడలోని మినీ స్టేడియం నిర్మాణ పనులు తొమ్మిదేళ్లుగా కొనసాగుతూనే ఉన్నాయి. ఏళ్లు గడుస్తున్నా పనులు పూర్తి కాక క్రీడాకారులు ఇబ్బంది పడుతున్నారు. సాధన కోసం పట్టణ శివారు ప్రాంతాలను గానీ, జూనియర్ కళాశాల మైదానాన్ని గానీ ఆశ్రయించాల్సిన దుస్థితి నెలకొంది. స్టేడియం పూర్తయితే ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని భావించిన క్రీడాకారులకు నిరాశ తప్పడం లేదు. వేములవాడ మున్సిపల్ పరిధిలోని తిప్పాపూర్ శివారులో అయిదు ఎకరాల విస్తీర్ణంలో మినీ స్టేడియం నిర్మాణానికి ప్రభుత్వం రూ. 2.1 కోట్లను మంజూరు చేసింది. 2014 సంవత్సరంలో స్థానిక ఎమ్మెల్యే రమేశ్‌బాబుతో కలిసి అప్పటి శాసనసభ స్పీకర్ మధుసూదనాచారి శంకుస్థాపన చేశారు. అప్పటి నుంచి పనులు ఆగుతూ, సాగుతూ తొమ్మిదేళ్లు అయినా పూర్తి కాలేదు. మొదట వీటిని చేపట్టిన గుత్తేదారు మధ్యలో చేతులెత్తేయడంతో అసంపూర్తిగా నిలిచిపోయాయి. దీంతో రాష్ట్ర ఐటీ, పురపాలకశాఖ మంత్రి కేటీఆర్ ప్రత్యేక నిధులు రూ. 5 కోట్లు మంజూరు చేయడంతో తిరిగి పనులు మొదలయ్యాయి. క్రీడాకారులకు అవసరమైన విశ్రాంతి, డ్రెస్సింగ్, క్రీడా పరికరాలు భద్రపరిచేందుకు, కార్యాలయం తదితర గదుల్లో ఫ్లోరింగ్ పనులు కొనసాగుతున్నాయి. స్టేడియం చుట్టూ ప్రహరీ పూర్తి చేశారు. విద్యుత్తు వైరింగ్ తదితర వాటిని చేపట్టాల్సి ఉంది. మైదానంలో మొరం నింపి చదును చేశారు. ఆర్చిగేటు నిర్మాణం, మరికొంత ప్రాంతం మొరం నింపాల్సి ఉంది. ఇండోర్‌గేమ్ భవనం, మైదానంలో సింథటిక్ ట్రాక్ నిర్మాణం వంటివి పూర్తి చేయాల్సి ఉంది.



క్రీడా మైదానం లేక అవస్థలు

వేములవాడ పట్టణవాసులు, క్రీడాకారులకు మైదానం అందుబాటులో లేక ఇబ్బందులు పడుతున్నారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానమే అన్నింటికీ పెద్ద దిక్కుగా మారింది. వర్షం కురిస్తే ఆ మైదానం చెరువును తలపిస్తుంది. దీంతో కళాశాల విద్యార్థులు, పట్టణవాసులకు ప్రత్యామ్నాయం లేకుండా పోయింది. కళాశాల మైదానంలో చాలీచాలని వసతుల మధ్య ఏటా పాఠశాల స్థాయి క్రీడా పోటీలు నిర్వహించుకోవాల్సిన దుస్థితి నెలకొంది. మైదానం లేక ఇతర క్రీడల నిర్వహణ కష్టసాధ్యంగా మారింది. కళాశాల పని వేళల్లో క్రీడల నిర్వహణకు అక్కడ అవకాశం లేదు. దీంతో పట్టణ శివారు ప్రాంతంలోని వ్యవసాయ క్షేత్రాలను ఆశ్రయించాల్సిన పరిస్థితి క్రీడాకారులను ఆందోళనకు గురిచేస్తోంది. ఈ ప్రాంతంలో కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, క్రికెట్ తదితర క్రీడల్లో జాతీయ స్థాయిలో రాణించిన వారు చాలా మంది ఉన్నారు. క్రీడా మైదానం అందుబాటులో లేక నైపుణ్యాలను మెరుగుపర్చుకోలేకపోతున్నారు. పట్టణవాసులు నడకకు సైతం మైదానం లేక మండల పరిషత్ కాంప్లెక్స్ ఆవరణలో తిరుగుతున్నారు. ఇప్పటికైనా స్టేడియం నిర్మాణం పూర్తి చేసేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని పట్టణవాసులు, క్రీడాకారులు కోరుతున్నారు.

మరో ఎనిమిది నెలల్లో పూర్తి

నిలిచిపోయిన స్టేడియం నిర్మాణ పనులు మొదలు పెట్టి మూడు నెలలు అవుతుంది. అగ్రిమెంట్‌లోగా పనులు పూర్తి చేయడం జరుగుతుంది. ఇండోర్ భవన నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. మైదానంలో సింథటిక్ ట్రాక్, భవనంలో ఫ్లోరింగ్, ఆర్చిగేటు తదితర పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. గుత్తేదారుకు బిల్లుల చెల్లింపునకు ఇబ్బంది లేదు. పనులు నిలిచిపోవడానికి అవకాశం లేదు. నిర్ణీత గడువులోగా స్టేడియం నిర్మాణం పూర్తయి వినియోగంలోకి వస్తుంది. శ్రీకాంత్, ఏఈ, టీఎస్‌ఈడబ్ల్యూఐడీసీ, వేములవాడ

# అందుబాటులో నిధులు.. ఆసుపత్రుల్లో ప్రజలు

ధర్మారం : 'అంగట్లో అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని' అన్న చందాన మారింది ధర్మారం మండలం నందిమేడారం వాసుల దుస్థితి. అందుబాటులో నిధులున్నా వినియోగించుకోలేక, వ్యాధుల బారిన పడాల్సి వస్తోంది. ఇప్పటికే చేసిన పనులకు సంబంధించి బిల్లుల చెల్లింపులో జాప్యం.. పనుల్లో నాణ్యత లేదనే ఫిర్యాదులతో అధికారులు ఆచితూచి వ్యవహరిస్తుండటం శాపంగా మారింది.

నందిమేడారం పంచాయతీలో పారిశుద్ధ్య పరిస్థితి అధ్వానంగా మారింది. గ్రామంలోని అంతర్గత రహదారులపై గుంతలు పూడ్చేందు కు.. కాలువలు, ప్రాజెక్టు పనులు చేస్తున్న చోటు నుంచి మట్టి, చూర తెచ్చి పోస్తున్నారు. మండల అధికారులు చెక్కులు పాస్ చేయనందుకే పారిశుద్ధ్య పనులు చేయలేకపోతున్నామని పంచాయతీ సిబ్బంది చెబుతున్నారు. పారిశుద్ధ్య లోపంతో దోమలు స్వైర విహారం చేస్తున్నా యి. ప్రజలు విష జ్వరాలు, డెంగీతో ఆసుపత్రుల్లో చేరుతున్నారు.

అధికారుల మధ్య సమన్వయ లోపం

పంచాయతీలో ఎఫ్ఎఫ్‌సీ(రాష్ట్ర ఆర్థిక సంఘం) నిధులు రూ. 22 లక్షలు, సాధారణ నిధులు రూ. లక్ష నిలువ ఉన్నాయని పంచాయతీ కార్యదర్శి ముజీబ్ తెలిపారు. ఇప్పటికే చేసిన పనులకు బిల్లుల చెల్లింపులో జాప్యం కారణంగా కొత్త పనులు చేపట్టేందుకు వీలు కావడం లేదని చెప్పారు. అయితే చేసిన పనులు సక్రమంగా లేవని, సమగ్ర పరిశీలన అనంతరమే బిల్లులు చెల్లిస్తామని ఎంపీవో రమేష్ తెలిపారు. పారిశుద్ధ్య లోప నివారణకు చర్యలు తీసుకుంటామన్నారు.

ప్రాణాలు పోతేనే హడావుడి

నందిమేడారం గ్రామానికి చెందిన సిరవేని మైథిలి నెల రోజుల కిందట తీవ్ర జ్వరంతో మృతి చెందింది. ఆ మరుసటి రోజు నుంచి నాలుగైదు రోజులు గ్రామ పంచాయతీ, మండల అధికారులు హడావుడి చేశారు. ప్రభావిత కాలనీలోని ఎస్సారెస్పీ కాలువలో పూడికతీత చేపట్టారు. ఊరిలో నుంచే మరో రెండు ఎస్సారెస్పీ ఉపకాలువలు వెళ్తుండగా వాటిలోనూ పూడిక పేరుకుపోయింది. దీనికితోడు ఎస్సారెస్పీ కాలువల్లోకే మరుగుదొడ్ల పైపులైన్లు కలపడంతో సమస్య తీవ్రమవుతోంది. కాలువల్లో సాగునీటి ప్రవాహం లేకపోగా మరుగుదొడ్ల వినియోగ జలం ఎక్కడికక్కడ పెద్ద ఎత్తున నిలిచిపోయింది. కాలువలకు ఇరువైపులా ఉన్న కుటుంబాల వారే ఎక్కువగా జ్వరాల బారిన పడుతున్నారు. మేడారంలో కేవలం ఆరుగురే డెంగీ బారిన పడినట్లు వైద్యాధికారులు చెబుతుండగా చాలా మంది బాధితులు ధర్మారం, కరీంనగర్‌లలోని ప్రైవేటు ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు.

డెంగీ బాధితులకూ స్థానికంగా చికిత్సనందిమేడారం పీహెచ్‌సీలో అన్ని రకాల జ్వర నిర్ధారణ పరీక్షలతో పాటు డెంగీ బాధితులకు చికిత్స అందిస్తున్నామని మండల వైద్యాధికారి డా. అనుదీప్ తెలిపారు. ఆసుపత్రికి వచ్చిన వారికి పారిశుద్ధ్య నిర్వహణపై సూచనలు చేయడం వరకే తమ విధి అని చెప్పారు. డెంగీ బాధితులకు అందిస్తున్న చికిత్సలను బాధితులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. డా. అనుదీప్, మండల వైద్యాధికారి

# సొంత విత్తు... లాభాల సొత్తు




జగిత్యాల : జిల్లాలో 3.06 లక్షల ఎకరాల్లో ప్రధాన పంటగా పండించిన వరిపంట నూర్పిడి చేపడుతుండగా ఇదే తరుణంలో విత్తన సేకరణకు సమయం అత్యంత అనువుగా ఉంది. సూటిరకాలైన నువ్వులు, వరి, పెసర, మినుము, అలసంద తదితరాల్లో ప్రతిపంటకు రైతులు నూతనంగా విత్తనాన్ని కొనాలన్న ఆలోచనను మార్చాలనే ఉద్దేశంతో 2017 ఏప్రిల్‌లో రాష్ట్రంలోనే తొలిసారిగా జగిత్యాల జిల్లాలో అధికారులు 'మన ధాన్యం - మన విత్తనం' కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. జిల్లాలో నీటిలభ్యతతో వచ్చే యాసంగిలోనూ వరి ప్రధాన పంటగా రైతులు సాగుచేస్తారు. ప్రతి హెక్టారుకు రూ. 2,500 నుంచి రూ. 5,600 వరకు ప్రైవేటు కంపెనీల విత్తనాలకు వెచ్చించాల్సి ఉండగా వరి పండించే రైతుల్లో సగానికిపైగా రైతులు రైతు విత్తనాన్ని వాడుకునే వీలుంది. దీంతో ఒక పంటకు కనీసం రూ. 10 కోట్ల వరకు విత్తన ఆదాచొప్పున సాధారణ పరిస్థితుల్లో రైతులకు రూ. 20 కోట్లవరకు మిగలనుంది. ప్రస్తుతం వానాకాలంలో పండించిన వరిధాన్యంలో నుంచి విత్తన గింజలను తీసుకుని రైతులు యాసంగిలో రైతువిత్తనంగా వాడుకోవచ్చు.

రైతు విత్తనాన్ని వాడుకున్నపుడు కల్తీ, నకిలీల బెడద ఏమాత్రం ఉండదు. మన నేలల్లోనే పండించిన పంట కాబట్టి స్థిరమైన దిగుబడికి అవకాశం ఉంటుంది. విత్తనఖర్చు తగ్గటంతో పాటుగా తోటి రైతులకు విత్తనాన్ని విక్రయించి అధిక ఆదాయం పొందవచ్చు. పొలంపై కల్తీకర్రలు, బెరకు కర్రలను తీసివేస్తూ వేరుగా నూర్పిడి చేసుకోవటం ద్వారా ఎన్ని పంటలకైనా సూటిరకం విత్తనాన్ని రైతు విత్తనంగా వాడుకోవచ్చు. వరితో పాటుగా ఇతర పంటల్లోనూ సొంతవిత్తు లాభాలసొత్తుగా ఉంటుందని శాస్త్రవేత్తలు పేర్కొనడాన్ని రైతులందరూ ఆచరించాలి.

రెండు పంటల్లో రూ. 32 కోట్ల వరకు ఆదా

– డి. అశోక్‌కుమార్, వ్యవసాయశాఖ జిల్లా మాజీ సలహాదారు

రైతు పండించిన విత్తనాన్నే అందమైన సంచుల్లోనింపి రెట్టింపు ధరకు అమ్ముతున్నారు. విలువైన తమ పంటను పూర్తిగా మార్కెట్‌లో అమ్మకుండా సొంతవిత్తనంగా వాడుకోవచ్చు. ఆహార ధాన్యాలు పప్పుదినుసులు, నూనెగింజలు తదితర పంటల్లో రైతువిత్తనం వాడుకుంటే సాలీనా రెండుపంటల్లోనూ రూ. 32 కోట్లవరకు ఆదా అవుతుంది.

ప్రతిగింజా విత్తనమే– డాక్టర్ జి. శ్రీనివాస్, జగిత్యాల పరిశోధనస్థానం

మక్క, కూరగాయలు, పత్తి తదితరాల్లో ఆడ, మగవరుసల్లో గింజలు వేసి విత్తనాలను ఉత్పత్తి చేస్తారు కాబట్టి ఈ సంకరాలను ప్రతిపంటకూ తీసుకోవాలి. కానీ వరి, నువ్వులు, పెసర, మినుము, తదితర పంటల సూటిరకాల్లో రైతులు పండించిన ప్రతిగింజ విత్తనంగా ఉపయోగపడుతుంది. రైతులు హైబ్రిడ్స్(సంకరాలు), సూటిరకాల మధ్యనగల ఈ చిన్న తేడాను గమనించాలి.




భారత్, కెనడా మధ్య దౌత్యపరమైన ఉద్రిక్తతలు మరింత ముదిరేలా కన్పిస్తున్నాయి. భారత్‌లో తమ దౌత్య సిబ్బందిని తగ్గించుకున్నట్లు అధికారికంగా ప్రకటించిన కెనడా.. ఆ కాసేపటికే భారత్‌లోని తమ దేశ పౌరులు అప్రమత్తంగా ఉండాలంటూ అడ్వైజరీ జారీ చేసి మరోసారి కవ్వింపులకు పాల్పడింది. మరోవైపు సిబ్బందిని తగ్గించిన నేపథ్యంలో ముంబయి, బెంగళూరు, చండీగఢ్‌లో అన్ని రకాల ఇన్–పర్సన్ సేవలను నిలిపివేసినట్లు ప్రకటించింది.

**వ్యక్తిగత వివరాలు చెప్పొద్దు..** "ఇటీవల చోటుచేసుకున్న పరిణామాల నేపథ్యంలో.. భారత్‌లో మీడియా, సామాజిక మాధ్యమాల్లో కెనడాపై వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ఈ క్రమంలోనే కెనడా–వ్యతిరేక ఆందోళనలు, ప్రదర్శనలు జరిగే అవకాశాలున్నాయి. కెనడియన్లపై బెదిరింపులు, వేధింపులు జరగొచ్చు. అందువల్ల దిల్లీ, ఎన్‌సీఆర్ ప్రాంతాల్లో కొత్త వ్యక్తులతో మీరు (కెనడియన్లు) జాగ్రత్తగా ఉండండి. వారికి ఎలాంటి వ్యక్తిగత వివరాలు చెప్పొద్దు.

బెంగళూరు, చండీగఢ్, ముంబయిల్లోనూ అత్యంత జాగ్రత్తగా ఉండండి. ఇక, సాధారణంగా పెద్ద నగరాల్లో విదేశీయులు, పర్యాటకులను లక్ష్యంగా చేసుకుని కొందరు చోరీలకు పాల్పడుతుంటారు. అందుకే, రద్దీ ప్రదేశాలకు వెళ్లినప్పుడు అప్రమత్తంగా ఉండండి" అని కెనడా తమ అడ్వైజరీలో పేర్కొంది.

**ఆ నగరాల్లో వీసా, కాన్సులర్ సేవలు నిలిపివేత..** ఇక, దౌత్య సిబ్బందిని ఉపసంహరించుకున్న దృష్ట్యా.. బెంగళూరు, ముంబయి, చండీగఢ్ నగరాల్లో అన్ని రకాల ఇన్–పర్సన్ సేవలను నిలిపివేస్తున్నట్లు కెనడా తన అడ్వైజరీలో వెల్లడించింది. దీంతో ఈ నగరాల్లో వ్యక్తిగత వీసా, కాన్సులర్ సేవలు తాత్కాలికంగా నిలిచిపోయాయని తెలిపింది. ఈ ప్రాంతాల్లోని కెనడియన్లు ఏదైనా అవసరమైతే దిల్లీలోని కెనడా హై కమిషన్‌ను సంప్రదించాలని సూచించింది. ఖలిస్థానీ ఉగ్రవాది హర్‌దీప్ సింగ్ నిజ్జర్ హత్యలో భారత ఏజెంట్ల హస్తం ఉందంటూ ఇటీవల కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో చేసిన ఆరోపణలతో ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలు భగ్గుమన్నాయి. ఈ ఆరోపణలను భారత్ తీవ్రంగా ఖండించింది. ఇదే సమయంలో భారత అంతర్గత విషయాల్లో కెనడా దౌత్యవేత్తలు అతిగా జోక్యం చేసుకుంటున్నారని ఆరోపిస్తూ.. దౌత్య సిబ్బంది సంఖ్య విషయంలో సమస్థాయిని పాటించాలని సూచించింది. ఈ క్రమంలోనే కెనడా తమ దౌత్య సిబ్బందిని తగ్గించుకోవాలని న్యూదిల్లీ అల్టిమేటం జారీ చేసింది. ఈ నేపథ్యంలోనే భారత్ నుంచి 41 మంది దౌత్యసిబ్బందిని వెనక్కి రప్పించినట్లు కెనడా తాజాగా అధికారికంగా ప్రకటించింది.

# చెత్త సేకరణలో ఇక్కట్లు తొలగేనా..!

కరీంనగర్ : కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలో చెత్త సేకరణను వేగంగా చేపట్టేందుకు మార్పులు రావాల్సిన అవసరముంది. సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్–2016 నిబంధనల ప్రకారం ఎప్పటికప్పుడు మెరుగుపడాలి. ఇప్పటికే తడి, పొడి చెత్తను వేరు చేయడం, వేరు చేసిన చెత్తను డంపింగ్‌యార్డుకు రాకుండా పొడి వనరుల కేంద్రానికి తరలించి అక్కడ విక్రయించే వస్తువులు వేరుచేసి తరలించాల్సి ఉండగా క్షేత్రస్థాయిలో సరైన పర్యవేక్షణ లేక గాడి తప్పుతోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. కొద్ది రోజులుగా కమిషనర్ బి. శ్రీనివాస్ రంగంలోకి దిగి డివిజన్ల నుంచే చెత్త సేకరణ వేరుగా చేసేలా పారిశుద్ధ్య విభాగం ఉద్యోగులు, సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. ప్రస్తుతం డివిజన్ల వారీగా నివాసిత ఇళ్లు, వాణిజ్య దుకాణాలు రెండూ కలిసి ఉన్నాయి. రెండింటినీ విభజించి చెత్తను తరలించడం వల్ల పనులు సులభతరం కావడంతో పాటు నగరపాలిక ఆదాయ మార్గాన్ని పెంచుకునే వీలుంది. అందులో భాగంగా ప్రధాన రహదారులకు ఇరువైపులా ఉన్న దుకాణాల నుంచి చెత్తను తీసుకెళ్లడానికి ప్రైవేటు కన్సల్టెన్సీ ద్వారా సర్వే చేయించారు. ప్రతీ దుకాణానికి జియోట్యాగింగ్ చేశారు. 16 రహదారులు 5,117 దుకాణాలునగరంలోని 60 డివిజన్ల పరిధిలో 16 రహదారులను గుర్తించగా ఆ రోడ్లకు ఇరువైపులా ఏడు వేలకు పైగా వాణిజ్య దుకాణాలు ఉన్నాయి. వీటిలో ఆర్ఎఫ్ఐడీ ట్యాగ్స్ మాత్రం 5,117 దుకాణాలకు మాత్రమే ఏర్పాటు చేశారు. వీటికి జియోట్యాగింగ్, క్యూఆర్ కోడ్ పరిధిలోకి తీసుకొచ్చేందుకు మ్యాపింగ్ చేశారు. ప్రైవేటు సంస్థలు, దుకాణాలు, షోరూంలు, ఫంక్షన్‌హాల్స్, హాస్టల్స్, పార్కులు, ఆసుపత్రులు, పెట్రోల్‌బంకులు, సూపర్‌మార్కెట్లు, చర్చిలు, మసీదులు, దేవాలయాలు, పండ్లు, పూల దుకాణాలు, రెస్టారెంట్లు, హోటళ్లు, టిఫిన్ సెంటర్లు, పరిశ్రమలు, మద్యం దుకాణాలు, అతిథి గృహాలు, బ్యాంకులు, గోదాములు, కోల్డ్ స్టోరేజీ పాయింట్స్, స్వీట్ హౌజ్‌లు, బేకరీలు, మల్టీప్లెక్స్, దాబాలు, లాడ్జీలు, స్క్రాప్ దుకాణాలు, కిరాణం దుకాణాలు, చేపలు, మాంసం, చికెన్ షాపులు, ఆటోస్టోర్లు, డయాగ్నోస్టిక్స్, ఫార్మసీ, మెడికల్ దుకాణాలు, కూరగాయల దుకాణాల వంటివి ఉన్నాయి.

నిత్యం సవాలే.. వాణిజ్య ప్రాంతంలో చెత్త సేకరణ చేయడం సవాలుగా మారుతోంది. దుకాణాలు తెరుచుకునే సమయానికే చెత్తను తీసుకెళ్లే వారు వచ్చి వెళ్తారు. ఆ తర్వాత చెత్తంతా రోడ్ల మీద వేస్తున్నారు. ఇలాంటి వాటికి చెక్ పెట్టడంతో పాటు ఏ దుకాణం నుంచి ఎంత మొత్తాన్ని వసూలు చేస్తారనే విషయం తెలియకుండా మారింది. దీనికి విధివిధానాలు ఖరారు చేయడంతో పాటు ప్రతీ దుకాణం నుంచి చెత్త సేకరణ జరుగుతుందా లేదా అనే విషయాన్ని కమాండ్ కంట్రోల్ కేంద్రం ద్వారా గుర్తించే వీలుంది. తద్వారా పక్కాగా పారిశుద్ధ్య పనులు చేపట్టడానికి అవకాశముంటుంది.

రీడర్స్ బిగింపులో జాప్యంవాణిజ్య దుకాణాల నుంచి చెత్త సేకరణలో జాప్యం రాకుండా ఉండేందుకు స్మార్ట్‌సిటీలో భాగంగా రేడియో ఫ్రీక్వెన్సీ ఐడెంటిఫికేషన్ డివైజ్ (ఆర్ఎఫ్ఐడీ) బిగించారు. దుకాణాల ఎదుట నుంచి చెత్తను ఏ సమయంలో తీసుకెళ్తున్నారు. ఎంత చెత్త వెళుంది? చెత్త తీసుకెళ్లిన తర్వాత తెలిసేలా దీనిని కమాండ్ కంట్రోల్‌కు అనుసంధానం చేయనున్నారు. కాగా రీడర్స్ ఇవ్వకపోవడం, చెత్తను సేకరించే వాహనాల డ్రైవర్లకు స్కానింగ్ పరికరాలు ఇవ్వడంలో జాప్యం జరుగుతోంది. దీంతో ట్యాగ్స్ ఉన్నా వినియోగం లేకుండా పోతోంది. కొందరు వాటిని ఎందుకు అమర్చారనే విషయం తెలియక తొలగిస్తున్నారు. సాంకేతిక పరికరాలు బిగిస్తే ప్రత్యేకంగా వాణిజ్య దుకాణాల నుంచి వ్యర్థాల సేకరణ వందశాతం జరగనుంది.

# రహదారుల విస్తరణ.. వసతులకు పెద్దపీట

ధర్మారం : దినాదినాభివృద్ధి చెందుతున్న ధర్మారం మండలకేంద్రం క్రమంగా పట్టణ రూపును సంతరించుకుంటోంది. ఇప్పటికే ధర్మారం–పెద్దపల్లి రహదారి విస్తరణ పనులు జరుగుతుండగా తాజాగా కరీంనగర్ మార్గం విస్తరణకు నిధులు మంజూరయ్యాయి. ప్రయాణ ప్రాంగణం అభివృద్ధికి నిధులు వచ్చాయి. ఈ పనులన్నీ పూర్తయితే ధర్మారం పట్టణానికి కొత్త శోభ రానుంది.

ప్రధాన మార్గాల్లో తొలగనున్న కష్టాలు

రెండు వరుసలుగా ఉన్న ధర్మారం–పెద్దపల్లి మార్గంలో పట్టణంలోని ప్రధాన కూడలి నుంచి ఎస్సారెస్పీ డి 83బి కాలువ వరకు నాలుగు వరుసలుగా విస్తరణ, విభాగిని నిర్మాణం, సెంట్రల్ లైటింగ్, ఇరువైపులా మురుగు కాలువల నిర్మాణానికి డీఎంఎఫ్‌టీ నుంచి ఒకసారి రూ. 2 కోట్లు, రెండో విడతలో రూ. 3.10 కోట్లు కేటాయించారు. ప్రస్తుతం పనులు తుది దశలో ఉన్నాయి. కాగా వరంగల్–రాయపట్నం రాష్ట్ర రహదారిని ధర్మారంలో ఇరువైపులా విస్తరించేందుకు ఎస్‌డీఎఫ్ నిధులు రూ. 14.50 కోట్లు మంజూరయ్యాయి. ఈ నిధులతో పట్టణంలో 2.4 కిలోమీటర్ల మేర రహదారిని నాలుగు వరుసలుగా విస్తరించడంతో పాటు ఇరువైపులా మురుగు కాలువలు, మధ్యలో డివైడరు నిర్మించనున్నారు. కరీంనగర్–రాయపట్నం రహదారి రెండు వరుసలుగా ఉన్నప్పటికీ పట్టణ పరిధిలో స్థానిక వాహనాల రద్దీ కారణంగా, ఇతర ప్రాంతాలకు వెళ్లే వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా ఉండేది. రహదారి విస్తరణతో ట్రాఫిక్ సమస్యలు తొలగనున్నాయి.

శాశ్వత భవనాలు



పట్టణంలో చేపల మార్కెట్ నిర్మాణానికి రూ. 50 లక్షలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మాణానికి 15వ ఆర్థిక సంఘం నిధులు రూ. 1.56 కోట్లు, గ్రంథాలయ భవన నిర్మాణానికి డీఎంఎఫ్‌టీ నిధులు రూ. 25 లక్షలు మంజూరయ్యాయి. పట్టణంలోని అంతర్గత రహదారులపై సీసీ నిర్మాణం దాదాపు పూర్తయింది. ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో 'మన ఊరు–మనబడి'లో భాగంగా వసతులు అందుబాటులోకి వచ్చాయి. పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే వారి కోసం అంబేడ్కర్ స్టడీ సర్కిల్ భవన నిర్మాణానికి నిధులు కేటాయించారు.

అలసత్వం వీడితేనే మేలు

ధర్మారం పట్టణాభివృద్ధికి విరివిగా నిధులు మంజూరైనా పనులు చేయించడంలో ఆయా శాఖల ఇంజినీరింగ్ అధికారులు తాత్సారం చేస్తున్నారనే విమర్శలున్నాయి. గుత్తేదారులతో సకాలంలో పనులు పూర్తి చేయించడంలో అధికారులు విఫలమవుతున్నారు. ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు దృష్టి సారిస్తే పనులు నాణ్యతతో సకాలంలో పూర్తవుతాయి.

మారనున్న బస్టాండు రూపురేఖలు

పరిసర మండలాలకు కూడలిగా ఉన్న ధర్మారం పట్టణంలోని బస్టాండు నిత్యం ప్రయాణికులతో రద్దీగా ఉంటుంది. వివిధ అవసరాలకు, సామగ్రి కొనుగోలుకు వివిధ గ్రామాల నుంచి నిత్యం అధిక సంఖ్యలో ఇక్కడికి వస్తుంటారు. బస్టాండు అభివృద్ధికి రూ. 1.50 కోట్లు మంజూరు కావడంతో రూపురేఖలు మారనున్నాయి. ప్రధాన రహదారిని ఆనుకొని రెండు వైపులా దుకాణ సముదాయాలు నిర్మించనున్నారు. దీంతో చిరు వ్యాపారులకు మడిగెలు అందుబాటులోకి రానుండగా ఆర్టీసీకి ఆదాయం వస్తుంది. దీనికి తోడు ప్రయాణ ప్రాంగణంలో అపరిశుభ్రత తొలగనుంది.

# అక్రమ దందా.. కొరవడిన నిఘా..!

ఆలేరు : యాదాద్రి భువనగిరి జిల్లాలో పేలుడు పదార్థాల తయారీ, నిల్వలు, రవాణాపై స్థానిక పోలీసుల నిఘా కొరవడిందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఎస్‌వోటీ పోలీసులు దాడుల చేస్తూ కేసులు నమోదు చేస్తున్నప్పటికీ.. కొద్ది రోజుల అనంతరం మళ్లీ యథావిధిగా కొనసాగుతున్నాయి. క్వారీలు, వెంచర్లలో బండరాళ్లను తొలగించేందుకు నిబంధనలకు విరుద్ధంగా పేలుడు పదార్థాలను వినియోగిస్తున్నారు.

కొందరికే ..జిల్లాలో పేలుడు పదార్థాలతో పాటు, అమ్మోనియం నైట్రేట్ స్టోరేజీ పాయింట్లు ఉన్నాయి. కొన్నింటికి అనుమతులు ఉండగా..మరికొన్నింటికి అనుమతులు లేనట్లు సమాచారం. గతంలో వరంగల్, రంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో పట్టుబడిన కొన్ని పేలుడు పదార్థాలు యాదాద్రి జిల్లా నుంచి సరఫరా అయ్యాయి. ఆత్మకూరు(ఎం) మండలం పల్లెర్లలో కుక్క పేలుడు పదార్థాన్ని కొరకడంతో మృత్యువాత పడిన ఘటనలు అప్పట్లో సంచలనం కల్గించాయి. రాష్ట్రంలో ఏ ప్రాంతంలో పేలుడు పదార్థాలు పట్టుబడినా..వీటిలో కొన్నింటికి యాదాద్రి భువనగిరి జిల్లా మూలాలు ఉంటుండటం గమనార్హం. జిలెటిన్‌స్టిక్స్, డిటోనేటర్లు, మేగ్జిన్ బాక్సులు, కనెక్టింగ్ తీగ, బ్లాస్టింగ్ వైరు లాంటివి జిల్లా నుంచి ఇతర ప్రాంతాలకు తరలుతున్నాయి.

లెక్కలేవీ? జిల్లా నుంచి ఇతర ప్రాంతాలకు తరలిస్తున్న పేలుడు పదార్థాలపై పోలీసుల నిఘా కొరవడింది. డీలర్ల నుంచి క్షేత్రస్థాయికి తరలుతున్న పేలుడు పదార్థాలపై లెక్కలు సరిగా ఉండటం లేదని సమాచారం. రవాణా చేసే వాహనం, ఆయా మార్గంలో ప్రయాణించేందుకు అనుమతులు ఉండాలి. కానీ కొన్ని సమయాల్లో అనుమతులు లేకుండానే పేలుడు పదార్థాలను తరలిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

దరఖాస్తు చేయాలి.. పేలుడు పదార్థాల వినియోగానికి పోలీసుల నుంచి విధిగా అనుమతులు తీసుకోవాల్సి ఉంటుంది. రైతులు, భూమి యజమాని తమ పొలంలోని బండరాళ్లను తొలగించేందుకు ముందుగా పోలీసు కమిషనర్, జిల్లా ఎస్పీకి దరఖాస్తు చేయాలి. సదరు ప్రాంతం బ్లాస్టింగ్‌కు అనుకూలంగా ఉందా? అనే విషయాన్ని ఏసీపీ లేదా సీఐ ర్యాంకు స్థాయి అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి నివేదిక ఇస్తారు. నివేదిక ఆధారంగా బ్లాస్టింగ్‌కు అనుమతి ఇస్తారు. ఇందుకు రైతులు, వ్యక్తులు కొంత రుసుం చెల్లించాల్సి ఉంటుంది. బ్లాస్టింగ్ చేయాలనుకునే సంస్థ, వ్యక్తులకు లైసెన్సు ఉండాలి. అనుమతి లేనివారు బ్లాస్టింగ్ చేస్తే ఎక్స్‌ప్లోజివ్స్ చట్ట ప్రకారం శిక్షార్హులు.

2023 సెప్టెంబరు 8న యాదగిరిగుట్టలో పోలీసులు తనిఖీలు చేస్తుండగా.. డి. వినోద్ అనే వ్యక్తి వద్ద ఆరు జిలెటిన్‌స్టిక్స్, 5 డిటోనేటర్స్ దొరికాయి. విచారణలో శివరాత్రి మహేష్ తనకు విక్రయించాడని చెప్పడంతో.. రాయిగిరిలోని మహేష్ ఇంటిని సోదా చేయగా 239 జిలెటిన్‌స్టిక్స్, 666 డిటోనేటర్లు దొరికాయి. ఇద్దరిపైనా కేసులు నమోదు చేశారు.

2019 ఆగస్టులో శంషాబాద్ సమీపంలో బిల్లు, వేబిల్లు లేకుండా అమ్మోనియం నైట్రేట్ తరలిస్తున్న వాహనాన్ని అక్కడి పోలీసులు పట్టుకున్నారు. సోడియం నైట్రేట్ పేరుతో పేలుడుకు ఉపయోగించే అమ్మోనియం నైట్రేట్‌ను అక్రమంగా రవాణా చేశారు. విచారణలో భువనగిరి మండలంలోని ఒక ఎక్స్‌ప్లోజివ్స్ కంపెనీ నుంచి అక్రమంగా తరలినట్లు తేలింది.

జిల్లాలోని బొమ్మలరామారం మండలం మైలారం, రాంలింగంపల్లి, నాగినేనిపల్లి, పెద్దపర్వతాపూర్, బీబీనగర్ మండలం జమీలాపేట, నెమరగొమ్ముల, జియాపల్లి, ఆలేరు మండలం శ్రీనివాసపురంలోని క్రషర్స్‌లో పేలుడు పదార్థాలను వినియోగిస్తూ కొండలు, గుట్టలను పేల్చివేస్తున్నారు. దీంతో సమీపంలోని ఇళ్లకు బీటలు ఏర్పడుతున్నాయి.



# దూరాన్ని చెరిపి.. విదేశీ పర్యటనల్లో మోదీ చరిత్ర..!

దిల్లీ: కొద్దిరోజుల్లో 2023 చరిత్రలో కలిసిపోతుండగా.. కొత్త ఏడాదిలోకి అడుగుపెట్టే సమయం ఆసన్నమైంది. ఈ క్రమంలో ఈ ఏడాదిలో ప్రధాని మోదీ చేసిన అధికారిక విదేశీ పర్యటనలు, ఈ సందర్భంగా అందుకున్న గౌరవాలు, కుదుర్చుకున్న ఒప్పందాల గురించి MyGovIndia వరుస ట్వీట్లు చేసింది. "2023 ఒక అద్భుతమైన సంవత్సరం. భారతదేశం బలీయమైన ప్రపంచ శక్తిగా ఆవిర్భవించడాన్ని ఇది సూచిస్తుంది. ప్రధానమంత్రి దౌత్య కార్యక్రమాల్లో ఇది స్పష్టంగా కనిపించింది. 26 ఏళ్ల తర్వాత ఈజిప్టు, 40 ఏళ్ల తర్వాత గ్రీస్, తొలిసారి పపువా న్యూగినియాకు వెళ్లిన భారత ప్రధానిగా మోదీ(%వీశీఱ%) చరిత్ర సృష్టించారు. తమ దేశ అత్యున్నత పురస్కారాలు ఇచ్చి ఆరు దేశాలు ఆయన్ను గౌరవించాయి. మొత్తంగా 15 ప్రతిష్ఠాత్మక పురస్కారాలు దక్కాయి. ప్రపంచదేశాల మధ్య పెరుగుతోన్న సహకారానికి 'ఇండియా-మిడిల్ ఈస్ట్-యూరప్ ఎకనామిక్ కారిడార్' ఒక కలికితురాయి" అని కేంద్ర ప్రభుత్వానికి చెందిన MyGovIndia పోస్టులు పెట్టింది. విదేశీ పర్యటనల సమయంలో ప్రవాస భారతీయులు, ఆయా ప్రభుత్వాల నుంచి మోదీ విశేష ఆదరణ సొంతం చేసుకున్నారు. పపువా న్యూగినియా ప్రధాని జేమ్స్ మరాపే మోదీకి స్వాగతం పలుకుతూ.. ఏకంగా ఆయన కాళ్లకు నమస్కరించారు. అప్పట్లో ఈ దృశ్యాలు వైరల్ అయ్యాయి. ఈ ఏడాది జూన్‌లో అమెరికా పర్యటన వేళ.. చరిత్రాత్మక ఒప్పందాలు కుదిరిన సంగతి తెలిసిందే.

# అసెంబ్లీ ఎన్నికలకు సిద్ధమవుతున్న సీఎం జగన్



అమరావతి : ఏపీలో ఎన్నికల మీద అన్ని రాజకీయ పక్షాలకు ఒక స్పష్టత ఉందని భావించాలి. ఇక అధికార పార్టీకి దీని మీద సంకేతాలు కూడా వస్తాయని అంటున్నారు. కేంద్రంలోని ఈసీ ఎప్పటికపుడు ఏపీలో అసెంబ్లీ ఎన్నికల మీద సన్నద్ధం చేస్తూ వస్తోంది. దాంతో ఎన్నికలు ఎపుడు అంటే మాత్రం ఏప్రిల్ లో అని ఒక మాట అయితే ఉంది. గతసారి అంటే 2019లో ఏప్రిల్ 11న ఎన్నికలు జరిగాయి. ఈసారి మాత్రం దానికి ఒక ఇరవై రోజుల ముందే ఏపీలో ఎన్నికలు జరుగుతాయని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మంత్రులతో ఇష్టాగోష్టిలో మాట్లాడుతూ చెప్పారని అంటున్నారు. అంటే మార్చి 20న ఎన్నికలు ఏపీలో జరిగే అవకాశాలు ఉన్నాయా అన్న చర్చ వస్తోంది. ఇక జగన్ ఎన్నికల మీద కీలకమైన వ్యాఖ్యలే చేసారు. ఈసారి ఎన్నికల నోటిఫికేషన్ ముందే వస్తుందని ముఖ్యమంత్రి చెప్పడం విశేషం. అలాగే ఇరవై రోజుల ముందు నోటిఫికేషన్ వచ్చే అవకాశం ఉందని జగన్ స్పష్టంగా చెప్పారు. అందువల్ల మంత్రులంతా మరింత కష్టపడి పనిచేయాలని ముఖ్యమంత్రి కోరడం జరిగింది. దీన్ని బట్టి చూస్తే ఎన్నికలకు ముందు నెల రోజుల ముందు నోటిఫికేషన్ అంటే ఫిబ్రవరి 20లోగా వస్తుంది అని అంటున్నారు. అంటే కొత్త ఏడాది మొదలవుతూనే ఎన్నికల దిశగానే అంతా సాగుతారు అన్న మాట. జగన్ ఈ మాట చెప్పారు అంటే బలమైన ఆధారాలతోనే అని అంటున్నారు. కేంద్రంలోని బీజేపీ మంచి ఊపు మీద ఉంది. సెమీ ఫైనల్స్ గా భావించే అయిదు రాష్ట్రాల ఎన్నికల్లో బీజేపీ పై చేయి సాధించింది. మూడు రాష్ట్రాలను గెలుచుకుని సత్తా చాటింది. ఆ ఊపు అలా ఉండగానే ఎన్నికలకు వెళ్తే మంచి ఫలితాలు వస్తాయని బీజేపీ భావిస్తోంది అని అంటున్నారు. నిజానికి డిసెంబర్ లోనే కేంద్రం ఎన్నికలు వెళ్లాలని చూసింది అని అప్పట్లో వార్తలు వినిపించాయి. అయితే రామమందిరం ప్రారంభం వంటి భవ్యమైన కార్యక్రమం ఉంది. జనవరి 22న ఆ కార్యక్రమం పూర్తి అవగానే బీజేపీ కూడా ఎన్నికల సన్నాహాల్లో పడుతుంది అని అంటున్నారు. బడ్జెట్ సెషన్ లో ఓటాను అకౌంట్ ప్రవేశపెడితే కేంద్రానికి ఎన్నికలకు వెళ్లడం చాలా సులువు అవుతుంది. అన్నీ ఆలోచించుకుంటే కనుక ఫిబ్రవరి మూడవ వారంలో నోటిఫికేషన్ ఇచ్చి మార్చి ఏప్రిల్ నెలలలో రెండు నెలల పాటు ఏడు దశలలో ఎన్నికలు పెడతారు అని అంటున్నారు. అంటే మే నెల మండుటెండలు రాకుండానే కేంద్రంలో ఏపీలో కొత్త ప్రభుత్వాలు కొలువుతీరేలా ఎన్నికల షెడ్యూల్ ఉంటుంది అన్న మాట. అందుకే ఏపీ ప్రభుత్వం కూడా పరీక్షలను ముందుకు జరిపింది. ఇపుడు జగన్ ముందే ఎన్నికల షెడ్యూల్ రిలీజ్ అవుతుంది అని చెప్పడంతో ఎన్నికల ఫీవర్ ఏపీకి వచ్చేసింది అని అంటున్నారు.

# అంగన్వాడీలకు ఇచ్చిన హామీలను జగన్ గాలికొదిలేశారు: లోకేశ



ఎలమంచిలి: ముఖ్యమంత్రిగా జగన్ అధికారంలోకి వచ్చాక బీసీ సబ్‌ప్లాన్ నిధులను దారి మళ్లించారని తెదేపా జాతీయ ప్రధాన కార్యాదర్శి నారా లోకేశ్ ఆరోపించారు.

ఉమ్మడి విశాఖ జిల్లా ఎలమంచిలి నియోజకవర్గంలో 224వ రోజు యువగళం పాదయాత్ర కొనసాగుతోంది. పాదయాత్రలో భాగంగా అరబుపాలెంలో బీసీల నాయకులు, అనకాపల్లిలోని బెల్లం తయారీదారులు, గంగాదేవిపేటలో రైతులతో లోకేశ్ సమావేశమయ్యారు.

**బీసీలపై 26 వేల అక్రమ కేసులు పెట్టారు :** ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. "బీసీలపై జగన్ ప్రభుత్వం 26 వేల అక్రమ కేసులు పెట్టింది. మేం అధికారంలోకి వచ్చాక బీసీలకు రక్షణ చట్టం తెస్తాం. ప్రభుత్వ పెద్దల అండతోనే రాష్ట్రంలో గంజాయి సాగు జోరుగా సాగుతోంది. తెదేపా-జనసేన ప్రభుత్వం అధికారంలోకి రాగానే నల్ల బెల్లంపై ఆంక్షలు తొలగిస్తాం. చెరకు రైతులకు ప్రభుత్వం తరఫున సహకారం అందించి ఆదుకుంటాం. వ్యవసాయ రంగం పూర్తిగా సంక్షభంలో కూరుకుపోయింది. రాష్ట్రవ్యాప్తంగా ఇరిగేషన్ కాల్వల నిర్వహణను పూర్తిగా గాలికొదిలేశారు. అధికారంలోకి రాగానే శారద కాల్వ పూడిక తీయిస్తాం. కాల్వలో నీరు కలుషితం కాకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటాం" అని చెప్పారు.

**మంత్రుల వ్యాఖ్యలు దుర్మార్గం :** మునగపాకలో అంగన్వాడీల శిబిరానికి వెళ్లిన లోకేశ్.. అధికారంలోకి వచ్చాక అంగన్వాడీల డిమాండ్లు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. "బెదిరింపు వ్యాఖ్యలు జగన్ నియంతృత్వ పోకడలకు నిదర్శనం. వాలంటీర్లతో నడిపించుకుంటామని మంత్రులు చెప్పడం దుర్మార్గం. అంగన్వాడీలకు జగన్ ఇచ్చిన హామీలను గాలికొదిలేశారు. అంగన్వాడీల న్యాయ పోరాటానికి తెదేపా అండగా ఉంటుంది" అని లోకేశ్ భరోసా ఇచ్చారు.



## రతన్ టాటాకు బెదిరింపులు

# రతన్ టాటాకు బెదిరింపులు.. ముంబయి పోలీసులు అలర్ట్

ముంబయి: ప్రముఖ పారిశ్రామికవేత్త రతన్ టాటాకు బెదిరింపులు రావడం కలకలం రేపింది. ఇటీవల ముంబయి పోలీసు కంట్రోల్ రూమ్‌కు గుర్తుతెలియని వ్యక్తి ఫోన్ చేసి.. రతన్ టాటా ప్రాణానికి ముప్పు ఉందని హెచ్చరించినట్లు పోలీసు వర్గాలు వెల్లడించాయి. టాటా భద్రతను పెంచాలని.. లేదంటే ఆయనకు కూడా సైరస్ మిస్త్రీలాగే అవుతుందని పేర్కొన్నట్లు తెలిపాయి.

ఈ వారం ఆరంభంలో జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. దీంతో అప్రమత్తమైన పోలీసులు రతన్ టాటా భద్రతను పెంచడంతో పాటు కొన్ని తనిఖీలు కూడా చేపట్టినట్లు పోలీసు వర్గాలు వెల్లడించాయి. అదే సమయంలో ఆ ఫోన్ కాల్ చేసిన వ్యక్తి గురించి దర్యాప్తు చేపట్టారు. కర్ణాటక నుంచి ఆ ఫోన్ వచ్చినట్లు గుర్తించి.. వెంటనే అక్కడికి వెళ్లి అతడిని అరెస్టు చేశారు. నిందితుడిని పుణెకు చెందిన వ్యక్తిగా గుర్తించారు. కొద్ది రోజుల క్రితమే ఇంటి నుంచి వెళ్లిపోయిన అతడు.. కర్ణాటక నుంచి ముంబయి పోలీసులకు ఫోన్ చేసినట్లు దర్యాప్తులో తేలింది.

నిందితుడు మానసిక సమస్యలతో బాధపడుతున్నట్లు పోలీసు వర్గాలు పేర్కొన్నాయి. ఘటనపై దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపాయి. టాటా సన్స్ మాజీ ఛైర్మన్ అయిన సైరస్ మిస్త్రీ గతేడాది సెప్టెంబరులో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన విషయం తెలిసిందే. అహ్మదాబాద్ నుంచి ముంబయి వెళ్తుండగా ఆయన ప్రయాణిస్తున్న కారు డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో మిస్త్రీతో పాటు కారులో ఉన్న మరో వ్యక్తి కూడా ప్రాణాలు కోల్పోయారు.



# వివాహేతర సంబంధం.. మహిళను హతమార్చి.. వ్యక్తి ఆత్మహత్య!

కర్నూలు నేర విభాగం: వివాహేతర సంబంధం నేపథ్యంలో మహిళను హతమార్చి.. ఆపై ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన శనివారం ఉదయం కర్నూలు జిల్లా నందికొట్కూరులో జరిగింది. కర్నూలు మూడో పట్టణ సీఐ మురళీధర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. నందికొట్కూరులోని హౌసింగ్ బోర్డు కాలనీలో నివాసం ఉండే విజయ్‌కుమార్(35) ప్రైవేటు సంస్థలో అకౌంటెంట్‌గా పనిచేస్తున్నాడు. తన ఇంటికి సమీపంలో నివాసం ఉండే రుక్సానా(45) అనే మహిళతో గత కొంతకాలంగా వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నాడు. ఈ విషయంపై రుక్సానా కుటుంబంలో గొడవలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో శుక్రవారం విజయ్‌కుమార్, రుక్సానాతో కలిసి కర్నూలులోని ఓ లాడ్జిలో గదిని అద్దెకు తీసుకున్నాడు. శనివారం ఉదయం ఇద్దరూ ఎంతకూ తలుపులు తీయకపోవడంతో అనుమానం వచ్చిన లాడ్జి సిబ్బంది తలుపులు బద్దలు కొట్టారు. గదిలో రుక్సానా, విజయ్‌కుమార్ రక్తపు మడుగులో విగతజీవులుగా పడి ఉన్నారు. మహిళ మృతదేహంపై కత్తిపోట్లు ఉండటంతో విజయ్‌కుమార్.. రుక్సానాను కత్తితో పొడిచి.. అనంతరం అతడు విషం తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.



# ఇది అంతులేని విషాదం

హమాస్ అంతమే లక్ష్యంగా గాజాలో జరుపుతోన్న దాడుల్లో శత్రువులుగా పొరపాటుపడి ఇజ్రాయెల్ సైన్యం ముగ్గురు బందీలను కాల్చి చంపింది. ఈ విషయాన్ని ఐడీఎఫ్ స్వయంగా వెల్లడించింది. దీనిపై ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు తీవ్ర విచారం వ్యక్తం చేశారు. అంతులేని విషాదమని వ్యాఖ్యానించారు. 'మన ముగ్గురు బందీల మృతితో నేను కూడా దుఃఖంతో తలవంచుకుంటున్నాను. ఇది అంతులేని విషాదం. ఈ వార్త తెలిసిన తర్వాత ఇజ్రాయెల్ ప్రజలంతా దుఃఖంలో మునిగిపోయారు. ఈ క్లిష్ట సమయంలో మృతుల కుటుంబాల గురించే నా ఆలోచనంతా. తమ ప్రాణాలను పణంగా పెట్టి, బందీలను విడిపించేందుకు పోరాడుతోన్న మన సైనికులు మనోబలంతో ముందుగా సాగాలని కోరుకుంటున్నాను. ఇలాంటి పరిస్థితుల్లో బందీలను సురక్షితంగా తీసుకువచ్చేందుకు గాయాలు కనిపించకుండా, పాఠాలు నేర్చుకుంటూ ముందుకు సాగుతున్నాం ' అని నెతన్యాహు సోషల్ మీడియా వేదికగా పోస్టు పెట్టారు.

**మేం ఇజ్రాయెల్ పక్షమే.. పునరుద్ఘాటించిన అమెరికా** మృతి చెందిన వారిలో ఒకరు ఇజ్రాయెల్‌లోని కెఫార్ అజా ప్రాంతానికి చెందిన యోటమ్ హైమ్ కాగా, మరొకరు కిబుట్జ్ నిర్ అమ్ ప్రాంతానికి చెందినవారిగా సైన్యం గుర్తించింది. మూడో వ్యక్తి పేరును కుటుంబసభ్యుల విజ్ఞప్తి మేరకు గోప్యంగా ఉంచింది. హమాస్ జరిపిన నరమేధానికి ప్రతిగా ఇజ్రాయెల్ చేస్తోన్న దాడుల్లో గాజాలో ఇప్పటివరకు 18 వేల మందికి పైగా మృతి చెందారు. దాంతో గాజాలో యుద్ధాన్ని ఆపాలని అంతర్జాతీయ సంస్థలు, కనీసం మానవతా సాయం కొనసాగించేందుకు వీలుగా యుద్ధ తీవ్రతను తగ్గించాలని అమెరికా సహా పలు దేశాలు ఇజ్రాయెల్‌ను కోరుతున్నాయి.

ఈ క్రమంలో బందీల మృతి ఘటన చోటుచేసుకుంది. ప్రస్తుత ఘటనపై అమెరికా అధ్యక్షుడు బైడెన్ తన భద్రతా సిబ్బందితో సమావేశం నిర్వహించారు. 'ఇది తీవ్ర ఆందోళనకర విషాదం' అని శ్వేతసౌధ జాతీయ భద్రతా మండలి ప్రతినిధి జాన్ కిర్బీ విచారం వ్యక్తం చేశారు. ఇందుకు దోహదం చేసిన పరిస్థితులపై ఇజ్రాయెల్ విచారణ జరుపుతుందని ఆశిస్తున్నట్లు చెప్పారు.

# అది రోడ్డు ప్రమాదం కాదా... హత్యా!?

## ఎమ్మెల్సీ సాబ్జీ మరణంపై అనేక అనుమానాలు!!?

ఏలూరు : ఆంధ్రప్రదేశ్ కు చెందిన ఎమ్మెల్సీ రోడ్డు ప్రమాదంలో చనిపోయినట్లుగా వార్తలు రావటం తెలిసిందే. అయితే.. తన తండ్రిది రోడ్డు ప్రమాదం కాదని.. హత్య చేసి దాన్ని యాక్సిడెంట్ గా చిత్రీకరిస్తున్నట్లుగా సంచలన ఆరోపణలు చేస్తున్నారు ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ కుమారుడు. పక్కా ప్లాన్ తోనే తన తండ్రిని చంపేశారని.. దాన్ని రోడ్డు ప్రమాదంగా చెబుతున్నారని ఆరోపిస్తున్నారు. తన తండ్రి కూర్చున్న వైపునే లక్ష్యంగా చేసుకొని వాహనంతో ఢీ కొట్టినట్లుగా సాబ్జీ కుమారుడు చెబుతున్నారు. పశ్చిమగోదారి జిల్లా ఉండి మండలం చెరుకువాడ సమీపంలో చోటు చేసుకున్న రోడ్డుప్రమాదం పెను సంచలనంగా మారటం తెలిసిందే. తన తండ్రి మరణంపై అనుమానాలు వ్యక్తం చేశారు. సాబ్జీ సోదరుడు సైతం ఇదే అనుమానాన్ని వ్యక్తం చేస్తున్నారు. "మా తమ్ముడి మరణం ప్రమాదంతో జరగలేదు. ప్లాన్ చేసి చంపేశారు. మా తమ్ముడి మీద కక్ష కట్టారు" అని ఎమ్మెల్సీ సోదరుడు ఫరీద్ కాశీం ఆరోపించారు. గతంలోనూ ఆయనపై హత్యాయత్నం జరిగిందని చెబుతున్నారు. చంపాలన్న ఉద్దేశం లేకుంటే గంటకు 140కిలోమీటర్ల స్పీడులో వచ్చి కారును.. ఒకవైపు బలంగా ఢీ కొట్టటం ఏమిటి? అని ప్రశ్నిస్తున్నారు. రాబోయే ఎన్నికలకు ముందు ఉపాధ్యాయులకు మద్దతుగా ఉండే ఎమ్మెల్సీని కుట్రపూరితంగా అంతమొందించినట్లుగా కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. సాబ్జీ మరణం రాజకీయ రగడకు దారి తీసే అవకాశం ఉందంటున్నారు. ఈ ఘటనపై సీబీసీఐడీ విచారణ జరిపించాలన్న డిమాండ్ వస్తోంది. ఇదంతా ఒక ఎత్తు అయితే.. పోస్టుమార్టం సైతం నిర్లక్ష్యంగా చేసినట్లుగా విమర్శలు వస్తున్నాయి. పోస్టుమార్టం అనంతరం అంబులెన్సులోకి ఎక్కిస్తుండగా సాబ్జీ డెడ్ బాడీ నుంచి తీవ్రరక్తస్రావమైంది. సరిగా కుట్లు వేయని కారణంగానే ఇలా జరిగిందని కుటుంబ సభ్యులు మండిపడుతున్నారు. దీంతో.. మళ్లీ ఆసుపత్రి లోపలకు తీసుకెళ్లి డ్రెస్సింగ్ చేసి పంపారు. ఒక ఎమ్మెల్సీ మరణంపై సంచనలంగా మారిన ఉదంతంలో వైద్యులు.. వైద్య సిబ్బంది ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరించటమా? అన్న విస్మయం వ్యక్తమవుతోంది. అనునిత్యం ప్రజలతో మమేకం అయ్యే ఎమ్మెల్సీ సాబ్జీని చంపే పరిస్థితి ఎవరికి ఉంటుందన్నది ప్రశ్నగా మారింది. అంగన్ వాడీ కార్యకర్తలు వైసీపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన చేపట్టారు. దీనికి హాజరైన ఎమ్మెల్సీ సాబ్జీ.. వారికి మద్దతు తెలిపిన అనంతరం ఏలూరు నుంచి తన వాహనంలో బయలుదేరారు. భీమవరం నుంచి అకివీడు వైపు వెళుతున్న ఆయన వాహనాన్ని వేగంగా వచ్చిన కారు ఢీ కొంది. ఆ కారు ఎమ్మెల్సీ ప్రయాణిస్తున్న కారుకు ఎదురుగా రావటం గమనార్హం. ఈ ప్రమాదంలో కారు డ్రైవర్.. ఎమ్మెల్సీ గన్ మెన్ .. ఆయన పీఏలు తీవ్రంగా గాయపడ్డారు. వారిని భీమవరం ఆసుపత్రికి తరలించారు. సీఎం జగన్ నిర్వహిస్తునన కేబినెట్ భేటీ వేళలోనే ఎమ్మెల్సీ రోడ్డు యాక్సిడెంట్ గురించి తెలిసినంతనే..ముఖ్యమంత్రితో పాటు సహచర మంత్రులు రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం కేబినెట్ భేటీని నిర్వహించారు. ఎమ్మెల్సీ మరణంపై విపక్ష నేత చంద్రబాబు స్పందించారు. తన సంతాపాన్ని తెలియజేశారు. చివరి ఘడియల్లోనూ ప్రజా సేవలో గడిపారన్నారు. ఉపాధ్యాయుడైన సాబ్జీకి క్లీన్ చిట్ ఉంది. ప్రజలకు ఏదో చేయాలన్న తపన ఎక్కువ. ప్రభుత్వ టీచర్ గా ఐదేళ్ల సర్వీసు మిగిలిన ఉండగానే వీఆర్ఎస్ తీసుకొన్నారు. 2019 ఫిబ్రవరిలో సీపీఎస్ రద్దు కోరుతూ నిరసన కార్యక్రమాన్ని ముందుండి నడిపారు. ఏలురునుంచి విజయవాడ వరకు పాదయాత్రకు నాయకత్వం వహించారు. యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడిగా సేవలు అందించిన ఆయనకు ప్రభుత్వ ఉపాధ్యాయుల్లో మంచి పేరుంది. ఆయన మరణం షాకింగ్ గా మారింది.



# యువగళం సభకు పవన్ రావట్లేదు.. అచ్చెన్నాయుడు ప్రకటన



అమరావతి: ఏపీలోని భోగాపురం మండలం పోలిపల్లి సమీపంలోని భూమాత లేఅవుట్‌లో ఈ నెల 20వ తేదీన నిర్వహించే యువగళం పాదయాత్ర ముగింపు సభకు జనసేన అధినేత పవన్ కళ్యాణ్ రావడం లేదని ఆంధ్రప్రదేశ్ తెలుగుదేశం అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. శనివారం నాడు టీడీపీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. "20వ తేదీన పోలిపల్లి గ్రామంలో యువగళం పాదయాత్ర ముగింపు సభ జరుగుతుంది. ఆ సభకి జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు. నారా లోకేష్ పాల్గొంటారు. ఈ సభకి రాష్ట్రం నలుమూలల నుంచి లక్షల మంది కార్యకర్తలు హాజరుకానున్నారు. ఈ సభకి 16 కమిటీలు ఏర్పాటు చేశాం. ఈ సభకి 6 లక్షలు మందికి పైగా హాజరవుతారని అంచనా వేస్తున్నాం. వైసీపీ కౌంట్ డౌన్ ప్రారంభమైంది. వైసీపీలోని అనేకమంది టీడీపీ పార్టీలో చేరడానికి రెడీ అవుతున్నారు. ఇది యువగళంలో భాగంగానే జరుగుతుంది. ఈ మధ్య చంద్రబాబు నాయుడు అరెస్ట్‌తో మ్యానిఫెస్టో సిద్ధం కాకపోవడంతో ఈ సభకి పవన్ కళ్యాణ్ హాజరుకావడం లేదు. త్వరలో పూర్తి మ్యానిఫెస్టో సిద్ధమైన తర్వాత పవన్ కళ్యాణ్, చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో భారీ సభ నిర్వహిస్తాం. జగన్మోహన్‌రెడ్డిని ప్రజలు ఇంటికి పంపించేందుకు సిద్ధంగా ఉన్నారు" అని అచ్చెన్నాయుడు ఎద్దేవ చేశారు.

# గోల్డ్ డిజైన్ లో సీతమ్మ మెరిసిపోతుందే!

ఢిల్లీ బ్యూటీ కృతిసనన్ కి టాలీవుడ్ కలిసిరాకపోయినా బాలీవుడ్ మాత్రం కలిసొచ్చింది. ఎన్నో అంచ నాలు...ఆశలతో తెలుగు లో లాంచ్ అయినా అవన్నీ ఇక్కడ ఆవిరిగానే మిగిలిపోయాయి. డెబ్యూ 'వన్ నేనొక్కడినే' సహా రీసెంట్ గా రిలీజ్ అయిన 'ఆదిపురుష్' కూడా అలాంటి అనుభవాన్నే మిగిల్చింది. సాధారణంగా ఇలాంటి పెద్ద చిత్రాల్లో అవకాశం రావడం అన్నదే అరుదు. కానీ ఆ విషయంలో కృతిసనన్ ఎంతో లక్కీ. అంత లక్కీ కాకపోతే వన్ ప్లాప్ అయినా...పనిగట్టుకుని ప్రభాస్ సరసన ఆదిపురుష్ లో ఎంపికైంది? అంటే ఇంకేమనాలి. కానీ తాను ఒకటనుకుంటే....మరోలా జరుగుతోంది. అయినా అమ్మడిని బాలీవుడ్ మాత్రం ఆదుకుంటుంది. అక్కడ మాత్రం వరుసగా సినిమాలు చేస్తూ బిజీ నాయిగా మారిపోయింది. ఈ మధ్యనే జాతీయ అవార్డు సైతం అందుకుని ఉత్తమ నటిగా నీరాజానలు సొంతం చేసుకుంది. టాలీవుడ్ లో లక్




ఎంతగా కలిసి రాలేదో? బాలీవుడ్ లో మాత్రం అంతకు రెట్టింపు అదృష్టం కలిసొస్తు న్నట్లే కనిపిస్తుంది. అందుకు జాతీయ అవార్డు కూడా కొన్ని సినిమాలకే కైవసం చేసుకుంది. ఇప్పుడు కథల విషయంలో మరింత సెలక్టివ్ గా ఉంటుంది. ఓ సినిమా కి సైన్ చేయాలంటే ఒకటికి పదిసార్లు పాత్ర ఎలా ఉంటుంది? ఒప్పుకున్న తర్వాత పేరొస్తుందా? రాదా? ఇలా అన్ని విషయాలు ఆలోచించకుని కమిట్ అవుతుంది. ఇక సోషల్ మీడియాలో కృతి సనన్ ఫాలోయింగ్ చెప్పాల్సిన పనిలేదు. ఇన్ స్టాలో ఎప్పటికప్పుడు టెం...గ్ ఫోటోలతో అలరిస్తూనే ఉంటుంది. తాజాగా హాలో కవర్ పేజీ కోసం అమ్మడు మరోసారి చెలరేగిన వైనం యువతలో చర్చకొస్తుంది. ఇదిగో ఇక్కడిలా గోల్డ్ కలర్ డిజైన్ దుస్తుల్లో చూపరులను ఆకట్టుకుం టుంది. కృతిలో బ్యూటీని ఈ దుస్తులు మరింత అందంగా తీర్చిదిద్దాయి. ప్రస్తుతం ఈ ఫోటో నెట్టింట వైరల్ గా మారింది. అభిమానులు తమదైన శైలిలో కామెంట్లు పోస్ట్ చేస్తున్నారు.

## తెలుగమ్మాయి బోల్డ్ యాటిట్యూడ్

తెలుగమ్మాయి శ్రేయా ధన్వంతరి బోల్డ్ ఫోటోషూట్లు ఇటీవల అగ్గి రాజేస్తున్నాయి. ముఖ్యంగా బికినీలు పొట్టి నిక్కర్లలో శ్రేయ చెలరేగిపోతోంది. ఇప్పుడు ఈ బ్యూటీ ఇన్నర్ అందాలను ఎలివేట్ చేస్తూ మిర్రర్ లో ఫోజులిచ్చిన ఫోటోలు అంతర్జాలాన్ని షేక్ చేస్తున్నాయి. ఇక ఇన్నర్ సొంపులను దాచేందుకు ఈ భామ లెదర్ కోట్ ని ధరించి కనిపించింది. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన స్టన్నింగ్ ఫోటోషూట్ అంతర్జాలాన్ని షేక్ చేస్తోంది. శ్రేయా కెరీర్ మ్యాటర్ కి వస్తే.. నాగచైతన్య జోష్ లో ఓ చిన్న పాత్ర తర్వాత ఈ తెలుగు బ్యూటీ 'స్నేహగీతం'లో నలుగురిలో ఒక కథానాయికగా పరిచయమైంది. సందీప్ కిషన్ హీరోగా నటించిన ఈ చిత్రానికి మధురా శ్రీధర్ దర్శకత్వం వహించారు. ఆరంగేట్రం ఎంతో ట్రెడిషనల్ గా కనిపించిన శ్రేయా ఆ తర్వాత హిందీ తమిళ చిత్రాల్లో ప్రయత్నాలు



చేసింది. హిందీ పరిశ్రమ తన యాటిట్యూడ్ ని చాలా మార్చింది. ముఖ్యంగా అక్కడ వెబ్ సిరీస్ లలో నటించేప్పుడు శ్రేయాలోని బోల్డ్ యాటిట్యూడ్ బయటపడింది. పనిలో పనిగా వెబ్ సిరీస్ లు సినిమాల్లో అవకాశాల కోసం సరికొత్త ఎత్తుగడలతో ముందుకు సాగుతోంది. ముఖ్యంగా అసాధారణ ఫాలోవర్స్ ఉన్న సోషల్ మీడియాల్లో శ్రేయ హాటెస్ట్ లుక్స్ తో చెలరేగిపోవడం హాట్ టాపిక్ గా మారుతోంది. వరుసగా క్రేజీ వెబ్ సిరీస్ లలో అవకాశాలు అందుకుంటోంది శ్రేయా. ఇటీవల ఫ్యామిలీ మ్యాన్ సిరీస్ తో పాటు స్కామ్ 92 లో నటించిన శ్రేయా ధన్వంతరి వీలున్న ప్రతిసారీ ఒంటరి దీవుల విహారాలను ఆస్వాధించింది. ది ఫ్యామిలీ మ్యాన్ - ముంబై డైరీస్ 26/11 వంటి పాపులర్ వెబ్ సిరీస్ లలో నటిగా తనదైన ముద్ర వేసింది. శ్రేయ సూపర్ బోల్డ్ ఫోటోషూట్ ఇప్పుడు హాట్ టాపిక్ గా మారింది.




# ఆ ఐదు సంక్రాంతి సినిమాల లేటెస్ట్ అప్డేట్




తెలుగు వారికి, తెలుగు సినీ ప్రేక్షకులకు ఎంతో కీలకమైన సంక్రాంతి పండుగకి ఇంకా నెల సమయం కూడా లేదు. జనాలు పండుగ కోసం సిద్దం అవుతూ ఉంటే, సినీ ప్రేక్షకులు సంక్రాంతి వినోదం కోసం ఎదురు చూస్తున్నారు. ఈసారి ఏకంగా అయిదు సినిమాలు సంక్రాంతి రేసులో ఉన్నాయి. ఆ అయిదు సినిమాలు కూడా వేటికి అవే అన్నట్లుగా రెడీ అవుతున్నాయి. ఆ అయిదు సినిమాల మేకింగ్ విషయంలో ఏ దశలో ఉన్నాయో ఇప్పుడు చూద్దాం. సంక్రాంతి బరిలో నిలిచిన సినిమాల్లో అత్యంత క్రేజీ ప్రాజెక్ట్ గుంటూరు కారం. మహేష్ బాబు హీరోగా త్రివిక్రమ్ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ సినిమా షూటింగ్ కార్యక్రమాలు చివరి దశకు చేరుకున్నాయి. డిసెంబర్ నాల్గవ వారం కు మొత్తం షూటింగ్ పూర్తి అయ్యే అవకాశాలు ఉన్నాయి. మరో వైపు పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ కూడా సమాంతరంగా జరుగుతోంది. సంక్రాంతికి గుంటూరు కారం దుమ్ము లేపడం ఖాయం అంటున్నారు. నాగార్జున నా సామి రంగ సినిమాతో సంక్రాంతికి ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాడు. ఈ సినిమా కు సంబంధించిన షూటింగ్ ప్రస్తుతం రామోజీ ఫిల్మ్ సిటీలో జరుగుతోంది. మరో పది రోజుల్లో షూటింగ్ ముగియనున్నట్లుగా మేకర్స్ చెబుతున్నారు. ఈ సినిమాకు కూడా పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ జరుగుతున్నాయి. వెంకటేష్ సైంధవ్ సినిమా షూటింగ్ కార్యక్రమాలు పూర్తి చేసుకుని పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ కూడా ముగింపు దశకు చేరుకుంది. ఏ క్షణంలో అయినా సినిమాను సెన్సార్ కి పంపించే అవకాశాలు ఉన్నాయి అంటూ సమాచారం అందుతోంది. ఇప్పటికే వెంకీ ప్రమోషన్ కార్యక్రమాలను షురూ చేశాడు. రవితేజ నటిస్తున్న ఈగల్ సినిమా షూటింగ్ పూర్తి చేసుకుని పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ దశలో ఉంది. ఈ నెలాకరు వరకు సినిమా యొక్క ఫస్ట్ కాఫీ సిద్ధం అవుతుందని, వెంటనే సెన్సార్ ఫార్మాల్టీస్ ని కూడా ముగించాలని భావిస్తున్నట్లుగా తెలుస్తోంది. తేజ, ప్రశాంత్ వర్మ కాంబోలో రూపొందుతున్న హనుమాన్ సినిమా షూటింగ్ కార్యక్రమాలు పూర్తి చేసుకుని పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ దశలో ఉంది. వీఎఫ్ఎక్స్ వర్క్ ముగింపు దశకు చేరడంతో సంక్రాంతికి దూకేందుకు హనుమాన్ రెడీ అవుతున్నాడు. మొత్తానికి సంక్రాంతి సినిమాలు అన్నింటిలోకి వెంకటేష్ సైంధవ్ సినిమా మాత్రమే రెడీగా ఉంది. మిగిలిన సినిమాలు ఇంకా షూటింగ్ లేదా పోస్ట్ ప్రొడక్షన్ దశలో ఉన్నాయి. ఈ అయిదులో చివరి నిమిషంలో ఏ సినిమా అయినా పోటీ నుంచి తప్పుకునేనా అనే సందేహాలు కూడా కలుగుతున్నాయి.

# 'బ్రహ్మాస్త్ర 2'పై 'యానిమల్' ఎఫెక్ట్






రణబీర్ కపూర్ నటించిన బ్రహ్మాస్త్ర బ్లాక్ బస్టర్ విజయం సాధించినట్టు ప్రచారమైంది. కానీ ఇది యావరేజ్ హిట్. ఈ సినిమా తర్వాత వెంటనే తూ జీతూ.. సినిమాతో రణబీర్ మరో హిట్టందుకున్నాడు. ఇప్పుడు యానిమల్ తో కెరీర్ బెస్ట్ హిట్ అందుకున్నాడు. కానీ ఇంకా బ్రహ్మాస్త్ర సీక్వెల్ గురించి మాట లేదు. నిర్మాత కరణ్ జోహార్ దీనిపై ఇంతవరకూ పెదవి విప్పలేదు. నిజానికి బ్రహ్మాస్త్ర విడుదల సమయంలో దీనిపై బోలెడంత హంగామా నడిచింది. కానీ ఇప్పుడు ఈ సీక్వెల్ సెట్స్ కెళుతుందా లేదా? ఉంటుందా ఉండదా? అంటూ సందేహాలు వ్యక్తమవుతున్నాయి. అయితే దీనిపై కరణ్ ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని తెలిసింది. అంతేకాదు బ్రహ్మాస్త్ర 2 భారీ మల్టీస్టారర్ గా చిత్రీకరించాల్సి ఉంటుంది. కథ డిమాండ్ మేరకు రణబీర్ తో పాటు ఇందులో రెండో పెద్ద హీరో నటించాల్సి ఉంటుంది. కానీ అలా రెండో హీరో కూడా యాడయితే బడ్జెట్ అదుపు తప్పుతుందని ఆలోచిస్తున్నారట. రెండో హీరోగా రణవీర్ ని తీసుకునే ఆలోచన ఉందని కూడా కథనాలొచ్చాయి. బ్రహ్మాస్త్ర 2 ఆలస్యమవ్వడానికి యానిమల్ ఎఫెక్ట్ కూడా ఉందని అంటున్నారు. రణబీర్ ఇప్పుడు 1000 కోట్ల క్లబ్ ని అందుకున్నాడు. దానికి తగ్గట్టు భారీ పారితోషికం పెంచేసాడు. సుమారు 60 కోట్ల మేర డిమాండ్ చేస్తున్నాడనేది టాక్. ఒకవేళ ఇదే నిజమైతే, రణబీర్ తో పాటు నటించే పెద్ద హీరో కూడా 60కోట్లు డిమాండ్ చేసే వీలుంటుంది. దీంతో బడ్జెట్ మరింత పెద్దదవుతుంది. ఇక బ్రహ్మాస్త్ర త్రయం అంతా భారీ వీఎఫ్ ఎక్స్ మీద ఆధారపడి ఉంది కాబట్టి 500 కోట్ల లోపు బడ్జెట్ సరిపోదు. ఇది ఆర్.ఆర్.ఆర్ కంటే ఎక్కువ బడ్జెట్ ని కోరుతుంది. అంటే బ్రహ్మాస్త్ర 2ని ఇద్దరు పెద్ద స్టార్లతో నిర్మిస్తే బడ్జెట్ సుమారు 600 కోట్లు పైగా అవుతుంది. అంత పెద్ద బడ్జెట్ పెడితే ఆర్.ఆర్.ఆర్ లేదా పఠాన్ తరహాలో 1000 కోట్లు అంతకుమించి వసూలు చేస్తేనే వర్కవుటవుతుంది.

అలా కాకుండా ఫెయిలైతే నిర్మాత నిండా మునిగిపోతాడు. అందుకే కరణ్ ఇప్పుడు ఆచితూచి అడుగులు వేస్తున్నాడు. బ్రహ్మాస్త్ర 2 చిత్రం 2026లోపు సెట్స్ కెళ్లే అవకాశం లేదని కూడా ప్రముఖ బాలీవుడ్ మీడియా కథనం వెలువరించింది. అయితే ఇది అధికారిక సమాచారం కదు. ప్రస్తుతానికి ఊహాగానాలు మాత్రమే.

# యానిమల్ : ఆమె తీసుకుంది రూ.40 లక్షలు... చేసింది రూ.4 కోట్లు

త్రిప్తి డిమ్రి... ప్రస్తుతం ఈ పేరు ఏ రేంజ్ లో మారు మ్రోగుతోందో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. యానిమల్ సినిమాకు ముందు ఈమె అతి కొద్ది మందికి మాత్రమే తెలుసు. ఒక వెబ్ సిరీస్ లో నటించి, సోషల్ మీడియాలో అందాల ఫోటో షూట్స్ ను షేర్ చేసినా కూడా పెద్దగా ఈమెకి గుర్తింపు ఉండేది కాదు. కానీ ఇప్పుడు ఆమె రేంజ్ ఏంటో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. యానిమల్ సినిమాలో మెయిన్ హీరోయిన్ గా నటించిన రష్మిక మందన్నా కంటే కూడా ఎక్కువగా ఇప్పుడు చిన్న పాత్రలో నటించిన త్రిప్తి డిమ్రి గురించిన చర్చ జరుగుతోంది. రణబీర్ కపూర్ తో ఆమె చేసిన సన్నివేశాలు.. ముఖ్యంగా వారిద్దరి మధ్య ఉండే ఇంటిమేట్ సన్నివేశాలు సినిమాకు మాస్ లో పిచ్చి క్రేజ్ ను తెచ్చి పెట్టాయి. సినిమా వెయ్యి కోట్ల కలెక్షన్స్ దిశగా దూసుకు పోతుంది అంటే అందులో ఒక కారణం త్రిప్తి డిమ్రి అందం మరియు ఆమె నటన అనడంలో సందేహం లేదు అంటూ జాతీయ మీడియా వర్గాల వారు కూడా కామెంట్స్ చేస్తున్నారు. అంతటి



త్రిప్తి యానిమల్ సినిమా కోసం తీసుకున్న పారితోషికం ఎంతో తెలుసా.. అక్షరాల రూ.40 లక్షలు.. ఔను... త్రిప్తి డిమ్రి కేవలం రూ.40 లక్షలు మాత్రమే పారితోషికంగా తీసుకుంది. సినిమా విడుదల అయ్యి, నిర్మాతలకు మంచి లాభాలు వచ్చిన నేపథ్యంలో ఇప్పుడు ఆమెకు ఏమైనా పెద్ద మొత్తం ఇచ్చి ఉంటారేమో కానీ... సినిమా కి ఆమె సైన్ చేసినప్పుడు మాత్రం కేవలం రూ.40 లక్షలకే ఓకే చెప్పిందని జాతీయ మీడియాలో కథనాలు వస్తున్నాయి. రష్మిక మందన్న ఈ సినిమాకు గాను రూ.4 కోట్లు, బాబీ డియోల్ రూ.4 కోట్లు పారితోషికంగా తీసుకున్నారు. ఇక రణబీర్ కపూర్ రూ.50 కోట్లు మరియు లాభాల్లో వాటాను తీసుకున్నట్లుగా కొన్ని బాలీవుడ్ మీడియా సంస్థలు కథనాలు రాస్తున్నాయి. వీరి పారితోషికం ఏమో కానీ త్రిప్తి డిమ్రి పారితోషికం అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. యానిమల్ కి రూ.40 లక్షలు పారితోషికం తీసుకున్న త్రిప్తి... ఆ సినిమా తో వచ్చిన క్రేజ్ తో తదుపరి సినిమాకు కోటికి పైగా తీసుకునే అవకాశాలు ఉన్నాయి. ఆమె డిమాండ్ చేయాలే కాని రాబోయే రోజుల్లో రూ.5 కోట్ల వరకు కూడా త్రిప్తి అందుకునే అవకాశాలు ఉన్నాయంటూ కొందరు బాలీవుడ్ విశ్లేషకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

## మహేష్ మాటతో అమ్మడి రేంజ్ ఎక్కడికో..

ప్రస్తుతం టాలీవుడ్ లో బిజీయస్ట్ హీరోయిన్ ఎవరంటే అందరూ చెప్పే పేరు శ్రీలీలా. ఇండస్ట్రీలో చాలా తక్కువ టైంలో ఫుల్ పాపులారిటీ తెచ్చుకుంది ఈ యంగ్ హీరోయిన్. ప్రజెంట్ టాలీవుడ్ లో బ్యాక్ టు బ్యాక్ సినిమాలు చేస్తున్న శ్రీలీల ఈమధ్య రొటీన్ పాత్రలతో ఆడియన్స్ ని నిరాశ పరుస్తూ వస్తోంది. ఇప్పటివరకు శ్రీలీల నటించిన సినిమాలను పరిశీలిస్తే ఒక్క 'భగవంత్ కేసరి' తప్పితే మిగిలిన సినిమాలు అన్నిటిలోనూ గ్లామర్ పాత్రల్లో రొటీన్ గా కనిపించింది. ఆ సినిమాలన్నీ బాక్సాఫీస్ వద్ద తీవ్రంగా నిరాశపరిచాయి. శ్రీలీల నటించిన స్కంద, ఆదికేశవ, ఎక్స్ ట్రా ఆర్డినరీ మ్యాన్ సినిమాల్లో కేవలం ఓ టెంప్లేట్ క్యారెక్టర్, ఒక డాన్స్ నెంబర్, రెండు ఫారెన్ సాంగ్స్.. అంతే తప్పితే వీటిలో మరేం లేదు. దాంతో శ్రీలీలా క్యారెక్టర్ రొటీన్ అయిపోయిందని ఆడియన్స్ భావిస్తున్నారు. ఇలాంటి సమయంలో గుంటూరు కారం మూవీలో శ్రీలీల కనిపించిన తీరుతో ఆమెకి మరింత మైలేజ్ వచ్చిందని చెప్పొచ్చు. ఇప్పటివరకు టాలీవుడ్ లో కమర్షియల్ సినిమాల్లో శ్రీలీల పోషించిన పాత్రలతో నిరాశ చెందిన ఫ్యాన్స్ తాజాగా మహేష్ బాబు గుంటూరు కారం మూవీ నుంచి



రిలీజ్ అయిన 'ఓ మై బేబీ' సాంగ్ ప్రోమో సినిమాలో శ్రీలీలా క్యారెక్టర్ పై మరింత హైప్ క్రియేట్ చేసింది. ఈ ప్రోమోలో మహేష్ బాబు శ్రీలను 'అమ్ము' అని ముద్దుగా పిలిచి తనను తాను 'రావణ' గా పరిచయం చేసుకోవడం అందరినీ ఎంతగానో ఆకట్టుకుంది. ప్రోమోని బట్టి చూస్తే సినిమాలో శ్రీలీల పాత్రకి ఎంతో ఇంపార్టెన్స్ ఉందని అర్థమైంది. శ్రీలీల గత సినిమాల్లో చేసిన క్యారెక్టర్స్ కంటే గుంటూరు కారం లో ఆమె క్యారెక్టర్ విభిన్నంగా ఉండబోతుందని చెప్పొచ్చు. ఈ ప్రోమో చూసిన చాలామంది శ్రీలీలకి ఈ మూవీ మంచి మైలేజ్ ఇస్తుందని చెబుతున్నారు. శ్రీలీల కూడా తన ఆశలన్నీ మహేష్ సినిమా పైనే పెట్టుకుంది. గుంటూరు కారం తనను టాప్ ప్లేస్ లో ఉంచుతుందని శ్రీలీలా ఆశిస్తోంది. టాలీవుడ్ లో గతంలో చేసుకుంటే కొంతమంది హీరోయిన్స్ కెరీర్ స్టార్టింగ్ లో ఒకటి రెండు సినిమాలతోనే ఓవర్ నైట్ స్టార్ స్టేటస్ అందుకుని ఆ తర్వాత సక్సెస్ అవడంలో విఫలమయ్యారు. ఉదాహరణకు తాప్సి, కృతి శెట్టి లాంటి హీరోయిన్స్ గతంలో ఇదే పేస్ చేశారు. దానివల్ల టాలీవుడ్ లో వీళ్ళ కెరియర్ ప్రమాదంలో పడుతుంది. ఇప్పుడు శ్రీలీల కూడా అదే స్టేజ్ లో ఉంది మరి. గుంటూరు కారంతో ఈ యంగ్ బ్యూటీ ఎలాంటి రిజల్ట్ ని అందుకుంటుందో చూడాలి.



# కేసీఆర్‌కు పదవులిచ్చిందే కాంగ్రెస్

హైదరాబాద్: అసెంబ్లీలో సభ్యుల సంఖ్య ముఖ్యం కాదని, ప్రజాస్వామ్య స్ఫూర్తి ఉండాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆకాంక్షించారు. కేసీఆర్‌కు పదవులిచ్చిందే కాంగ్రెస్ పార్టీ అని చెప్పారు. ఈ మేరకు గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై అసెంబ్లీలో వాడీవే'ఢీ'గా చర్చ జరిగింది.

శనివారం శాసనసభ సమావేశాలు ప్రారంభం కాగానే.. ప్రతిపక్ష నేతగా కేసీఆర్ పేరును సభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్ ప్రకటించారు. అనంతరం గవర్నర్ ప్రసంగం ధన్యవాద తీర్మానాన్ని శాసనసభలో పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి ప్రతిపాదించగా.. చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి బలపరిచారు.

**తెలంగాణను అప్పుల కుప్పగా మార్చిన చరిత్ర భారాసదే :** ఆ తర్వాత భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ మాట్లాడుతూ.. గవర్నర్ ప్రసంగమంతా తప్పుల తడకగా, సత్యదూరంగా ఉందని ఆరోపించారు. ఆయన మాట్లాడుతుండగా.. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి పొన్నం ప్రభాకర్ అడ్డు తగిలారు. 2014కు ముందు అన్యాయం జరిగిందనే తెలంగాణ కోసం కొట్లాడామని చెప్పారు. ప్రసంగం మొదలు పెట్టడమే కేటీఆర్ దాడి చేస్తున్నట్లు మాట్లాడడం సరికాదన్నారు.

నిర్మాణాత్మక సూచనలు ఇస్తే తీసుకుంటామని తెలిపారు. "రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చిన చరిత్ర భారాసదే. ఆర్‌డబ్ల్యూఎస్ ద్వారా కట్టిన వ్యవస్థలు, సంస్థలను ధ్వంసం చేశారు. తెలంగాణను రూ.5లక్షల కోట్ల అప్పుల రాష్ట్రంగా మార్చారు" అని భట్టి అన్నారు.

**50 ఏళ్ల కాంగ్రెస్ పాలనను ఏమనాలి? :** దీంతో తెలంగాణ రాకముందు బీడువారిన భూములు ఉండేవని, 10 ఏళ్ల భారాస పాలనను విధ్వంసం అంటే.. 50 ఏళ్ల కాంగ్రెస్ పాలనను ఏమనాలి?అని కేటీఆర్ ప్రశ్నించారు. కొత్త ప్రభుత్వానికి 3 నెలల సమయం ఇద్దామని కేసీఆర్ చెప్పారన్నారు. భారాస అధికారంలో ఉన్నా ప్రతిపక్షంలో ఉన్నా.. ప్రజల పక్షమేనన్నారు. గత కాంగ్రెస్ పాలనలో ఆత్మహత్యలు, ఆకలి కేకలు ఉన్నాయని.. పదవుల కోసం పెదాలు మూసిన చరిత్ర కాంగ్రెస్‌ది అని చెప్పారు.

**మేం చెప్పే ప్రయత్నం చేసినా వారు తెలుసుకోరు: సీఎం –** కేటీఆర్ వ్యాఖ్యలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడారు. "కొంతమంది ఎన్‌ఆర్‌ఐలకు ప్రజాస్వామిక స్ఫూర్తి అంటే అర్థం తెలియట్లేదు. మనం ప్రయత్నం చేసినా కూడా వారు తెలుసుకోరు. సభ్యుల సంఖ్య ముఖ్యం కాదు.. ప్రజాస్వామ్య స్ఫూర్తి ఉండాలి. కృష్ణా జలాల్లో తెలంగాణ వాటాపై పోరాడింది కాంగ్రెస్ నేతలే. కేసీఆర్‌కు వివిధ పదవులు ఇచ్చిందే కాంగ్రెస్ పార్టీ. ఎమ్మెల్యే కాకుండానే హరీశ్ రావుకు మంత్రి పదవి ఇచ్చిందే వైఎస్ రాజశేఖర్‌రెడ్డి" అని చెప్పారు.

**అప్పుడు ఒక్క పీజేఆర్ తప్ప ఎవరూ మాట్లాడలేదు..** సీఎం రేవంత్ సభను తప్పుదోవ పట్టించేలా మాట్లాడుతున్నారని హరీశ్ రావు కలగజేసుకున్నారు. "అప్పుడు పోతిరెడ్డి ప్రాజెక్టును ఆపాలని మేం కోరాం. ఆరు కారణాలతో మేం ఆ రోజు రాజీనామా చేశాం. అప్పట్లో మంత్రులుగా ఉన్న కాంగ్రెస్ నేతలు ఎవరూ మాట్లాడలేదు. ఒక్క పీజేఆర్ తప్ప ఎవరూ పోతిరెడ్డిపాడుపై మాట్లాడలేదు. మేం గెలిచి.. కాంగ్రెస్ పార్టీకి భిక్ష పెట్టాం. మేం పొత్తు పెట్టుకోవడం వల్లే నాడు కాంగ్రెస్ అధికారంలో వచ్చింది" అని తెలిపారు. ఆపై కేటీఆర్ మాట్లాడుతూ.. "తెలంగాణ ప్రజలు ఎన్నుకున్న వ్యక్తి కాకుండా దిల్లీ నామినేట్ చేసిన వ్యక్తి సీఎం అయ్యారు. పదేళ్లలో మహబూబ్‌నగర్‌లో వలసలు ఆగిపోయాయి. ఎన్‌ఆర్‌ఐలకు టికెట్లు అమ్ముకున్నది ఎవరో చెప్పాలి?. సోనియా గాంధీని బలిదేవత అన్నది ఎవరో అందరికీ తెలుసు. మేనిఫెస్టోలోని హామీలను కాంగ్రెస్ అమలు చేయాలి. కోటిన్నర మంది మహిళల ఖాతాలో రూ.2,500 వేస్తామన్నారు. డబ్బులు ఎప్పుడు ఇస్తారా? అని మహిళలు ఎదురుచూస్తున్నారు. మేనిఫెస్టోలని హామీలు అమలు చేస్తే స్వాగతిస్తాం" అని అన్నారు.

# గవర్నర్ ప్రసంగం అంతా తప్పుల తడక.. కేటీఆర్ ఆగ్రహం



హైదరాబాద్ : నిన్న ఉభయ సభలను ఉద్దేశించి చేసిన గవర్నర్ ప్రసంగం అంతా తప్పుల తడకగా ఉందని బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేటీఆర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. శాసనసభలో గవర్నర్ ప్రసంగానికి ధ న్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ సందర్భంగా కేటీఆర్ మాట్లాడారు. గవర్నర్ ప్రసంగం పూర్తిగా అసత్యాలు, అభూత కల్పనలు, తప్పుల తడకగా సాగింది. ఇలాంటి ప్రసంగాన్ని వినడానికి ఒక సభ్యుడిగా సిగ్గుపడుతున్నా. ఇంత దారుణమైన ప్రసంగం రాష్ట్ర శాసనసభ చరిత్రలో విని ఉండం. వెయ్యి ఎలుకలు పిల్లి తీర్థయాత్రలకు బయల్దేరినట్లు, చేయాల్సిన ఘాతుకాలన్నీ చేసి చాలా అద్భుతమైన ఉపన్యాసం చేసి, గత ప్రభుత్వంపై నెపాన్ని నెట్టే ప్రయత్నం చేసింది ఈ కాంగ్రెస్ ప్రభుత్వం. దీన్ని తప్పుబడుతున్నా. గవర్నర్ దారుణమైన ప్రసంగం చూసిన తర్వాత.. కాంగ్రెస్ పరిపాలనలో రాష్ట్ర భవిష్యత్ ఐదేండ్లు ఎట్ల ఉండబోతుందో మాకు, రాష్ట్ర ప్రజలకు అర్థమైంది. వాస్తవాలు ప్రజల ముందు పెట్టాల్సిన బాధ్యత మాపై ఉంది అని కేటీఆర్ స్పష్టం చేశారు.



# కేటీఆర్‌పై రేవంత్ సెటైర్

## హాట్ హాట్‌గా అసెంబ్లీ.. కేటీఆర్‌ను ఎన్ఆర్ఐ అంటూ రేవంత్ సెటైర్

హైదరాబాద్: తెలంగాణ అసెంబ్లీ హాట్ హాట్‌గా నడుస్తోంది. గవర్నర్‌కు ధన్యవాదాలు తెలిపే తీర్మానంలో భాగంగా బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేటీఆర్ చేసిన వ్యాఖ్యలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కౌంటర్ ఇచ్చారు. గవర్నర్ ప్రసంగం పూర్తిగా తప్పులతడకే అని.. తాము ఎప్పటికీ ప్రజాపక్షమే తెలంగాణ పక్షమే.. కాంగ్రెస్ ఎప్పటికీ విపక్షమే అన్న కేటీఆర్ కామెంట్స్‌పై రేవంత్ మండిపడ్డారు. కేటీఆర్‌ను ఎన్ఆర్ఐ అంటూ సెటైర్ విసిరారు. కొంతమంది ఎన్ఆర్ఐలకు ప్రజాస్వామ్యం గురించి చెప్పినా అర్థం కాదన్నారు. అచ్చోసిన ఆంబోతులా పోడియంకు వస్తాం అంటే సరికాదన్నారు. పోతిరెడ్డిపాడుకు పొక్క పెట్టినరోజు మాట్లాడిన నాయకుడు పీజేఆర్ తమ నేత అని చెప్పుకొచ్చారు. చీమలు పెట్టిన పుట్టలో జొర్రినట్టు కేటీఆర్ మేనేజ్‌మెంట్ కోటాలో వచ్చారని వ్యాఖ్యలు చేశారు. కేకే మహేందర్ రెడ్డికి అన్యాయం చేశారన్నారు.

గత పాలన గూర్చి మాట్లడుడామంటే ఒక రోజంతా చర్చ పెడదామన్నారు. గత పాలనలో పాపం ఉందంటే ఆనాటి పాలకుల్లో చాలా మంది ఇప్పుడు బీఆర్ఎస్‌లోనే ఉన్నారని తెలిపారు. కేసీఆర్‌కు యూత్ కాంగ్రెస్ నాయకుడిగా అవకాశం ఇచ్చింది కాంగ్రెస్ అని గుర్తుచేశారు. కేసీఆర్‌కు సింగిల్ విండో ఎన్నికలలో పోటీచేసే అవకాశం ఇచ్చింది కాంగ్రెస్ అని తెలిపారు. పిల్లి శాపనార్థాలకు ఉట్లు తెగిపడవన్నారు. ప్రతి పక్షాలను గౌరవించే సంప్రదాయం కాంగ్రెస్ పార్టీకి ఉందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.



# తెలంగాణ అసెంబ్లీకి వచ్చిన జైరాం రమేష్

హైదరాబాద్: తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు హాట్ హాట్‌గా నడుస్తున్నాయి శనివారం నాడు కేంద్ర మాజీ మంత్రి , కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేష్ అసెంబ్లీకి వచ్చారు.

ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి ఛాంబర్‌కి జైరాం రమేష్ వచ్చారు. సీఎం రేవంత్, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కలతో పాటు ఇతర మంత్రులను జైరాం రమేష్ కలిశారు. ఈ సమావేశంలో పలు అంశాలపై మాట్లాడినట్లు సమాచారం.

# అయ్యప్ప భక్తులకు సౌకర్యాలు ఏర్పాటు చేయండి

న్యూఢిల్లీ: కేరళలోని శబరిమల అయ్యప్పస్వామి క్షేత్రంలో కనీస ఏర్పాట్ల లేమి కారణంగా భక్తులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని కేంద్ర సాంస్కృతిక, పర్యాటక, ఈశాన్య రాష్ట్రాల అభివృద్ధి శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. భక్తులకు అవసరమైన సౌకర్యాలు కల్పించాలని కేరళ ముఖ్యమంతి పినరయి విజయన్‌కు లేఖ రాశారు. శబరిమలలో అయ్యప్పస్వాములకు కనీస సౌకర్యాలు కల్పించే విషయంలో కేంద్రప్రభుత్వం తరపున సంపూర్ణసహకారం ఉంటుందని ఆయన లేఖలో పేర్కొన్నారు. అయ్యప్పస్వామి భక్తులు 40 రోజులపాటు చేసే ఆధ్యాత్మిక భావనతో కూడిన మండల దీక్ష ఆ తర్వాత.. శబరిమలలో కొలువైన స్వామివారిని దర్శించుకోవడం హిందూ ధర్మంపట్ల ప్రజల్లో ఉన్న విశ్వాసానికి నిదర్శనం. ప్రతి ఏటా నవంబర్ నుంచి జనవరి మధ్యలో కోటిమందికిపైగా భక్తులు వివిధ రాష్ట్రాలనుంచి మండలదీక్షను పూర్తిచేసుకుని అయ్యప్పస్వామి దర్శనం కోసం కేరళ రాష్ట్రంలోని శబరిమలకు వస్తున్న విషయం తెలిసిందే. ప్రతిఏటా శబరిమలకు తెలుగు రాష్ట్రాల (తెలంగాణ, ఆంధ్రప్రదేశ్) నుంచి వచ్చే భక్తుల సంఖ్య 15 లక్షలకు పైగానే ఉంటుంది. అయితే ఈసారి శబరిమలలో అయ్యప్పస్వామి సన్నిధానంలో ఏర్పాట్లు సరిగాలేని కారణంగా భక్తులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నట్లు.. భక్తుల ద్వారా, పత్రికలు, చానళ్లలో వస్తున్న వార్తల ద్వారా తెలుస్తోంది. ఇటీవలే.. శబరిమల అయ్యప్ప సన్నిధానంలో.. దర్శనం సందర్భంగా కనీస ఏర్పాట్లులేక తొక్కిసలాటలో ఓ బాలిక చనిపోయిన విషయం తెలిసి చాలా బాధకలిగింది. శబరిమలలో అయ్యప్పస్వాములకు తీవ్ర అసౌకర్యం ఎదురవుతున్న సందర్భంలో.. ప్రభుత్వం తరపున తగిన సంఖ్యలో ఉద్యోగులను, ఇతర సిబ్బందిని శబరిమలలో మోహరించి.. భక్తులకు అవసరమైన ఏర్పాట్లు చేయగలరని కోరుతున్నాను. శబరిమలపై, భక్తుల పాదయాత్ర మార్గాల్లో.. భోజనం, నీరు, వైద్యంతో సహా స్వాములకు అవసరమైన ఇతర ఏర్పాట్లను వెంటనే చేయగలరని మనవి చేస్తున్నాను. అయ్యప్పస్వామి మండల దీక్షలో ఉన్న భక్తులకు శబరిమల యాత్ర సందర్భంగా కనీస సౌకర్యాలు కల్పించడం, వారి యాత్ర భక్తిప్రదంగా, శుభప్రదంగా జరిగేలా చూడడం అత్యంత అవసరం. ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వం సంపూర్ణ సహకారం భక్తులకు సౌకర్యార్థం అందించేందుకు సిద్ధంగా ఉంది. భక్తులకు ఏర్పాట్లు చేసే విషయంలో.. పంబానది పరిసరాలు, సన్నిధానం వరకు పాదయాత్ర, ట్రెక్కింగ్ జరిగే ప్రాంతాల్లో భక్తులకు సహాయం చేసే విషయంలో.. స్వచ్ఛంద సేవాసంస్థలను కూడా భాగస్వాములను చేసేదిశగా చొరవతీసుకోవాలని కోరుతున్నాను. ఈ విషయంలో మీరు వీలైనంత త్వరగా.. ప్రత్యేక చొరవతీసుకుని రాష్ట్ర ప్రభుత్వ యంత్రాగాన్ని మోహరించి అన్నిరకాల చర్యలు తీసుకోవాలని ఆకాంక్షిస్తున్నానని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి లేఖలో పేర్కొన్నారు.



# శ్రీధర్ బాబు నన్ను కెలికాడు..

## కాంగ్రెస్‌ను అధికారంలోకి తెచ్చింది మేమే..

హైదరాబాద్ : తెలంగాణ అసెంబ్లీ చివరి రోజున అట్టుడికి పోతోంది. బీఆర్ఎస్ వర్సెస్ కాంగ్రెస్ మాటల యుద్ధం జరుగుతోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సభను తప్పుదో పట్టించారని ఎమ్మెల్యే హరీష్ రావు విమర్శించారు. సభా రికార్డులు సరి చేయాలన్నారు. 14 నెలలకే మేము వైఎస్ కేబినెట్ నుంచి బయటకు వచ్చామన్నారు. పోతిరెడ్డిపాడు, పులిచింతల, 610జీఓ, బూటకపు ఎన్‌కౌంటర్‌లకు నిరసనగానే తాము కేబినెట్ నుంచి బయటకు వచ్చామన్నారు. ఆనాడు మంత్రులుగా ఉన్న వారు పదవుల కోసం పెదవులు మూసుకున్నారని హరీష్ రావు విమర్శించారు. ఆనాడు కాంగ్రెస్‌ను అధికారంలోకి తెచ్చింది బీఆర్ఎస్ మాత్రమేనన్నారు. తాము పొత్తు పెట్టుకోవడం వల్లనే నాడు కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందన్నారు. ఆనాడు కాంగ్రెస్ అధికారం తాము పెట్టిన బిక్ష అన్నారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. ప్రజల తీర్పుతోనైనా బీఆర్ఎస్ రియలైజ్ కావాలన్నారు. ఇందిరమ్మ రాజ్యంలోని ఇళ్లు, భూములు వచ్చాయన్నారు. అధికారంలో ఉన్నప్పుడూ.. ఇప్పుడు అదే చెబుతున్నామన్నారు. ఆనాడు మీరు ఎన్ని సీట్లలో నిలబడ్డారు? ఎన్ని గెలిచారని ప్రశ్నించారు. బీఆర్ఎస్ వల్ల తాము గెలిచామనడం హాస్యాస్పదమని శ్రీధర్ బాబు తెలిపారు. ఆ వెంటనే హరీష్ రావు మాట్లాడుతూ.. శ్రీధర్ బాబు తనను కెలికారని.. కిరణ్ కుమార్ రెడ్డి ఒక్క రూపాయి ఇవ్వనుపో అన్న రోజు వీరు మాట్లాడలేదని అన్నారు.



# నళినికి వెంటనే ఉద్యోగం ఇవ్వండి.. పోలీస్ శాఖను ఆదేశించిన సీఎం రేవంత్

హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఉద్యోగానికి రాజీనామా చేసిన డీఎస్పీ నళినికి అదే ఉద్యోగాన్ని మళ్లీ ఇవ్వడానికి ఇబ్బందేంటని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ప్రశ్నించారు. ఆమెకు ఉద్యోగం చేయాలనే ఆసక్తి ఉంటే ఉద్యోగంలోకి తీసుకోవాలని సీఎస్, డీజీపీలను ఆదేశించారు. పోలీస్ శాఖలో ఉద్యోగం ఇవ్వడానికి ఇబ్బంది ఉంటే అదే హోదాలో ఇతర శాఖలో జాబ్ ఇవ్వాలని సూచించారు. పోలీస్ శాఖలో నియామకాలపై సచివాలయంలో సీఎం సమీక్ష నిర్వహించారు. తెలంగాణ రాష్ట్రం కోసం ఉద్యోగాని వదులుకున్న నళినికి ఉద్యోగం ఇవ్వడంలో అభ్యంతరాలు ఎందుకన్నారు. రాష్ట్రం కోసం రాజీనామా చేసిన నాయకులకు పదవులు వచ్చినప్పుడు, ఆమెకు ఎందుకు అన్యాయం జరగాలని ప్రశ్నించారు. ఉద్యోగంలో చేరడానికి నళిని ఆసక్తికనబరిస్తే వెంటనే ఇప్పించాలని ఆదేశాలు జారీ చేశారు.

# కేటీఆర్‌కు డిప్యూటీ సీఎం భట్టి కౌంటర్



హైదరాబాద్: తెలంగాణ అసెంబ్లీలో అధికార కాంగ్రెస్ పార్టీ, ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీ మధ్య మాటల యుద్ధం నడుస్తోంది. గవర్నర్‌కు ధన్యవాదాలు తెలిపే తీర్మానంలో గత 50 ఏళ్ల పాలనపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేటీఆర్ చేసిన కామెంట్స్‌పై డిప్యూటీ సీఎం భట్టి కౌంటర్ ఇచ్చారు. "55 ఏళ్లు ఏం చేశారని మమ్మల్ని అంటున్నారు. అది బాగాలేదనే తెలంగాణ తెచ్చుకున్నాం. మిగులు బడ్జెట్‌తో ఉన్న రాష్ట్రాన్ని మీ చేతిలో పెట్టాము. ఐదు లక్షల కోట్లతో రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చారు. సంపదతో కూడిన తెలంగాణను విధ్వంసం చేశారు" అంటూ భట్టి ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఇంతకీ కేటీఆర్ ఏమన్నారంటే... "పదేళ్లు విధ్వంసం జరిగింది అంటున్నారు. మరి 50 ఏళ్ల విధ్వంసం గురించి మాట్లాడొద్దా. తాగునీరు సాగునీరు విద్యుత్ ఇవ్వలేని అసమర్థులు. మొదటి రోజే ఇంత భయపడితే ఎలా. మూడు నెలలు సమయమిస్తే కచ్చితంగా అట్టర్ ప్లాప్ అవుతుంది. పదవుల కోసం పెదవులు మూసుకున్న చరిత్ర తెలంగాణ కాంగ్రెస్ నేతలది" అంటూ కేటీఆర్ విరుచుకుపడ్డారు.

# కేటీఆర్ వ్యాఖ్యలు సరైనవి కావు



హైదరాబాద్: బీఆర్ఎస్, మజ్లిస్, బీజేపీ పార్టీలు కలిపి 54 మంది ఎమ్మెల్యేలం ఉన్నామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల తారక రామారావు మాట్లాడుతున్నారని ఆ వ్యాఖ్యలు సరైనవి కావని.. ఇది మంచి పద్ధతి కాదని సీపీఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు పేర్కొన్నారు. శనివారం నాడు అసెంబ్లీలో ఆయన మాట్లాడుతూ..." అసెంబ్లీని ఎక్కువ రోజులు నడపాలి. ఈ సమావేశాలకు ప్రతిపక్షం సహకరించాలి. కేంద్ర ప్రభుత్వం నుంచి చాలా నిధులు రావాల్సి ఉంది. బీఆర్ఎస్ చేసిన తప్పులను చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు వెళ్లాలి. ఈ ప్రభుత్వం ఎంత కాలం ఉంటుందో చూస్తామని బీఆర్ఎస్, బీజేపీ ఎమ్మెల్యేలు అనడం సరైంది కాదు. కొంత మంది ఎమ్మెల్యేలు అతి ఉత్సాహం ప్రదర్శిస్తున్నారు" అని కూనంనేని సాంబశివరావు తెలిపారు.

**ఆ ఎమ్మెల్యేలు ఓడిపోయారు :** "పార్టీ మారిన ఎమ్మెల్యేలు ఈ ఎన్నికల్లో ఓటమి చవి చూశారు. ఎమ్మెల్యేలను కొనుగోలు చేయడం సరైంది కాదు. ఎమర్జెన్సీలో తప్పు చేస్తే ఇప్పుడు చేయాలా..? గత ప్రభుత్వం కోదండరాం, రేవంత్‌రెడ్డిని, కమ్యూనిస్టులను హౌస్ అరెస్టులు చేసింది. స్వేచ్ఛలేని జీవితాన్ని తెలంగాణ ప్రజలు అంగీకరించారు. స్వేచ్ఛ తెలంగాణ రావాలి. పథకాల అమలులో విఫలమైన.. ప్రజలకు అర్థమయ్యేలా వివరించాలి. పంజరం నుంచి బయటకు వచ్చినట్లు ప్రజలు భావిస్తున్నారు. 26 ప్రజా సంఘాలను గత ప్రభుత్వం నిషేధించింది. గత ప్రభుత్వం దళితులకు మూడెకరాల భూమి, రెండు పడక గదుల ఇళ్ల, దళిత బంధు, బీసీ బంధును విస్మరించింది. ప్రతి నెల ఒకటో తేదీన ఎందుకు జీతాలు ఇవ్వలేదు.

విద్యార్థులకు ఉపకార వేతనాలు ఎందుకు ఇవ్వలేదు.బీఆర్ఎస్ తప్పులు చేయడం వల్లే అధికారం కోల్పోయింది" అని కూనంనేని సాంబశివరావు పేర్కొన్నారు.

# ఇంటికి వెళ్తున్నా.. మళ్లీ వస్తానో.. రానో తెలియదు

కొల్లాపూర్ : తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసిన బర్రెలక్క సెంటర్ ఆఫ్ ది అట్రాక్షన్‌గా నిలిచారు. కొల్లాపూర్ అసెంబ్లీ నియోజకవర్గంలో పోటీ చేసిన ఆమె ఓటమి పాలయ్యారు. ఈ ఎన్నికల్లో ఆమెకు 5,754 ఓట్లు మాత్రమే వచ్చాయి. అయితే ఓటమి తర్వాత తొలిసారిగా ఆమె ఓ యూట్యూబ్ ఛానల్‌తో ఎమోషనల్‌గా మాట్లాడారు. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసిన బర్రెలక్క సెంటర్ ఆఫ్ ది అట్రాక్షన్‌గా నిలిచారు. కొల్లాపూర్ అసెంబ్లీ నియోజకవర్గంలో పోటీ చేసిన ఆమె ఓటమి పాలయ్యారు. ఈ ఎన్నికల్లో ఆమెకు 5,754 ఓట్లు మాత్రమే వచ్చాయి. అయితే ఓటమి తర్వాత తొలిసారిగా ఆమె ఓ వీడియో చేసి పోస్ట్ చేయగా ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. తాను ఎన్నికల్లో నిలబడ్డ విషయం అందరికీ తెలిసిన విషయమే అని.. అంతకుముందు వరకు తాను హాస్టల్‌లోనే ఉన్నానని.. కానీ ఇప్పుడు హాస్టల్ ఖాళీ చేసి ఇంటికి వెళ్తున్నానని బర్రెలక్క చెప్పారు. తాను చిన్నప్పటి నుంచి హాస్టల్‌లోనే ఉన్నానని.. కాంపిటేషన్ పరీక్షలకు ప్రిపేర్ అయిన సమయంలో కూడా హాస్టల్‌లోనే ఉన్నట్లు ఆమె తెలిపారు. కానీ ఇప్పుడు ఎన్నికల లెక్కలు చేసుకోవాల్సి ఉండటంతోనే ఇంటికి వెళ్తున్నానని బర్రెలక్క వెల్లడించారు. ఇలా హాస్టల్ ఖాళీ చేయడం తనకు చాలా బాధగా ఉందని.. మళ్లీ వస్తానో రానో తెలియదని భావోద్వేగానికి గురయ్యారు. 2021 నుంచి ఇప్పటివరకు తాను ఒకే హాస్టల్‌లోనే ఉన్నానని బర్రెలక్క స్పష్టం చేశారు. హాస్టల్‌లో తనకు ఇంట్లోనే ఉన్న వాతావరణం ఉంటుందని.. ఫుడ్ కూడా చాలా బాగుంటుందని తెలిపారు. ఈ సందర్భంగా తన వీడియోలో హాస్టల్‌ను బర్రెలక్క చూపించారు. ఎన్నికల్లో తనకు మద్దతు తెలిపిన వాళ్లకు ఆమె కృతజ్ఞతలు తెలియజేశారు.

Printed, Published and owned by VISHWANATH V, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : VISHWANATH V, Rni Title Code No. TELTEL02115, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com